అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 22-3-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 83 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | పేజీలు 6 వెల : 5.00

మనం బాగుంటే...

ప్రధాని మోడీ, కేంద్ర మంత్రుల కోసం ఎయిర్ ప్యూరిఫైర్లు కొనుగోలు

- ఢిల్లీ కాలుష్యంపై చర్యలు శూన్యం



ఢిల్లీ

దేశ రాజధాని న్యూఢిల్లీలో కాలుష్యం ఏ స్థాయికి వెళ్లిందో మొన్నటివరకూ విన్నాం, టీవీల్లో చూశాం. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమస్యపై ఏమీ చేయకుండా...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తూ కూర్చున్నాయి. ప్రధాని కార్యాలయంలోని ఉన్నతాధికారుల కోసం, ప్రధాని నరేంద్రమోడీ కోసం, మంత్రుల కోసం 140 'ఎయిర్ ప్యూరిఫైర్ల'ను మాత్రం కేంద్రం కొనుగోలు చేసింది. అంటే...రాజధానిలోని సామాన్య ప్రజలు ఎటు పోయినా ఫరవాలేదు, ప్రధాని మోడీ, ఆయన చుట్టూ ఉండే అధికార యంత్రాంగం బాగుంటే చాలన్నమాట !

వివరాలు 9లో



కేసీఆర్ కన్నెర్ర

24 వేల కోట్లు ఇమ్మంటే.. 24 రూపాయలు కూడా ఇవ్వలే

- అర్హతలతో పనిలేదు.. పైరవీలు చేస్తేనే అక్కడ పనులు : శాసనమండలిలో కేంద్రంపై ముఖ్యమంత్రి గరం

నూతన రాష్ట్రమైన తెలంగాణకు ఆర్థిక చేయూతనివ్వని కేంద్రం వైఖరిని ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి తీవ్రంగా నిరసించారు. మోడీ సర్కారు రాష్ట్రం పట్ల మొదటి నుంచి ఇదే విధంగా వ్యవహరిస్తున్నది. గత మూడు బడ్జెట్లను పరిశీలిస్తే ఈ విషయం విదితమవుతున్నది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, గ్రాంట్ల విషయంలో టీఆర్ఎస్ వేసుకున్న అంచనాల్లో సగం నిధులను కూడా కేంద్రం విదల్చటం లేదు. ఈ క్రమంలో శాసనమండలి సాక్షిగా సీఎం.. కేంద్రంపై బుధవారం ఫైరయ్యారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు రూ.24 వేల కోట్లు అడిగితే రూ.24 కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇవ్వలేదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. ఈ పథకాలకు నిధులు ఇవ్వాలని నిటి ఆయోగ్ చెప్పినా కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. శాసనమండలిలో బుధవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలి నిటి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మాటలు విని సంతోషించామని.. సహకార సమాఖ్య వ్యవస్థ అని ప్రధాని చెప్పారని గుర్తుచేశారు. తాము ఏనాడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం వద్దకు పోలేదని స్పష్టం చేశారు. అన్నీ అర్హతలు ఉండి పైరవీలు చేస్తే గాని కేంద్రం వద్ద పనులు జరగడం లేదన్నారు. నిధుల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. మన దేశం అప్పు రూ.82 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. అందులో మోడీ ప్రభుత్వం రూ. 24 లక్షల కోట్ల అప్పులు చేసిందని వెల్లడించారు. ఈ అప్పును దుబారా అని అనగలమా? అని సీఎం ప్రశ్నించారు. 30 ఏండ్ల కిందట చైనా జీడీపీ మనకంటే తక్కువ అని గుర్తు చేశారు. ప్రస్తుతం చైనా జీడీపీలో మనది నాలుగో వంతు ఉన్నదని సీఎం తెలిపారు. కేంద్రం బడ్జెట్‌లో మూడో వంతు అప్పులకే పోతుందన్నారు. తెలంగాణ అప్పుల పాలైందని రాష్ట్ర బీజేపీ నాయకులు విమర్శించడం సరికాదని, ఆ పార్టీ అధికారంలో ఉన్న 21 రాష్ట్రాలు అప్పులు చేయడం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి అప్పులు చేస్తే తప్పేంటి అని అన్నారు. దేశంలో 24 గంటలపాటు విద్యుత్ ఇస్తున్నది ఒక్క తెలంగాణ రాష్ట్రమేనని సీఎం చెప్పారు. విద్యా విధానం కేంద్రం తన వద్ద ఉంచుకొని..వ్యవసాయం, ఆరోగ్య శాఖలను రాష్ట్రాలకు వదిలిపెట్టాలన్నారు. పట్టణ, గ్రామీణ అభివద్ధి శాఖలు కేంద్రం వద్ద ఎందుకు ఉండాలని సీఎం ప్రశ్నించారు. దేశంలో 70 వేల టీఎంసీల నీరు ఉందని, ప్రతీ ఎకరానికి నీరిచ్చే సౌకర్యం మన దేశంలో పుష్కలంగా ఉందన్నారు. 40 కోట్ల ఎకరాల భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉందన్నారు. 70 ఏండ్లుగా నీటి కోసం రాష్ట్రాలు కొట్లాడుతున్నాయని.. సరైనా అవగాహన లేకనే నీటి రంగంలో దారుణంగా విఫలమవుతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ ...9లో



ఏప్రిల్‌లో కొత్త రేషన్ కార్డులు : మంత్రి ఈటల



రేషన్‌కార్డులు తొలగించారని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంలేదని, సరుకులు తగ్గించారన్న ఆరోపణల్లో నిజం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఏప్రిల్ రెండోవారం నుంచి అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం రెండున్నర లక్షల ...9లో

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు!

'మీడియా' ప్రవేశాన్ని నియంత్రిస్తున్న పాలకులు

- ప్రభుత్వ వ్యతిరేక కథనాలు రాసిన జర్నలిస్టులకు బెదిరింపులు

వివరాలు 2లో

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

వివరాలు 2లో

ఎఫ్ఆర్‌డీఏ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడాలి వివరాలు 2లో
- ఢిల్లీలో బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ధర్నా

కార్పొరేట్ చేతుల్లో మీడియా..



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

వివరాలు 12లో

ప్రజా కోణంలో వార్తలు రాయాలి

- గణనీయమైన మార్పులు అవసరం : నవతెలంగాణ మూడో వార్షికోత్సవ సభలో అంపశయ్య నవీన్
- పౌరులను వినియోగదారులుగా చూస్తున్న కార్పొరేట్ మీడియా : ఎస్. వీరయ్య
- సవాళ్లను అధిగమిస్తూ పురోగమిస్తున్న నవతెలంగాణ : టెన్ టీవీ ఎమ్‌డీ వేణుగోపాల్

'గురుకుల' ఉద్యోగుల చలో అసెంబ్లీ ఉద్రిక్తం

- ఎస్వీకే వద్ద ర్యాలీని అడ్డుకున్న పోలీసులు, పలువురు అరెస్టు
- కనీసవేతనాలు చెల్లించాలని ఉద్యోగుల డిమాండ్



వివరాలు 9లో

మేఘాల్లో కాదు ...యమునా నది మురుగు నీటిలో..



అటు వరద ముప్పు..ఇటు నీటి కొరత..! 2

మహాగతి తేవొద్దు

- రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలి
- వ్యవసాయానికి కావల్సిన సహకారం అందించాలి :అసెంబ్లీలో సున్నం రాజయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మహారాష్ట్రలో జరిగిన పరిణామాలే రాష్ట్రంలో తలెత్తుతాయని సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆ పరిస్థితులు రాష్ట్రంలో రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రైతులకు ఆసరాగా ఉండాలని సూచించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర, సకాలంలో రుణాలు అందజేయడం, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయడంతో పాటు వ్యవసాయానికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందించాలన్నారు. బుధవారం అసెంబ్లీలో వ్యవసాయం, పౌరసరఫరాలు, పశుసంవర్ధక శాఖపై జరిగిన పద్దులపై ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఆధారపడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం ఆసర ఉండాలన్నారు. వ్యవసాయ సాగు తగ్గుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉండగా, ప్రసుత్తం 26లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమైందన్నారు. రుణమాఫీ ప్రకటించి నాలుగేండ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి ...9లో

జాడలేని రేవంత్

- సస్పెండ్ కాకున్నా అసెంబ్లీకి గైర్హాజర్
- రాజీనామా చేస్తే స్పీకర్ ఆమోదించడం లేదా?



వివరాలు 9లో



అట్లాగే..బ్యాంకులను.. జనాలను దోచి విదేశాలకు జంప్ అయ్యే బడా బాబులను పట్టేసే టెక్నాలజి కనిపెట్టండి..సార్..!!

దళితులపై దాడులు ఆపాలి

- దళిత యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి
- ఒక్కో దళిత కుటుంబానికి కనీసం రెండెకరాల భూమిని ఇవ్వాలి
- డీఎస్ఎంఎం ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్

న్యూఢిల్లీ : దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న దళితులపై దాడులను అరికట్టాలని, దళిత శోషన్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) ప్రధాన కార్యదర్శి రామచందర్ డోమ్ డిమాండ్ చేశారు. దళిత యువతకు ఉద్యోగాలను ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. దేశంలో దళితులపై దాడులు ఆపాలని, ఎస్సీ సబ్ ప్లాన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ డీఎస్ఎంఎం ఆధ్వర్యంలో బుధవారం పార్లమెంట్ మార్చ్ జరిగింది. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణీ అలీ, సీపీఐ(ఎం) ఎంపీలు శ్రీమతి టీచర్, సోం ప్రసాద్, ఏఐకేఎస్

ఎస్సీ సబ్ ప్లాన్‌ను పునరుద్ధరించాలి

జాతీయ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, ఏఐఏడబ్ల్యూయూ జాతీయ అధ్యక్షుడు తిరువక్కరసు పాల్గొని సంఘీభావం తెలిపారు. 'దేశంలో ప్రతి 15 నిమిషాలకు దళితులపై నేరం జరుగుతున్నది. ప్రతి రోజు ఆరుగురు దళిత మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారు. 2007-2017 వరకు దళితులపై అత్యాచారాలు 66శాతం పెరిగాయని వివిధ గణంకాలు తెలుపుతున్నాయి' అని డీఎస్ఎంఎం ఆందోళన వ్యక్తం చేసింది. జంతర్ మంతర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రారంభమైన డీఎస్ఎంఎం ర్యాలీ పార్లమెంట్ స్ట్రీట్ వరకు సాగింది. వివిధ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేతబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ నలుమూలల నుండి వచ్చిన వేలాది మంది ...9లో

దళితులపై పెరిగిన దాడులు 9



ఢిల్లీలో..

నర హంతకులకు జీవిత ఖైదు

'అన్సారీ' హత్య కేసులో 11 మందికి యావజ్జీవం

శిక్ష పడిన వారిలో బీజేపీ నేత, గో రక్షణ కమిటీ సభ్యులు

రాంచీ : జార్ఖండ్‌లోని రాయ్‌గఢ్‌లో తొమ్మిది నెలల క్రితం జరిగిన దౌర్జన్యకాండలో కిరాతకులకు శిక్షలు ఖరారయ్యాయి. బీఫ్ తరలిస్తున్నాడన్న నెపంతో అమాయకుడైన ముస్లిం వ్యక్తి అలీముద్దీన్ అన్సారీని కిరాతకంగా కొట్టి చంపిన కేసులో 11 మంది దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. శిక్ష పడిన వారిలో స్థానికంగా ఉన్న బీజేపీ నేత నిత్యానంద్ మెహతో సహా పలువురు స్థానిక గో రక్షణ కమిటీ సభ్యులున్నారు. శిక్ష పడిన వారందరికీ రూ.2 వేల చొప్పున జరిమానా కూడా కోర్టు విధించింది. అలీముద్దీన్ హన్సారీ హత్య కేసులో 12 మందిని దోషులుగా తేలుస్తూ కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి ఓం ప్రకాశ్ ఈనెల 16న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అయితే.. దోషుల్లో ఒకరు మైనర్ కావడంతో అతడికి శిక్ష ఖరారుపై కోర్టు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. మరోవైపు.. ఫాస్ట్ ట్రాక్ కోర్టు వెలువరించిన తీర్పును జార్ఖండ్ హైకోర్టులో సవాల్ చేయనున్నట్టు డిఫెన్స్ లాయర్ బీఎన్ సింగ్ తెలిపారు. గతేడాది జూన్ 29న రామ్‌గఢ్‌లోని బజార్‌టండ్‌లో మాంసం వ్యాపారి అన్సారీ వాహనాన్ని కొంతమంది గో రక్షకులు అడ్డగించారు. వాహనంలో బీఫ్ తరలిస్తున్నాడంటూ ఆతడిపై దాడికి తెగబడ్డారు. అన్సారీ ఎంత ప్రాధేయపడినా వినకుండా దారుణంగా కొట్టి చంపారు. అతడి వాహనాన్ని సైతం నిప్పు పెట్టారు. అయితే.. అన్సారీ తన వాహనంలో తరలిస్తున్నది బీఫ్ కాదని, అది మాంసమేనని ఫొరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. కేసులో బీజేపీ నేత నిత్యానంద్‌ను పోలీసులు జులై 1న అరెస్టు చేశారు.

అటు వరద ముప్పు..ఇటు నీటి కొరత..!

- 2050 కల్లా ఇండియాలో తాగునీటికి మరిన్ని ఇక్కట్లు..
- పెరగనున్న కాలుష్యం, లవణీయత : యునెస్కో నివేదిక

న్యూఢిల్లీ: 2050 వరకల్లా ప్రపంచంలోని 160 కోట్లమందికి వరద ముప్పు పొంచి ఉన్నదని, భారత్ తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనున్నట్టు ఉంటుందని ఐక్యరాజ్యసమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ(యునెస్కో) తన తాజా నివేదికలో వెల్లడించింది. మధ్య భారతంలో నీటి కొరత మరింత తీవ్రంగా ఉంటుందని, దాదాపు 40 శాతం ఉపరితల జలం కనుమరుగవుతుందని యునెస్కో తెలిపింది. ఉత్తర భారతంలో భూగర్భ జలాలు క్షీణిస్తాయని నివేదిక తెలిపింది. భూగర్భ జలాల క్షీణత పంజాబ్,హర్యానా,ఢిల్లీలో తీవ్రంగా ఉంటుందని నీటి వనరుల మేధోమథన సంస్థ ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి) ప్రధాన పరిశోధకుడు ఎస్‌కె సర్కార్ తెలిపారు. భూగర్భ జలాల క్షీణత లవణీయతకు కారణమవుతుందని ఆయన వివరించారు.

2050కల్లా దేశంలోని దక్షిణ, మధ్య రాష్ట్రాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి నాణ్యత అధ్వాన్నంగా ఉంటుందని నివేదిక తెలిపింది. భవిష్యత్ పరిస్థితులపై అంతర్జాతీయ అధ్యయనం, విశ్లేషణ ఆధారంగా యునెస్కో ఈ నివేదికను రూపొందించింది. కాలుష్య ఉపరితల జలాలే పరిమితం కాదని, భూగర్భ జలాల్లోనూ పెరుగుతుందని సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త ఎస్‌ఏఏబ్బాస్ నక్వీ అన్నారు. లోహ కాలుష్యం, మానవ వ్యర్థాల కాలుష్యం పెరుగుతుందని ఆయన తెలిపారు. మానవ వ్యర్థాలను(మలం) బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం, మరుగుదొడ్ల నిర్మాణంలో లోపాల వల్ల భూగర్భ జలాలు ఇ-కోలీ బ్యాక్టీరియా వంటి రోగకారక సూక్ష్మజీవులకు నెలవుగా మారుతాయని నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచంలోని 200 కోట్లమందికి రక్షిత తాగునీటి సౌకర్యం లేదని, అంతకు రెండింతల జనాభాకు(400 కోట్లమందికి) సురక్షిత పారిశుధ్య వసతులు లేవని యునెస్కో నివేదిక పేర్కొన్నది. 2010లో నీటి కోసం ఉన్న డిమాండ్ 2050 కల్లా దాదాపు అందులో మూడో వంతు అధికమవుతుందని తెలిపింది. ప్రస్తుతం అధిక మొత్తంలో నీటిని వినియోగిస్తున్న చైనా, ఇండియా, అమెరికా, రష్యా, పాకిస్థాన్‌లు 2050లోనూ మొదటి స్థానాల్లోనే కొనసాగనున్నట్టు నివేదిక తెలిపింది.

జనాభా పెరుగుదల నీటి కొరత, వాతావరణంలో మార్పులకు మాత్రమే పరిమితం కాదు. చారిత్రకంగా వరద తాకిడికి ప్రాంతాలను వరద ముంపు ప్రాంతాలుగా మార్చనున్నట్టు నివేదిక తెలిపింది. ప్రస్తుతం 120 కోట్లమంది వరద పీడిత ప్రాంతాల్లో నివాసముంటుండగా ఆ సంఖ్య 2050కల్లా 160 కోట్లకు పెరగనున్నట్టు నివేదిక తెలిపింది. 45 లక్షల కోట్ల ఆస్తులకు వరదల వల్ల ముప్పు ఉంటుందని అంచనా.

రానున్న నీటి కొరతకు సహజసిద్ధ పరిష్కారాలను యునెస్కో సూచించింది. ఉదాహరణకు..రాజస్థాన్‌లోని 1000 గ్రామాల రైతులు తమ సాగు అవసరాలకు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తున్న పద్ధతులు. మరో ఉదాహరణ..గంగానది పరివాహక ప్రాంతంలో వరదనీటిని భూగర్భంలో నిల్వ చేసి నీటి ఎద్దడి సమయంలో వాడుకునే పద్ధతి(యూటీఎఫ్‌ఐ ప్రాజెక్ట్)..ఈ ప్రాజెక్ట్ ద్వారా ఓవైపు వరద ముప్పును ఎదుర్కొంటూ మరోవైపు కరువు(నీటి ఎద్దడి)ని నివారించడం గమనార్హం.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు!

'మీడియా' ప్రవేశాన్ని నియంత్రిస్తున్న పాలకులు

- ప్రభుత్వ వ్యతిరేక కథనాలు రాసిన జర్నలిస్టులకు బెదిరింపులు
- వివిధ రాష్ట్రాల్లో ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల సేవలు నిలిపివేత



'మీడియా' ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందన్న అక్కసు అధికార పార్టీ నాయకుల్లో పెరిగిపోయింది. సామాజిక మాధ్యమం, ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయటం, అధికార కార్యాలయాలపై మీడియా దృష్టి పడకుండా అడ్డుకోవటం, నియంత్రణ సర్వసాధారణంగా మారింది. తమకు వ్యతిరేకంగా మాట్లాడారని..అప్పటి త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ 'స్వాతంత్రదినోత్సవ' ప్రసంగాన్ని మోడీ సర్కార్ నిలిపివేయటం ప్రజలు కండ్లారా చూశారు. మొత్తంగా నేడు కేంద్రంలోని మోడీ సర్కార్ 'మీడియా'ను నియంత్రించటానికి పూర్తి శక్తియుక్తుల్ని ఉపయోగిస్తున్నది.

న్యూఢిల్లీ : భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికీ తీసికట్టులా తయారైంది. కేంద్ర, రాష్ట్రాల్లోని అధికార పార్టీ నాయకుల నియంతృత్వ ధోరణి పత్రికా స్వేచ్ఛను అణచివేస్తున్నాయి. అనేక విషయాల్లో ప్రధాన మీడియా 'నిశ్శబ్దాన్ని' ఆశ్రయిస్తోంది. కేవలం నాయకుల ప్రజా సంబంధాల్ని మెరుగుపర్చే సాధనంగా మీడియాను మార్చేశారు. సత్యశోధనను నమ్ముకున్న మీడియాపై ధన, అధికార బలాన్ని పాలకులు ప్రయోగిస్తున్నారు. కొత్త కొత్త పద్ధతుల్లో నియంత్రణా మార్గాల్ని ఉపయోగిస్తున్నారని, అధికార కేంద్రాలకు 'మీడియా'ను దూరం చేస్తున్నారని ప్రఖ్యాత వార్తా మ్యాగజైన్ 'ఎకానమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' తాజా ఎడిటోరియల్ కథనం తెలియజేసింది. దీంట్లో పేర్కొన్న విషయాలు ఇలా ఉన్నాయి...

ఇంతకు ముందులా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని అధికార గణం (ఐఎఎస్, ఐపీఎస్, కేంద్ర సర్వీసులు) 'మీడియా' ముందు మాట్లాడటానికి జంకుతున్నారు. కనీసం ప్రభుత్వ పరిధిలో సైతం ఎలాంటి చర్చా జరగటం లేదు. కొన్ని ముఖ్యమైన ప్రభుత్వ విధానాలపై స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి బ్యూరోక్రసీలో లేదు. అదేగనుక జరిగితే...'పరిశోధనాత్మక జర్నలిజం' నిజాల్ని పట్టేస్తుందన్న భయం పాలకుల్లో ఉంటోంది. ఒకవేళ ఇలాంటి కథనాలు మీడియా వెల్లడిస్తే...అది ప్రతిపక్ష పార్టీల పని అన్న ముద్రవేస్తున్నారు. అధికార పార్టీ నేతలు 'మీడియా'పై నియంత్రణను బలంగా కోరుకుంటున్నారు. 2017లో జర్నలిస్టులపై 63 పరువునష్టం కేసులు వేశారు. అందులో అత్యధికంగా మహారాష్ట్రలో 19 కేసులు వేశారు. ఇక దేశంలో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసిన ఘటనలు 77. ఇందులో అత్యధికంగా 40మార్లు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో ఇంటర్నెట్ నిలిపివేశారు.

గత ఏడాది మరీ దారుణం

గతమూడేండ్లుగా 'భారతీయ మీడియా' దారుణమైన నియంత్రణకు గురవుతోంది. అందునా 2017 సంవత్సరం భారతీయ మీడియాకు ఎన్నో చేదు అనుభవాల్ని మిగిల్చింది. దేశంలో పత్రికా స్వేచ్ఛకు ఏమాత్రం అనుకూలమైన వాతావరణం లేదు. 2017లో 11 మంది జర్నలిస్టుల్ని హత్యచేశారు. కర్నాటకలో గౌరీలంకేశ్, శంతను భౌమిక్ వంటివా రిని... వెంటాడి మరీ అతి కిరాతకంగా హత్యచేశారు. గౌరీలంకేశ్ హత్య విషయమై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. అయినప్పటికీ కేసు విచారణలో పోలీసులు ఏమాత్రమూ పురోగతి సాధించలేకపోయారు. ఇక దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై పెద్ద సంఖ్యలో దాడులు జరిగాయి. ఇందులో కేవలం 27కేసుల్లో మాత్రమే నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు.

- రాజస్తాన్ అయితే మీడియాపై నియంత్రణ కోసం ఏకంగా ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. బీజేపీ అనుకూల మీడియాకు మాత్రమే ప్రధాని మోడీ ఇంటర్వ్యూలు ఇస్తున్నారు.
- దేశవ్యాప్తంగా ప్రధాన మీడియా ఏదీ కూడా ప్రస్తుత ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రత్యేక కథనాల్ని రాయటం లేదు. కేవలం రోజువారీ వార్తలకు మాత్రమే పరిమితమై పోయాయి.
- సంబంధిత శాఖ ఉన్నతాధికారి అనుమతి లేకుండా ఎవరూ కూడా 'మీడియా'తో మాట్లాడటానికి వీల్లేదు...అంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ బ్యూరోక్రాట్స్‌కు ఆదేశాలు జారీ చేసింది.
- బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడి ఆస్తులు 300 శాతం పెరగటం, కేంద్ర మంత్రి స్మృతీఇరానీ డిగ్రీ అర్హత...అంశాల్ని మీడియా హఠాత్తుగా మూసేశాయి. కారణం పాలక పక్షాల నుంచి వచ్చిన బెదిరింపులే.
- ప్రభుత్వ వ్యతిరేక వార్తల్ని రాస్తోందన్న అక్కసుతో 'ఎన్‌డీటీవీ' యాజమాన్యంపై సీబీఐ దాడులు జరిగాయి.
- అధికారంలో ఉన్న పాలకుల ప్రజా సంబంధాల్ని మెరుగుపర్చటం కోసమన్నట్టుగా ప్రధాన మీడియా వ్యవహరిస్తోంది. అందుకు ఫలితంగా అనుకూల మీడియాకు పెద్ద పెద్ద అడ్వర్టయిజ్‌మెంట్స్ దక్కుతున్నాయి.



ఎఫ్ఆర్‌డీఏ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడాలి
- ఢిల్లీలో బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ధర్నా
- సంఘీభావం తెలిపిన వామపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ : ఎఫ్ఆర్‌డీఏ బిల్లును ఉపసంహరించుకోవాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఢిల్లీలో బుధవారం పార్లమెంట్ స్ట్రీట్‌లోని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) ఎంపీ తపన్ సేన్, సీపీఐ ఎంపీ డి.రాజా, ఆరెస్పీ ఎంపీ ప్రేమ్‌చంద్రన్ పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకులపై దుష్ప్రచారం జరుగుతున్నదని, దీనికి మోడీ ప్రభుత్వమే నాయకత్వం వహిస్తోందని అన్నారు. సామాన్య ప్రజలకు నష్టం చేకూర్చే అనేక విధానాలు మోడీ సర్కార్ పార్లమెంట్ వేదికగా రూపకల్పన చేస్తోందని, 90 శాతం మంది ఎంపీలకు వాటి గురించి సరిగా తెలియడం లేదని అన్నారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ఎంత ప్రమాదకరమైందో పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) ఎంపీలు తెలిపారని, అయినప్పటికి కేంద్ర ప్రభుత్వం మోసం పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డి.రాజా మాట్లాడుతూ పార్లమెంట్‌లో తాము ఈ అంశాన్ని లేవనెత్తుతామని, బిల్లును అడ్డుకునేందుకు ఇతర పార్టీలను కలుపుకొని పోరాడుతామని తెలిపారు. ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేటీకరణకు తలుపులు తెరిచిందని, కార్పొరేట్ల చేతుల్లో దేశాన్ని పెట్టాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. "ప్రభుత్వ బ్యాంకులను రక్షించండి. ప్రజల సొమ్మును కాపాడండి. ప్రభుత్వ బ్యాంకులను ప్రయివేటీకరణ చేయొద్దు, పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి" వంటి డిమాండ్లతో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక చైర్మన్ కెకె నైయర్, కన్వీనర్ సంజీవ్ కె. బండలీష్, ఏపీ తెలంగాణ భెఫీ నేతలు ఆర్.అజయ్‌కుమార్, బి.శ్రీనివాస్, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఐబీఈఏ, ఏఐబీఓసీ, ఎన్‌సీబీఈ, ఏఐబీఓఏ. బీఈఎఫ్‌ఐ, ఐఎన్‌బీఈఎఫ్, ఐఎన్‌బీఓసీ, ఎన్ఓబీడబ్ల్యూ, ఎన్ఓబీఓ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

అన్నదాత ఆత్మహత్యలపై మూగబోయిన ప్రధాని

వ్యవసాయ సంక్షోభంపై సర్కార్‌కు చలనంలేదు

- భూమి అధికార్ ఆందోళన సదస్సులో వక్తలు
- దేశంలో పరిస్థితిపై రెండు రోజుల పాటు సదస్సు



న్యూఢిల్లీ : దేశంలో వ్యవసాయ సంక్షోభం మోడీ సర్కార్ పట్టడం లేదని భూమి అధికార్ ఆందోళన్ (బిఎఎ) సదస్సులో వక్తలు ధ్వజమెత్తారు.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, బాధ్యత గల ప్రధాన మంత్రి కనీసం మాట్లాడటం లేదని విమర్శించారు. రైతాంగం చిన్నాభిన్నం అవుతున్నారని, వ్యవసాయ రంగం క్షీణింస్తోందని అన్నారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం సబబు కాదని అన్నారు. వ్యవసాయం లేనిదే దేశం లేదని, రైతు లేనిదే మనిషి లేడని, అలాంటి మనిషిని రక్షించే పనిలో అన్నదాత బతుకు చితికిపోతుంటే... పాలక వర్గాలు చూస్తూ ఊరుకుంటున్నాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయలేదని, రుణమాఫీ హామీని పక్కన పెట్టారని అన్నారు. రాజకీయాలు మతం వేరని, మతం కొందరికి సంబంధించినదని, రాజకీయాలు అందరకి సంబంధించినవని అన్నారు. కనుక రాజకీయాల్లో జోప్పించొద్దని కోరారు. దేశంలో "వ్యవసాయ సంక్షోభం, దళిత, మైనార్టీలపై గో గూండాల దాడులు"పై 200 రైతుల సంఘాలతో కూడిన బీఏఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్థానిక కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఫోటో ఎగ్జిబిషన్, జాతీయ సదస్సులు జరిగాయి. పలు అంశాలపై వివిధ సెషన్స్‌లో మేధావులు, వివిధ ప్రజా సంఘాలు నేతలు, సామాజిక సంఘాల నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని భూమి అధికార్ ఆందోళన్ నేతలకు పిలుపు నిచ్చారు. రైతాంగ సమస్యలతో పాటు సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఎత్తుకోవాలని, పాలక వర్గాలపై ఉద్యమించాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగం ఐక్యం కాకుండా విడదీసే ప్రయత్నం చేస్తోందని, దాన్ని రైతు సంఘాలు తిప్పికొట్టాలని కోరారు. మతం పేరుతో విభజన దేశానికి ప్రమాదమని మనందరం దీన్ని ఎదురించాలని అన్నారు. వ్యవసాయం సంక్షోభంతో వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోయిందని, ఆహార భద్రత కల్పించలేక పోతున్నామని అన్నారు. బీఏఏ చేస్తోన్న ఆందోళనకు సీపీఐ(ఎం) మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, ఏం తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో, ఏం మాట్లాడాలో వంటి వాటిని కూడా నిర్ణయించే శక్తులు పెరిగాయని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఈ కుట్రలు సాగుతున్నాయని అన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని, రైతులు, దళితులు, ఆదివాసులు, మైనార్టీలపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వాలు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తోన్నాయని దుయ్యబట్టారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఫాసిస్టు పాలన సాగుతుందని, ప్రజలను ఐక్యం కాకుండా చేస్తోందని అన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాలు, జాతులు పేరుతో విభజనకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని అధిగమించి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయమంటే ప్రభుత్వానికి అవసరం లేదని, అందుకనుగుణంగానే ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. కార్పొరేట్లకు దోచి పెట్టి, పేదల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేడీయూ మాజీ ఎంపీ శరద్ యాదవ్, సీపీఐ ఎంపీ డి.రాజా, ఆర్జేడి ఎంపి మనోజ్ జా, ఎన్సీపి ఎంపీ డిపి తిరుపతి, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిశ్వాస్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్, ఎస్పీ ఎంపీ నీరాజ్ శేఖర్, సామాజిక ఉద్యమ కారులు తీస్తా సెతల్వాద్, కంచె ఐలయ్య, మౌలాన అనీఫ్, సప్త మనగీర్, మేధా పాట్కార్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, సీపీఐ(ఎం) ఎంపీలు జితేంద్ర చౌదరి, సోం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయం

మయన్మార్ అధ్యక్షుడి రాజీనామా !

నైపీడా: మయన్మార్ అధ్యక్షుడు హతిన్ క్యా తన పదవికి రాజీనామా చేశారు. మయన్మార్‌కు చెందిన ప్రముఖ నాయకురాలు, హక్కుల నేత ఆంగ్ సాన్ సూకీకి కుడి భుజంగా ఉన్న హతిన్ తన పదవి నుంచి వైదొలిగారు. హతిన్ రాజీనామా చేసినట్టు మయన్మార్ అధ్యక్ష కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వారం రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటామని అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసింది. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి చెందిన హతిన్ క్యా రెండేండ్ల కంటే తక్కువ సమయం పదవిలో ఉన్నారు. అయితే, విశ్రాంతి కోసమే తాను పదవి నుంచి తప్పుకున్నట్టు హతిన్ తెలిపారు. ఆయన తన పదవికి రాజీనామా చేస్తారని గతేడాది నుంచి మీడియాలో పలు కథనాలు వెలువడ్డ సంగతి తెలిసిందే. కానీ వాటిని పార్టీ ఖండిస్తూ వచ్చింది. గతంలో ఆయన పలుమార్లు అనారోగ్య కారణాలతో విదేశాల్లో చికిత్స చేయించుకున్నారు. ఇటీవల జనవరిలో కూడా సింగపూర్‌లో చికిత్స పొందారు. ఉపాధ్యక్షుడు యు మైయింట్ స్వే తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 2016లో జరిగిన ఎన్నికల్లో అంగ్‌సాన్ సూకీ సారథ్యంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీ విజయం సాధించింది. అప్పుడు అంగ్‌సాన్ సూకీనే అధ్యక్షురాలు అవుతారని అందరూ భావించారు. కానీ, ఆ దేశ రాజ్యాంగం ప్రకారం.. విదేశీయుడిని పెళ్లి చేసుకున్న కారణంగా ఆమె అధ్యక్ష పదవికి దూరమయ్యారు. ఆమె స్థానంలో తనకు అత్యంత విధేయుడైన హితేన్‌కు పట్టం కట్టి సలహాదారుగా వ్యవహరించారు. ప్రధాని హోదాకు సమానమైన స్టేట్ కౌన్సిలర్‌గా, విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే దేశ పాలనలో తనదైన ముద్ర వేశారు. అయితే, మయన్మార్ బలగాలు రోహింగ్యా ముస్లింలను ఊచకోత కోసినప్పటికీ సూకీ ఏ మాత్రం పట్టించుకోలేదు.

ఆస్ట్రేలియా మహిళ హత్య కేసులో... అమెరికా పోలీస్ అధికారి అరెస్ట్

సిడ్నీ: ఆస్ట్రేలియా మహిళ హత్య కేసులో అమెరికా పోలీస్ అధికారి అరెస్టయ్యాడు. ఇది జాత్యహంకార హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. యూఎస్ ప్రాసిక్యూటర్ వెల్లడించిన వివరాల ప్రకారం...గతేడాది జులైలో మిన్నెపోలిస్ నగరంలో జస్టిన్ డామండ్ అనే ఆస్ట్రేలియా మహిళ దారుణ హత్యకు గురైంది. మొహ్మద్ నూర్ (32) అనే పోలీస్ అధికారి ఈ హత్యకు పాల్పడినట్టు ఆధారాలు లభించాయి. నూర్‌ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. డామండ్ శరీరంలో లభించిన బుల్లెట్ నూర్ తుపాకీ నుంచి ఫైర్ అయినట్టు దర్యాప్తు బృందాలు నిర్ధారించాయి. అయితే, తుపాకీ మిస్ ఫైర్ కావడంతోనే డామండ్ చనిపోయిందని నూర్ తరుపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. అయితే, నూర్ తరుపు వాదనలతో న్యాయస్థానం ఏకీభవించలేదు. ఇది జాత్యహంకార హత్యగా భావిస్తున్నామని వ్యాఖ్యానించింది. ఒకవేళ ఈ కేసులో నూర్ దోషిగా తేలినట్టయితే 25 ఏండ్ల కఠిన కారాగార శిక్ష పడే అవకాశముందని ప్రాసిక్యూటర్ తెలిపారు.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

26 మంది మృతి, 52 మందికి గాయాలు

- ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటించుకున్న ఐఎస్



కాబూల్: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ ఉగ్రదాడితో రక్తమోడింది. కాబూల్‌లోని అలీ ఆబాద్ ఆస్పత్రి ఎదురుగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 26 మంది మృతి చెందారు. 52 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. పేలుడు సంభవించిన ప్రాంతానికి సమీపంలో కాబూల్ యూనివర్సిటీ ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్టు ఐఎస్ ప్రకటించుకుంది. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...కాబూల్‌లో నూతన సంవత్సరం (నౌరజ్) ప్రారంభ వేడుకల్లో పాల్గొనడానికి గుమికూడిన వందలాది మందిని లక్ష్యంగా చేసుకొని ఐఎస్ ఈ దాడికి పాల్పడిందని అనుమానిస్తున్నామని అన్నారు. దాడికి గురైన వారిలో అత్య ధికులు అల్పసంఖ్యాకులైన షియాలు. ఈ దాడిలో 26మంది మృతి చెందారు. 52 మంది గాయపడ్డారు. ఆత్మాహుతి దాడికి పాల్పడ్డ వ్యక్తి కాలి నడకనే ప్రార్థనా స్థలం వద్దకు వచ్చాడనీ, పోలీసులు అతన్ని గుర్తించగానే అతడు తన ఒంటి మీదున్న బాంబును పేల్చేశాడని అన్నారు.

కాబూల్ పశ్చిమ ప్రాంతంలో ఉన్న కాబూల్ యూనివర్సిటీకి సమీపంలో, అలీ ఆబాద్ ఆస్పత్రి వెలుపల ఈ పేలుడు జరిగిందన్నారు. షియాలకు చెందిన ఈ ప్రార్థనా స్థలంపై గతంలో కూడా దాడులు జరిగాయి. 2016,అక్టోబర్‌లో జరిగిన దాడిలో 14 మంది మృతి చెం దారు. 2011లో జరిగిన మరో దాడిలో 59 మంది మరణించారు. ఇది కాబూల్ నగరంలో ఉన్న అతి పెద్ద ప్రార్థనాలయాల్లో ఒకటి. కాబూల్‌లో జరిగే నూతన సంవత్సర వేడుకలకు ఇది ప్రసిద్ధి గాంచింది. అఫ్ఘనిస్తాన్ జనాభాలో షియాల జనాభా 15 శాతం. వీరిలో అత్యధికులు హజారా అనే సముదాయానికి చెందినవారు.

బొకోహరమ్ చెర నుంచి 76 మంది బాలికలకు విముక్తి



అబూజా: ఫిబ్రవరిలో కిడ్నాప్ చేసిన బాలికలను బొకోహారం ఉగ్రవాదులు బుధవారం విడుదల చేశారు. ఈశాన్య డాప్చి పట్టణంలో బొకోహారం ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన వారిలో 76 మంది బాలికలు సురక్షితంగా విడుదలయ్యారని సమాచార శాఖ మంత్రి లాయ్ మహ్మద్ వెల్లడించారు. బొకోహారం ఉగ్రవాదులు, నైజీరియన్ ప్రభుత్వానికి మధ్య చర్చలు సఫలం కావడంతో తీవ్రవాదులు బాలికలను విడిచిపెట్టారని తెలిపారు. కొంతమంది మిత్రుల సాయంతో కిడ్నాప్‌నకు గురైన బాలికలను సురక్షితంగా కాపాడామని పేర్కొన్నారు. అయితే బొకోహారం తీవ్రవాదులు ఎవరికి అవకాశం ఇవ్వకుండా బాలికలను కిడ్నాప్ చేసిన స్కూల్ దగ్గర వదిలిపెట్టి వెళ్లారని కిడ్నాప్‌నకు గురైన బాలికల తల్లిదండ్రుల గ్రూప్‌నకు చెందిన వ్యక్తి ఒకరు తెలిపారు. బాలికలను వాహనాల్లో తీసుకువచ్చి స్కూల్ వద్ద వదిలి వెళ్లినట్టు తెలిపారు. నైజీరియాతోపాటు లేక్ ఛాడ్ ప్రాంతాల్లో బొకోహారం ఉగ్రవాదులు తమ కార్యకలాపాలను కొనసాగించేందుకు అవసరమైన నిధుల కోసం కిడ్నాప్‌ను అస్త్రంగా వాడుకొని ప్రభుత్వంపై బెదిరింపులకు పాల్పడ్డారు.

మొత్తం 110 మంది బాలికలు కిడ్నాప్ అయ్యారంటూ వార్తలు వస్తున్నాయి. అయితే నైజీరియా అధికారులు మాత్రం ఎంతమంది బాలికలు కిడ్నాప్‌నకు గురయ్యారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

త్వరలో హెచ్1-బీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



వాషింగ్టన్: అమెరికాలో హెచ్1-బీ వీసా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 2 నుంచి హెచ్1-బీ వీసా దరఖాస్తులు స్వీకరించనున్నట్టు యూఎస్ పౌర వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. అలాగే హెచ్1-బీ వీసా దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. 2019 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రీమియం ప్రాసె సింగ్ రద్దు చేస్తున్నట్టు తెలిపింది. భారతీయ ఐటీ నిపుణులు ఎక్కువగా ఈ వీసాల ద్వారా అమెరికా వెళ్తుంటారు. హెచ్1-బీ వీసాలతో అమెరికాలోని కంపె నీలు భారత్, చైనా లాంటి దేశాల నుంచి టెక్నాలజీ నిపుణులను వేల సంఖ్యలో నియమించుకుంటున్నాయి. హెచ్1-బీ తాజా దరఖాస్తులు 2019 ఆర్థిక సంవత్స రం కోసం తీసుకుంటున్నారు. 2019 సంవత్సరానికి ప్రీమియం ప్రాసెసింగ్ రద్దు చేస్తున్నామని, అయితే ఈ ఏడాదికి సంబంధించి 2018, సెప్టెం బరు10 వరకు ప్రీమియం ప్రాసెసింగ్‌ను కొన సాగించనున్నట్టు తెలిపింది. ఈ ప్రీమియం ప్రాసెసింగ్‌కు సంబంధించి ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్నా ప్రజలకు సమాచారం ఇస్తామని యూఎస్ సీఐఎస్ స్పష్టం చేసింది. హెచ్1-బీ వీసా దరఖా స్తుల పరిశీలన సమయం తగ్గించేందుకే తాత్కాలికంగా ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపేస్తున్నా మని వెల్లడించింది.

న్యూటన్, డార్విన్‌ల సమాధుల పక్కనే హాకింగ్ సమాధి



వాషింగ్టన్: ఇటీవల మరణించిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అస్థికలను వెస్ట్‌మిన్‌స్టర్ అబే లోని ఈనెల 31న సర్ ఐజాక్ న్యూటన్ సమాధి పక్కనే ఖననం చేయనున్నారు. హాకింగ్ ఈ నెల 14న కేంబ్రిడ్జిలోని తన నివాసంలో కన్నుమూశారు. హాకింగ్ అంత్యక్రియలు యూనివర్సిటీలోని గ్రేట్ సెయింట్ మేరీస్ చర్చిలో జరుగుతాయని ఆయన కుటుంబం తెలిపింది. ఈ చర్చి హాకింగ్ గత 50 ఏండ్లుగా పని చేస్తున్న గోన్‌విల్ అండ్ కీస్ కాలేజీకి దగ్గరలో ఉంది. హాకింగ్ పిల్లలు, లూసీ, రాబర్ట్, టిమ్‌లు కాలేజీ వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. 'మా తండ్రి ఎంతగానో ప్రేమించిన నగరంలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించాము' అని అన్నారు. 1882లో మరణించిన ఛార్లెస్ డార్విన్ సమాధి కూడా హాకింగ్ సమాధికి దగ్గరలోనే ఉంది. హాకింగ్ అస్థికలను ప్రఖ్యాత శాస్త్రవేత్తల సమాధులకు దగ్గరలోనే ఖననం చేయడమంటే ఆయనకు సముచిత గౌరవం ఇవ్వడమే అవుతుందని డీన్ ఆఫ్ వెస్ట్‌మిన్‌స్టర్ డాక్టర్ జాన్ హాల్ తెలిపారు.

అణు రియాక్టర్‌పై దాడికి మాదే బాధ్యత : ఇజ్రాయిల్ బలగాలు

డమాస్కస్: సిరియాలోని దీర్-ఎజ్-జోర్ నగరంలో నిర్మాణంలో ఉన్న అణు రియాక్టర్‌పై 2007లో బాంబు దాడి చేసింది తామేనని ఇజ్రాయిల్ రక్షణ దళాలు తాజాగా వెల్లడించాయి. ఆ దాడికి సంబంధించిన వివరాలు ఇటీవల వెల్లడించారు. 2007, సెప్టెంబర్6వ తేదీ రాత్రి ఆ దాడి జరిగింది. ఆ రహస్య దాడిని ఇన్నాళ్లూ ఇజ్రాయిల్ ఖండిస్తూ వస్తున్నది. ఇప్పుడు మాత్రం ఇజ్రాయిల్ రక్షణ శాఖ ఆ దాడిని అంగీకరిస్తూ ప్రకటన చేసింది. కానీ పూర్తి వివరాలను వెల్లడించలేదు. మొత్తం నాలుగు ఎఫ్-16 జెట్లతో అణు రియాక్టర్‌పై దాడి చేశామని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది.

దేశానికి తెలంగాణ అన్నం పెట్టాలి

- ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యం
- డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులను కట్టడం లేదని వ్యాఖ్య

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి హరీశ్‌రావు




నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణను కోటి ఎకరాల మాగాణిని చేసేందుకే ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. భవిష్యత్‌లో ఈ రాష్ట్రం దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా మారాలి. కోనసీమ కావాలి. ఆకుపచ్చ తెలంగాణ కావాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రూపకల్పన చేశారని చెప్పారు. బుధవారం శాసనసభలో స్పీకర్ మధుసూదనాచారి అధ్యక్షతన ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యేలు జి.కిషన్‌రెడ్డి , డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ కోటి ఎకరాలకు నీరిస్తామన్న హామీ అసాధ్యంలా కనిపిస్తున్నదని అభిప్రాయపడ్డారు. ప్రాజక్టుల అంచనా వ్యయం విపరీతంగా పెంచారని ఆరోపించారు. కొన్ని ప్రాజెక్టులకు డీపీఆర్‌లు కూడా లేకుండానే నిర్మాణాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి హరీశ్‌రావు సమాధానమిస్తూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మొబిలైజేషన్ అడ్వాన్సులతోపాటు ఈపీసీ విధానాన్ని రద్దు చేశామని స్పష్టం చేశారు. ప్రతి ప్రాజెక్టుకు చెందిన డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘానికి ఇచ్చామని గుర్తు చేశారు. డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులను కడుతున్నామని కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏ ప్రాజెక్టును చేపట్టలేదని వివరించారు. నీటి లభ్యత ఆధారంగానే ఐదు ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశామని తెలియజేశారు. రీఇంజినీరింగ్ తరువాత కాళేశ్వరం కింద 16 లక్షల నుంచి 37 లక్షల ఎకరాలకు ఆయకట్టు పెరిగిందని, 270 కిలోమీటర్ల మేర గోదావరి సజీవంగా ఉండబోతున్నదని వివరించారు. గోదావరి నదిపై 3 ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. గోదావరిలో నీటి నిల్వతో భూగర్భ జలాల వ ద్ధి జరుగుతుందని, మత్స్య సంపద కూడా పెరుగుతుందని ప్రకటించారు. రీడిజైనింగ్ చేయకపోతే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు అలాగే మిగిలిపోయేదన్నారు. పాలమూరు ప్రాజెక్టు కట్టకపోతే తెలంగాణ ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసినట్టు అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తేనే భవిష్యత్ తరాలకు న్యాయం చేసిన వాళ్లమవుతామని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తేనే క ష్ణా జలాల కేటాయింపుల్లోనూ న్యాయం జరగడానికి, మనం నీటి కేటాయింపులను అడగటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కాంతనపల్లి కడితే 20 గిరిజన గ్రామాలు, 12 వేల ఎకరాలు మునుగుతాయని, అందుకే ఈ ప్రాజెక్టు విషయంలో జాగ్రత్త వహించి రీఇంజినీరింగ్ చేశామన్నారు. 20 గిరిజన గ్రామాలు మునగకుండా చేసింది తప్పా? అని ప్రశ్నించారు. రామప్ప దేవాలయాన్ని కాపాడేందుకే దేవాదుల రీడిజైనింగ్‌కు పూనుకున్నామన్నారు. తుపాకులగూడెం వద్ద కాపర్ డ్యాం ఏర్పాటు చేసి చెరువులకు నీరు ఇస్తున్నామని తెలిపారు. దుమ్ముగూడెం వద్ద నీటి లభ్యత అధికంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లా వాసులకు నీరు అందించేందుకు దుమ్ముగూడెం ప్రాజెక్టు రీఇంజినీరింగ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఒక్క నీటి చుక్క వదులుకోవడానికి కానీ, ఒక ఎకరా ఎండిపోవడానికి వీల్లేకుండా ప్రాజెక్టులను నిర్మిస్తున్నామన్నారు. భారతదేశంలోనే ప్రాజెక్టులను కట్టడంలో రాష్ట్రం కొత్త ఒరవడిని సృష్టించిందని చెప్పారు. రాత్రింభవళ్లు మూడు షిఫ్టుల్లో పని చేసి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పనిచేస్తున్నామని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు ఆగాలి, ప్రతి నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని సభలో ప్రకటించారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి మాత్రం ప్రజల ఆకాంక్షలే ముఖ్యమని మంత్రి తెలియజేశారు. కాళేశ్వరం పనులు పనుల గురించి ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, కె.విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పారు. గతంలో ఏ ప్రాజెక్టు పనులు జరగనంత వేగంగా కాళేశ్వరం పనులు చేపడుతున్నట్టు వివరించారు. పహాడీ షరీఫ్, మౌలా అలీ దర్గాల వద్ద ర్యాంపుల నిర్మాణం, నవజాతశిశువుల సంరక్షణ విధానం తదితర ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానాలు చెప్పారు.

ఉద్యోగాల భర్తీపై స్పష్టత ఇవ్వడం లేదు

ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య



ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని టీడీపీ ఎమ్మెల్యే ఆర్. క ష్ణయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో మాట్లాడుతూ గ్రూప్–1లో 1500, గ్రూప్–3లో 8 వేలు, గ్రూప్–4లో 12 వేల ఖాళీలున్నాయని తెలియజేశారు. అలాగే నేడు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయని, జూనియర్ అసిస్టెంట్లతో ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.


దొంగల సింగారమా? ప్రగతి సింగారమా?

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మా గ్రామం దొంగల సింగారమా? ప్రగతి సింగారమా? అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాసనసభలో ప్రశ్నించారు. జీరో అవర్‌లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన విన్నపాన్ని సభ ముందుకు ఉంచారు. మా గ్రామం దొంగల సింగారం. 1996లో మా గ్రామం పేరును ప్రగతి సింగారంగా మార్చారు. కానీ గెజిట్‌లో చేర్చలేదు. ప్రస్తుతం వాడుకలో దొంగల సింగారంగానే కొనసాగుతున్నది. మా గ్రామం పేరు ప్రగతి సింగారమా? కాదా? తెలపాలి. వీలైనంత త్వరగా ప్రగతి సింగారంగా గెజిట్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

విప్లవాత్మకమైన మార్పులు: తలసాని



టీఆర్ఎస్ పాలనలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శాసనసభలో మత్స్య, పశుసంవర్ధక శాఖ పద్దులపై చర్చ సందర్భంగా యాదవ్ మాట్లాడారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. దాదాపు రూ. 5 వేల కోట్ల నిధులతో యాదవులకు గొర్రెలు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది పశుపోషణ, మత్స్య సంపదపై ఆధారపడి ఉన్నారని గుర్తు చేశారు. వెనుకబడిన కులాల అభివద్ధికి సీఎం కేసీఆర్ క షి చేస్తున్నారని ఉద్ఘాటించారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలో ఉద్యోగాల భర్తీ చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. పాలసేకరణను సైతం భారీగా చేపడుతున్నట్టు వివరించారు.


బలరాంనాయక్‌కు ఓటేయండి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు విప్ జారీ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణలోని 19 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు (రాజకీయ ఫిరాయింపులకు పాల్పడిన 7 గురు ఎమ్మెల్యేలతో) సీఎల్పీ విప్ టి రామ్మోహన్ రెడ్డి విప్ జారీ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 23న జరగనున్న రాజ్యసభ ఎన్నికలల్లో పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు ఓటు వేయాలని ఆయన పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై నిరంతర నిఘా : కడియం



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంపై నిరంతరం నిఘా పెట్టి సరైన పద్ధతిలో అమలు చేసేందుకు విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం కేంద్ర ప్రాయోజిత పథకం అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖర్చుతో సన్నబియ్యం, వారానికి మూడు గుడ్లు విద్యార్థులను దష్టిలో పెట్టుకుని ఇస్తున్నామన్నారు. దేశం మొత్తంలో ఈ పథకం కేవలం 8వ తరగతి వరకే అమలు అవుతుంటే.. మన రాష్ట్రంలో మాత్రమే 9, 10వ తరగతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్నామన్నారు. పథకం అమలులో లోపాలు, అమలు తీరుపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కడియం సమాధానం ఇచ్చారు. పథకంలో 28,623 పాఠశాలల్లో ఈ పథకం కోసం ఏటా రూ.677 కోట్ల ఖర్చు అవుతుంటే.. ఇందులో కేంద్రం నుంచి రూ.300 కోట్టు మాత్రమే వస్తున్నాయన్నారు. పథకం కేంద్ర ప్రాయోజిత పథకమని, ఇందులో కేంద్రం నుంచి 60 శాతం, రాష్ట్రం నుంచి 40 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా..రాష్ట్రంలో మాత్రం కేంద్రం నుంచి 40 శాతం నిధులే వస్తున్నాయన్నారు.

దేశంలో మధ్యాహ్న భోజన పథకాన్ని 5 నుంచి 8వ తరగతి వరకే అమలు చేస్తున్నారని, దీనిని కనీసం 10వ తరగతి వరకు పొడగించాలని, వీలైతే ఇంటర్ వరకు పెంచాలని తాను కేంద్రాన్ని కోరానని, ఇంతవరకు దానిపై స్పందించలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నా మన విద్యార్థులకోసమని ఆలోచించి మధ్యాహ్న భోజన పథకంలో వారం రోజుల కోసం ప్రత్యేకంగా మెను రూపొందించామన్నారు. ఈ మెనును అమలు చేయడంలో కొన్ని లోపాలున్నా.. వాటిని సరిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు వాట్సప్ లో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల వివరాలు ఏ రోజుకారోజు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని జిల్లాల్లో అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసే విధంగా ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే వరంగల్ జిల్లా మొత్తంలో అక్షయపాత్ర ద్వారా ఈ పథకం అమలు చేయనున్నామని చెప్పారు. మొత్తానికి విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించేందుకే తాము క షి చేస్తున్నామన్నారు. ఇక మధ్యాహ్న భోజనం వండేందుకు కూడా 7080 వంటశాలలు 146 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ ఏడాది మే 31లోపు వంటశాలలు దాదాపు పూర్తవుతాయని చెప్పారు. ఇక కట్టెల పొయ్యిల మీద దాదాపుగా వండడం లేదని, ఎక్కడైనా వండుతుంటే పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇప్పించి వాటిమీదే వంట చేయిస్తామని కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.


తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకువస్తాం

రాష్ట్రంలో తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకువస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి స్పష్టం చేశారు. శాసనమండలిలో తెలుగు భాష తప్పనిసరి అనే అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. గతేడాది డిసెంబర్‌లో తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడులో అక్కడి మాతభాష అమలు తీరును పరిశీలించామన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు భాషను తప్పనిసరి చేయాలని సీఎం నిర్ణయించినట్లు కడియం చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తెలుగు భాష నిబంధనను అమలు చేస్తాం. ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్, ఇతర భాషల స్కూళ్లు, కేంద్రీయ విద్యాలయాల్లో ఒక సబ్జెక్టుగా తెలుగును తప్పనసరి చేస్తామని కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరం : టీడీపీ అధ్యక్షులు రమణ

హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉండనుందని తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ తెలిపారు. కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు సమానదూరం పాటించనున్న ట్టు చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో తమ ఎమ్మెల్యేలు ఓటు వేయబోరని వివరించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అధునాతన సౌకర్యాలతో బస్‌షెల్టర్లు : మంత్రి కేటీఆర్



రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో రోజుకు 90 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శాసనసమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బస్టాండ్లలో సౌకర్యాలపై సభ్యులు సంధించిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి రోజు 30 లక్షల మంది బస్సు ప్రయాణం చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. అధునాతన సౌకర్యాలతో 1202 బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 826 బస్‌షెల్టర్లను ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. గ్రేడ్–1లో అత్యున్నత ప్రమాణాలతో వసతులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏసీ, వైఫై సౌకర్యం, టిక్కెటింగ్ మిషన్ ఏర్పాటు, డస్ట్ బిన్, టాయిలెట్స్ ఉంటాయన్నారు. గ్రేడ్ 4లో డస్ట్‌బిన్, టాయిలెట్ ఏర్పాటు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బస్సు షెల్టర్లు, బస్సుబేలు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచి ఆర్టీసీ పర్యాటక ప్యాకేజీలు : మహేంద్రరెడ్డి



రాష్ట్రంలోని అన్ని ప్రధాన పుణ్యక్షేత్రాలతోపాటు పొరుగున ఉన్న ఏపీ ఇతర రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడిపి భక్తులకు రవాణా సదుపాయాలు కల్పిస్తున్నదని రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలోని యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, కొమరవెల్లి, ధర్మపురి, భద్రాచలం, రామప్ప, బాసర, ఆలంపురం, హన్మకొండ భద్రకాళి దేవాలయాలతో పాటు ఏపీలోని శ్రీశైలం దేవాలయానికి ప్రత్యేక ట్రిప్పులు, ఎనిమిది ప్రత్యేక ప్యాకేజీలు ఏర్పాటు చేయగా పర్యాటకులు ఇటీవల ప్రాధాన్యం ఇస్తున్న అనంతగిరి, నాగార్జునసాగర్‌లకు రెండు ప్యాకేజీలు ఏర్పాటు చేశామన్నారు. అయితే సభ్యులు అడిగిన విధంగా యాదాద్రి–కొలన్‌పాక–కొమరవెల్లి, హైదరాబాద్–వికారాబాద్ –అనంతగిరిలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక ప్యాకేజీలు ఆర్టీసీ ఏర్పాటు చేస్తున్నదన్నారు. ఏప్రిల్ 1 నుండి ఈ ప్యాకేజీలు ప్రయాణికులకు, పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామని మంత్రి మహేందర్ రెడ్డి వెల్లడించారు.

శాస్త్ర విజ్ఞానాన్ని ఎవ్వరు విస్మరించగలరు? ప్రతి మలుపులోనూ విజ్ఞానమే ఉపకరిస్తుంది. - జవహర్‌లాల్ నెహ్రూ

అవిశ్వాసం

సంపాదకీయం

దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నట్టు టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే చాలామందితో మంతనాలు జరిగినట్టు అందరూ అంగీకరించినట్టు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని కలిసొచ్చా రు. ఒకవైపు పార్లమెంట్ చివరి సమావేశాలు జరుగు తున్నాయి. ప్రాంతీయ పార్టీలు తమ రాష్ట్రాల కోరికల మీద ఆందోళనలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కేటగిరీ హోదా, ఇతర విభజన హామీలను అధికారంలోకి వచ్చాక బీజేపీ సర్కారు విస్మరించింది. లోక్‌సభలో టీడీపీ, వైసీపీలు విడివిడిగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను చర్చకు రాకుండా దాటవేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రెండు రాష్ట్రాల పాలకులూ ఐక్యంగా పోరాడాల్సిన సమయమిది. అందుకు భిన్నంగా టీఆర్ఎస్ నాయకత్వం అవకాశవాదంగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటీ? నిజానికి ఏపీకి ప్రత్యేక కేటగిరీ హోదా విషయంలో టీఆర్ఎస్ మొదటి నుంచీ మద్దతు ప్రకటిస్తున్నది. ఇప్పుడు మద్దతు ప్రత్యక్షంగా అవసరమైన సమయంలో తప్పుకోవడం అవకాశవాదమే. తోటి రాష్ట్రం పోరాడుతుంటే విభజన హామీలు చర్చకు రాకుండా చేయటం, అంతూపొంతూ లేని వాదనలకు దిగడం టీఆర్ఎస్‌కే చెల్లింది. అవిశ్వాసం పెట్టేముందు కేసీఆర్‌తో టీడీపీ ఎందుకు మాట్లాడలేదనీ, టీడీపీకి బీజేపీతో సఖ్యత చెడితే టీఆర్ఎస్ ఎందుకు అనుకూలంగా ఉండాలనీ అడ్డంగా మాట్లాడటం హాస్యాస్పదం. పక్కింట్లో పెండ్లి అయితే మా ఇంట్లో సున్నాలు వేసుకుంటామా? అని చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు కోరవలసిన బాధ్యత చంద్రబాబు మీద ఉన్నది. నిజమే. కానీ కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడుతున్న సమయమిది. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ముందుకు దూసుకుపోవాలంటే సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ఉండాలి. కానీ, పిలవలేదనీ, బొట్టు పెట్టలేదనీ అలగడం అనుమానాలకు అవకాశం ఇస్తున్నది.

చిత్తశుద్ధితో ఫ్రంట్ నిర్మాణానికి కంకణం కట్టుకుంటే అవిశ్వాసం మీద స్పష్టత ఇవ్వాలి. దేశ రాజకీయాల్లోకి పోవాలనుకుంటున్న కేసీఆర్‌కు అందరితో కలవడానికి ఇదో మంచి అవకాశం



సభ సజావుగా సాగితేనే సభా కార్యకలాపాలు చేపట్టాలన్న పార్లమెంట్ స్పీకర్ నిర్ణయం అన్ని సందర్భాలకూ వర్తిస్తుందా? అంటే అదేమీ లేదని ఇటీవలి లోక్‌సభ వ్యవహారాలే తేటతెల్లం చేశాయి. ఆర్థిక బిల్లు ఆమోద సమయంలో సభలో ఉన్న దాదాపు అన్ని విపక్ష పార్టీలూ ఆందోళన చేపట్టాయి. సభ అదుపు తప్పి గందరగోళం నెలకొంది. అయినా సరే ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక బిల్లును స్పీకర్ మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఏపీ పార్టీల అవిశ్వాసాల దగ్గర కొచ్చేసరికి కేవలం ఉభయ పార్టీల సభ్యుల నిరసనలను సాకుగా చూపించి సభ అదుపులో లేదంటూ వాయిదా వేయడం ముమ్మాటికీ బీజేపీ ప్రభుత్వ పలాయనవాదమే. ఆ మాటకొస్తే సరిగ్గా నాలుగేండ్లనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించే బిల్లు చర్చకొచ్చినప్పుడు లోక్‌సభ, రాజ్యసభ అస్సలు ఆర్డర్‌లో లేవు. గందరగోళం మధ్యే విభజన బిల్లుకు నాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ నిరభ్యంతరంగా ఆమోదించింది.

ఇప్పుడు కొత్తగా బీజేపీకి సభా సంప్రదాయాలు గుర్తుకు రావడం రెండు నాల్కల వైఖరికి నిదర్శనం. విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వనివి కూడా ఎన్నో అమలు చేశామంటున్న బీజేపీ ఎందుకు అవిశ్వాసంపై చర్చకు వెనక్కిపోతోంది? మోడీ, జైట్లీ, అమిత్‌షాలు ఏపీకి ఎన్నో లక్షల కోట్ల రూపాయలిచ్చేశామని చెప్పుకుంటున్నారు. నిజంగానే అన్నీ ఇచ్చేసినట్టయితే లోక్‌సభలో చర్చకు బీజేపీ అనుమతించవచ్చు కదా? అవిశ్వాసం వలన సంఖ్యా బలం ఆధారంగా చూస్తే ప్రస్తుతానికి ఎన్‌డీఏ సర్కారుకు వచ్చిన ఇబ్బందేమీ లేదని బీజేపీ చెబుతోంది. చర్చకు సిద్ధమని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక పక్క చెబుతుండగా చిన్న కారణాలను చూపి చర్చ నుంచి బీజేపీ పారిపోవడం దేనికి? ఏపీ విషయంలో తన వైఫల్యాలు, వంచన, ద్రోహం బయట పడతాయన్న భయంతోనే అవిశ్వాసంపై చర్చకు బీజేపీ సిద్ధపడట్లేదన్నది స్పష్టం. అవిశ్వాసంపై చర్చకు 50 మంది ఎంపీల మద్దతు ఉంటే సరిపోతుంది. కాంగ్రెస్ సహా పలు పార్టీలు మద్దతిస్తున్నందున చర్చ చేపట్టడానికి ఇబ్బందేమీ లేదు. అయినా కేంద్రం అన్నాడీఎంకే, టీఆర్ఎస్‌ల ఆందోళనల సాక్షిగా తప్పించుకునేందుకు ప్రయత్నించడం ఘోరం. ప్రత్యేక హోదాకు మద్దతు ఇచ్చిన టీఆర్ఎస్ పార్లమెంట్‌లో మాట్లాడకుండా బయట మాట్లాడటం భావ్యం కాదు. ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదించే నాయకులు ఈ విషయంలో సంకుచితంగా ఎందుకు ఆలోచిస్తున్నారన్న ప్రశ్న రావటం సహజం. బీజేపీకి వ్యతిరేకంగా విమర్శలకు, ప్రకటనల వరకే పరిమితం చేయడం, ఆచరణలో కేంద్రానికి వ్యతిరేకంగా రంగంలోకి దిగాల్సిన సమయంలో తమకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరించడం అనుమానాలకు అవకాశమివ్వటమే. చిత్తశుద్ధితో ఫ్రంట్ నిర్మాణానికి కంకణం కట్టుకుంటే అవిశ్వాసం మీద స్పష్టత ఇవ్వాలి. దేశ రాజకీయాల్లోకి పోవాలనుకుంటున్న కేసీఆర్‌కు అందరితో కలవడానికి ఇదో మంచి అవకాశం. ఆచరణలో అడుగులు ఎటువైపో కేసీఆర్ తేల్చుకోవాలి. బీజేపీ అవకాశవాదాన్ని ఎండగట్టాలి. ఇలాంటి పరీక్షా సమయంలోనే అసలు సంగతి బయటపడుతుంది.

వామపక్షాలకు కాంగ్రెస్ అవసరం లేదు



జి సంపత్

స్వయం ప్రకటిత ఉదార భావుకులు భారత దేశంలో వామపక్షాలకు అత్యంత ఆనందంగా రాసిన అంతిమ వాక్యాల వెల్లువ దేశాన్ని ముంచెత్తి ఒక వారం మాత్రమే గడిచింది. సూర్యాస్తమయం ఎరుపు, సూర్యోదయం కాషాయం అన్న ఉపమాలంకారాన్ని వారు మళ్లీ ప్రయోగించారు. సరే, గత వారాంతంలో మహారాష్ట్రలో 30 వేల మంది రైతులు రోజుల తరబడి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ప్రస్థా నం సాగించారు. భారతదేశపు ఆర్థిక రాజధానిని తమ ఎర్రజెం డాలతో అరుణారుణం చేశారు. రోజూ తమ రిఫ్రిజిరేటర్లలో అట్టిపెట్టుకునే ఆహార పదార్థాలను పండించే వారి పట్ల కనీస గౌరవం లేని కులీన పాలకులను తమ హక్కుల కోసం నిలదీయడమే లక్ష్యంగా సాగిందీ కర్షక ప్రస్థానం. మరైతే వామపక్షం మరణశయ్య మీదున్నట్టేనా? ఇటీవల జరిగిన త్రిపుర ఎన్నికలలో సీపీఐ(ఎం) ఓటమి వామపక్షాలకు చావుదె బ్బ కాదా? ఒకవేళ కేరళలో కూడా రాబోయే శాసనసభ ఎన్నికలలో అధికారం కోల్పోతే ఏం జరుగుతుంది? ప్రస్తుత పరిస్థితుల్లో బలంగా వినిపిస్తున్న రాజకీయ చతురత ప్రకారం చూసేట్టయితే వామపక్షం చావుబతుకుల మధ్య ఆక్సిజన్‌పై వుంది. కాంగ్రెస్‌తో జత కట్టాలా లేదా? అనే ఒకే ఒక ప్రశ్నకు ఇచ్చే జవాబుపైనే అది బతికి బట్టకట్టడమన్నది ఆధారపడి వుంది. నిజానికిది చాలా పాతకాలపు సందిగ్ధమే.

వామపక్షాలు ఎన్నికల పరమైన ఆందోళనలు వదులుకొని రాజకీయ సమీకరణ కర్తవ్యాన్ని చేపడితే సాధించగలదేమిటో సీపీఐ(ఎం)కు సంబంధించిన అఖిల భారత కిసాన్ సభ జరిపిన రైతు యాత్ర విజయంతో రుజువైంది. గత ఆదివారం ఈ యాత్ర ఆర్థిక రాజధానిలో ప్రవేశించినప్పుడు వామపక్షేతరులు మాత్రమే గాక వామపక్ష వ్యతిరేకులు, ప్రతిపక్షాలు ఎర్రసముద్రంలో దూకేశాయి. కాంగ్రెస్‌తో పాటు మహారాష్ట్ర నవనిర్మాణ సేన చివరికి శివసేన కూడా మద్దతు ప్రకటించాయి.

త్రిపురలో సీపీఐ(ఎం) అధికారం కోల్పోవడం ఒక పెద్ద ఎదురు దెబ్బ అన్నది నిజమే. అలాగాక మరో రకంగా భావించ డం ప్రాణాంతక భ్రమే కావచ్చు. కానీ, ఈ మహా నష్టం కాంగ్రెస్‌తో కలవడానికి ఒక సాకుగా చెప్పడం విషాదక రమవు తుంది. అటువంటి ఐక్య సంఘటన అవసరమనేందుకు రెండు వాదనలను ముందుకు తెస్తుంటారు. వామపక్షాలు అంతకంత కూ పక్కకు నెట్టివేయబడి ప్రాధాన్యత కోల్పోతూ, తమకు తా ముగా ఎన్నికల పోరాటం పెద్దఎత్తున సాగించలేనంత బలహీనపడిపోయాయనే వాదన ఒకటి. రెండు, సమాజాన్ని ముక్క చెక్కలు చేసే హిందూత్వ శక్తులు 2019లో తిరిగి అధికారం లోకి రాకుండా అడ్డుకోవడం కోసం అన్ని లౌకిక పార్టీలు చేతు లు కలపడం అవసరమనే వాదన రెండోది. స్వల్పకాలిక ఎన్నిక ల కోణంలో ఈ రెండు వాదాలకూ విలువ వుండొచ్చు. ఏమైన ప్పటికీ, దీర్ఘకాలంలో మాత్రం కాంగ్రెస్‌తో చేతులు కలపడమ నేది ఒక పెద్ద వ్యూహాత్మక తప్పిదం అవుతుంది. ఇప్పటికే ప్రగతి శీల రాజకీయాలకు స్థానం కుదించుకుపోతున్న పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుంది. ద్వేషపూరితమైన కుహనా జాతీయ వాద రాజకీయాలకు మరింత అవకాశమిస్తుంది.

గతం నుండి నేర్చుకున్నది

ముందు ముందు ఏం జరిగేది తేరిపార చూడటానికి సీపీఐ(ఎం) అపూర్వమైన సిద్ధాంతీకరణలేమీ చేయవలసిన అగత్యం లేదు. ఇతర దేశాలలో తన తోటి పార్టీల చరిత్రను పరికిస్తే సరిపోతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ యూరప్‌లోని అతి పెద్ద కమ్యూనిస్టు పార్టీ ఇటలీ కమ్యూనిస్టు పార్టీ (పీసీఐ). దానికి 1976 జాతీయ సార్వత్రిక ఎన్నికలలో 34.4 శాతం ఓట్లు పోలయ్యాయి. అప్పుడది ఇటలీలో భారత జాతీయ కాంగ్రెస్‌తో పోల్చదగిన 'క్రిష్టియన్ డెమొక్రసీ' (డీసీ) పార్టీతో జత కట్టేందుకు 'చారిత్రక రాజీ' చేసుకుంది. వామ పక్ష ఎజెండా ముందుకు తీసుకెళ్ల డానికి దాన్ని ఉపయోగించుకో వాలని భావించినట్టు (పైకి) కనిపించింది. అయితే ఈ పొత్తు నడిచిన కాలంలో జరిగింది వేరు. ఆ క్ర మంలో కమ్యూనిస్టులే మితవాదం వైపు మొగ్గారు. డీసీ వెనక వున్న కాథలిక్ మధ్య తరగతి ఓట ర్లలో అసంతృప్తి వస్తుందనే జంకుతో గర్భస్రావం, విడాకులు వంటి సమస్యలపై లౌకిక, ప్రగతిశీల పార్టీ 'పిసిఐ' తిరోగమన వైఖరి తీసుకుంది. ఈ ఐక్య సంఘటన ప్రభావం వల్ల పడిన దెబ్బ నుండి ఇటలీ పార్లమెంటరీ వామపక్షం ఎన్నటికీ కోలుకోలేకపోయింది. ఇక రెండో విషయం. వామపక్షాలకు కాంగ్రెస్ అవసరం కన్నా, కాంగ్రెస్‌కే వామపక్షాల అవసరం ఎక్కువ. కాంగ్రెస్ ఎప్పుడూ వామపక్షానికి, మితవాద వర్గాలకు చోటు కల్పిస్తూనే వుంది. ఆ చారిత్రిక సందర్భంలో ఏది పైచేయిగా వుంటే దాన్ని ప్రతిఫలించడమే కాంగ్రెస్ రాజకీయ స్వభావంగా మారింది.



ప్రత్యేకించి జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వం, తొలి ఎనిమిదేండ్ల యూపీఏ పాలనను-కాంగ్రెస్‌కు అత్యంత ప్రగతి శీలమైన దశలుగా చెప్పాలి. ఆ దశల్లోనే కాంగ్రెస్ అనేక ప్రజానుకూల శాసనాలు తీసుకొచ్చింది. పార్లమెంటు లోపల, బయట సైద్ధాంతిక నిబద్ధతతో కూడిన వామపక్షం లేకపోతే అది జరిగేది కాదు. ప్రభావశీలమైన పాత్ర చూపగల వామపక్ష ఒత్తిడి లేకపోతే కాంగ్రెస్ చాలా తేలిగ్గా మితవాదం వైపు మొగ్గు చూపేది. కేవలం ఆర్థిక అంశాలలోనే గాక సామాజిక అంశాలలోనూ అదే జరిగి వుండేది. అది ప్రస్తుతం తనకున్నపాటి ప్రగతిశీల లక్షణాలను సైతం కోల్పోయి, బీజేపీకి బలహీనమైన అనుకరణ రూపంగా మారిపోతోంది.

గుజరాత్‌లో కాంగ్రెస్‌కు జరిగింది అదే. గత ఏడాది జిగ్నేష్ మేవాని, హార్దిక్ పటేల్, అల్పేష్ ఠాకూర్‌తో అవగాహన కుదిరిన తర్వాత దానిలోని ప్రగతిశీల ధోరణులు ముందుకు వచ్చే వరకూ కాంగ్రెస్ తీరు అలాగే వుండింది. భూమి లేని దళితులు, నిరుద్యోగ శ్రామికవర్గం, వూడ్చివేయబడుతున్న వ్యవసాయదారులు వామపక్షాలకు కీలకమైన సామాజిక పునాది వర్గాలు. పైన పేర్కొన్న వ్యక్తులు ఈ తరగతుల ప్రయోజనాలకే ఒక రూపం ఇచ్చి వాణి వినిపిస్తున్నారు. సంపదల పునఃపంపిణీ కోసం వారు నడిపిన ఉద్యమాల రాజకీయాలు వామపక్షాలతో సహజ సంబంధం కలిగి ఉన్నాయి. కానీ, గుజరాత్‌లో వామపక్షాలు దాదాపు నామమాత్రం కాబట్టే వారు కాంగ్రెస్‌తో కలసి నడిచారు. ఈ వర్గాల హక్కులను పరిరక్షించడంలో కాంగ్రెస్ వైఖరి అస్తవ్యస్తంగా వున్నా వారు అనివార్యంగా చేతులు కలపాల్సి వచ్చింది. ఆ విధమైన రాజకీయ రూపాంతరం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే గాక ఉదారవాదానికి కూడా వుంటుంది. దాన్నే తాను నిలబెడుతున్నట్టు కాంగ్రెస్ చెప్పుకుంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలను చూస్తే వామపక్షాలు సామాజికంగా పైచేయిగా వున్నంత వరకే ఉదారపూరిత (లిబరల్) రాజకీయాలు ఒక వెలుగు వెలిగాయని అర్థమవుతుంది. ఇరవ-య్యో శతాబ్ది ప్రథమార్థంలో పెట్టుబడిదారీ శక్తులపై కార్మిక వర్గం సాధించిన విజయాలే ఈ ఆధిక్యత తెచ్చిపెట్టాయి. అభివృద్ధి చెందిన పాశ్చాత్య పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకు ప్రతిరూపంగా చెప్పబడే ఉదారపూరిత సంక్షేమ రాజ్యం అన్నది నిజానికి వామపక్షాలు బహూకరించిందే గాని ఉదారవాదుల (లిబరల్స్) ప్రజ్ఞ కానేరదు.

సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయి, ప్రపంచ వ్యాప్తంగా వామపక్షం నత్తగుల్లలా లోలోపలికి ముడుచుకు పోయిందో లేదో ఈ సంక్షేమ విధానం రాలిపోవడం మొదలుపెట్టింది. ఇక అభివృద్ధి అంటే నయా ఉదారవాద కఠిన నిర్ణయాలేనని, అవే సర్వరోగ నివారిణి అని ఈ ఉదారవాదులు విశృంఖలంగా వాదించే పరిస్థితి ఏర్పడింది.

సాధికారికమైన వామపక్ష ఆవశ్యకత

వామపక్షం క్షీణతకు, మితవాద శక్తుల విద్వేష పూరిత రాజకీయాల పెరుగుదలకు మధ్య ప్రత్యక్ష సంబంధం వుంది. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం కోసం కంకణధారులై పోరాడిందీ, నయా ఫాసిస్టు శక్తులను వీధులలో నిలువరించి పోరాడిందీ వామపక్షాలు... వాటికి సంబంధించిన బృందాలే గాని ఉదారవాదులు కాదు. నాజీ యూరోప్ నుండి సమకాలీన గ్రీస్, జర్మనీల వరకు చరిత్ర పదే పదే నిరూపించిన సత్యమిది. భారతదేశంలోను జేఎన్‌యూ నుండి కేరళ వరకు మనం ఇదే చూశాం. దీని వెనక కారణం తేలిగ్గానే తెలుస్తుంది. బడా పెట్టుబడి, మితవాద అభివృద్ధి నిరోధ జాతీయవాదం (లేదా ఫాసిజం) మధ్య-అలాగే శ్రామిక వర్గాల దారిద్ర్యం, ప్రజాకర్షక విధానాలతో కూడిన నిరంకుశత్వం మధ్య వున్న సహజ సంబంధాన్ని వివరించి చెప్పడం అటుంచి కనీసం గుర్తించేందుకు కావాల్సిన సైద్ధాంతిక పునాది, ఉదారపూరిత వాదానికి లేదు. పైగా ఈ రకమైన కుల పీడన, జాతి దురభిమానం వంటి సమస్యలను స్వేచ్ఛా మార్కెట్ చికిత్సతో వినియోగదారీ విధానమనే హోమియోపతితో పరిష్కరించవచ్చని ఉదారపూరితవాదం (లిబరలిజం) భావిస్తుంది.

హిందూత్వ కూటమి తీవ్రాతితీవ్రమైన తన దాడిని ఉదారపూరిత (లిబరల్స్) వాదులపై గాక వామపక్షాలపై కేంద్రీకరించడానికి అదే కారణం. భారత దేశంలో వామపక్ష పార్టీలు చేయాల్సిందేమిటో చాలాకాల కిందటే ఒక స్పష్టత ఏర్పడింది. వారు వీధులలోకి రావాలి. దేశవ్యాప్తంగా వివిధ తరగతుల పలు రకాల ప్రజా పోరాటాలకు సహాయంగా తమకున్న వనరులనూ నిర్మాణ శక్తినీ సమకూర్చాలి. రైతుల సమీకరణ నుండి ఉపాధ్యాయుల పోరాటాలు, విద్యార్థుల ఆందోళనలు, భూమి హక్కుల కోసం దళితులు, ఆదివాసుల పోరాటాలు అన్నిటినీ బలపర్చాలి.

వామపక్షాలు ఎన్నికల పరమైన ఆందోళనలు వదులుకొని రాజకీయ సమీకరణ కర్తవ్యాన్ని చేపడితే సాధించగలదేమిటో సీపీఐ(ఎం)కు సంబంధించిన అఖిల భారత కిసాన్ సభ జరిపిన రైతు యాత్ర విజయంతో రుజువైంది. గత ఆదివారం ఈ యాత్ర ఆర్థిక రాజధానిలో ప్రవేశించినప్పుడు వామపక్షేతరులు మాత్రమే గాక వామపక్ష వ్యతిరేకులు, ప్రతిపక్షాలు ఎర్రసముద్రంలో దూకేశాయి. కాంగ్రెస్‌తో పాటు మహారాష్ట్ర నవనిర్మాణ సేన చివరికి శివసేన కూడా మద్దతు ప్రకటించాయి.

దీనంతటిని బట్టి చివరగా చెప్పేది ఏమిటంటే-కాంగ్రెస్, వామపక్షం కలిసి ఒకే ఎన్నికల కూటమిగా రావడం కంటే, ఈ రెండింటిలో ఒక దానిని ఎంపిక చేసుకునే అవకాశమివ్వడం ఎక్కువ ఉపయోగం. తద్వారా ఓటర్ల సమీకరణ సులభమవుతుంది. ఇది బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటి గాక వామపక్ష, మధ్యవాద కూటములు రెండింటినీ వేర్వేరుగా నిలబెట్టడం ఇంగితజ్ఞానానికి విరుద్ధంగా కనిపించినా నిజానికి చాలా వివేకవంతమైన ఆలోచన. అత్యంత అభివృద్ధి నిరోధకమైన బీజేపీని సామాజిక-సాంస్కృతిక చట్రంలో సరైన చోట చూపించడం దీనివల్ల కలిగే అదనపు ప్రయోజనం.

ఒక హిందూత్వ పార్టీ ఎన్నికలో ఎంత ప్రబల శక్తిగా ఉన్నప్పటికీ... మధ్యవాద శక్తుల స్థానాన్ని ఆక్రమించి అక్కడి నుండి క్రమంగా వామపక్షాన్ని మొత్తంగా తోసివేసే ప్రక్రియ దీనంతటి వల్ల మరింత కష్టమవుతుంది. మెజార్టీవాద రాజకీయాలు కూడా క్షీణ ఉపాంతర సూత్రానికి గురవుతాయని ఉత్తరప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలు సరైన సందర్భంలోనే గుర్తుచేశాయి.

కాంగ్రెస్‌కు సంబంధించిన వరకూ ఆ హస్తాన్ని ఏ రంగులోనైనా చిత్రించవచ్చు. కానీ వీరోచిత రైతాంగం ముంబయిలో నిరూపించిన విధంగా స్వతంత్ర వామపక్షం లేకుండా ఎర్రదనాన్ని బయటకు తేవడం సాధ్యం కాని పని. చిత్రకారుడి రంగుల పళ్లెంలో పూర్తిగా కాషాయ వర్ణమే రావడానికి ఇంకా కొద్ది సమయమే వుంది కాబట్టి ఈ విషయం అర్థం చేసుకోవడం అత్యావశ్యకం. ('ది హిందూ' సౌజన్యంతో)

మెయిల్ @ నవతెలంగాణ

ద్వంద్వ నీతి!

ఎస్.భూదేవి

డెబ్బై ఏండ్ల ప్రయాణంలో ఈ దేశం ఎటుపోతోంది? దేశంలో పరిస్థితులు చూస్తుంటే కేసీఆర్‌కెంతో ఆశ్చర్యంగా ఉందట! ఈ దేశాన్ని అతి సుదీర్ఘ కాలం పాలించింది కాంగ్రెస్సే. అతి భారీ అవినీతి, కుంభకోణాల్లో దేశాన్ని ఆర్థికంగా అతలాకుతలం చేసిందీ కాంగ్రెస్సే. స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట కాంగ్రెస్. సమస్యలు సృష్టించి వదిలివేయటం కాంగ్రెస్ నైజం. కాశ్మీర్ సమస్య రావణ కాష్టంలా నేటికీ కాలుతూనే ఉంది. దూరదృష్టి ఏమాత్రం లేకుండా విభజించి సమస్యల్ని జఠిలం చేసింది కాంగ్రెస్. వాటిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నది బీజేపీ. ఇదండీ మన జాతీయ పార్టీల వల్ల దేశానికి పట్టిన దౌర్భాగ్యం. ఈ దేశాన్ని ఎన్ని విధాలుగా విభజన చేస్తారు? అనంటున్న కేసీఆర్ రాష్ట్ర విభజనకు ఎందుకు ఉద్యమాలు చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఆ రోజు కేసీఆర్ చేతిలో కీలుబొమ్మలు కాకుండా ఉండి ఉంటే రాష్ట్ర విభజన జరిగేదా? విభజన కూడా ప్రజా ప్రయోజనాల్ని ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాలాశించి ఆదరబాదరగా మిడిమిడి జ్ఞానంతో రాబోవు సమస్యల్ని లోతుగా పరిశీలించకుండా విభజన చేయడం ఘోరమైన చారిత్రక తప్పిదం. కడదాక విభజనను వ్యతిరేకించింది సీపీఐ(ఎం) ఒక్కటే.

ఆ రెండు జాతీయ పార్టీలను పావులుగా వాడుకున్న రాజకీయ చతురత కేసీఆర్‌దే. ఉపన్యాసాలు కథతో చెప్తే దేశంలో పేదరికం పోదనీ నాలుగేండ్లలో బీజేపీ ఏం చేసిందని ఆయన ప్రశ్న. రాష్ట్రం విడిపోతే లక్షలాది కొలువులొస్తాయనీ అప్పుడు, తమది ధనిక రాష్ట్రమనీ ఇప్పుడు చెప్పుకునే కేసీఆర్ ఎడాపెడా అప్పులు చేయడం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది అంతంత మాత్రమే. దళితుడిని రాష్ట్రపతిని చేయమని పీఎంకి సలహా ఇచ్చింది తానేనని చెప్పే సీఎం దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఎందుకు చేయలేదు. దళితులకు ఇస్తామన్న 3 ఎకరాల భూమి హామీ ఏమైంది? కేజీ టు పీజీ ఉచిత విద్య ఎటుపోయింది? ఇటీవల జరిగిన తెలుగు మహాసభల్లో తోటి తెలుగువాడు, ఢిల్లీని గడగడలాడించిన వాడు, తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రపంచంలో తెలుగు వారికి గొప్ప గుర్తింపు తెచ్చినవాడు, లక్షలాది ప్రజల ఆరాధ్య కథా నాయకుడు అయిన ఎన్‌టీఆర్‌ని స్మరించని కేసీఆర్ విశాల భావం ఏపాటిది? ఇంతటి విశాల హృదయుడు థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు చేయడమంటే ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగరడం! రాష్ట్రంలో కమ్యూనిస్టుల పనైపోయింది, పాతికేండ్లు టీఆర్ఎస్ రాష్ట్రాన్ని పాలిస్తుందని ఇందూర్ ఎంపీ కవిత లోగడ చెప్పింది. ఇప్పుడేమో కేసీఆర్ స్థాపించబోయే థర్డ్‌ఫ్రంట్‌లో వామపక్షాలు చేరాలని ఆ పార్టీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కోరడం విడ్డూరంగా ఉంది. లోగడ ఈ థర్డ్ ఫ్రంట్‌లు దేశానికి చేసింది శూన్యం. ఆర్భాటాలతో ద్వంద్వ నీతులు ద్వంద్వ ప్రమాణాల్తో థర్డ్‌ఫ్రంట్‌లు దేశానికి చేసే మేలు ఉత్తదే. థర్డ్ ఫ్రంట్‌లో చేరే పార్టీలు ఆత్మ విమర్శ చేసుకోవడం ఉత్తమం. ఈ దేశ ప్రజలు దేన్నైనా భరిస్తారు కానీ ద్వంద్వనీతిని అస్సలు సహించరు. సీఎం తన ద్వంద్వ నీతితో థర్డ్ ఫ్రంట్‌ని నడపడం అసాధ్యం.

- నిజామాబాద్

ప్రజావాణి

పంచాంగం పేరుతో బురిడి

పంచాగం పేరుతో వ్యాపారం చేసుకుంటూ సంవత్సరానికి లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. అసలు ఈ పంచాగంతో సాధారణమైన ప్రజలకు ఒరిగేది ఏమున్నది. పార్టీకో పంచాంగం తయారు చేసుకొని భజన చేసుకుంటున్నారు. పంచాంగ శాస్త్రం పేరుతో పుస్తకాలు వేసి వ్యాపారం చేసుకుంటున్నారు. ఈరోజు కొన్ని వందల మంది పంచాంగాలు రాస్తున్నారు. ఒకదానికి ఒకటి సంబంధమే ఉండదు. శాస్త్రం ఒకటి, రాసే పద్ధతులు కోకొల్లలు. ఎవరైనా ఒక పంచాంగ కర్తకు డబ్బు ఇస్తే వారికి కూడా చాలా పాసిటివ్‌గా రాసే వారున్నారు. మరి దీని వల్ల ప్రయోజనం ఏమిటి? తరతరాల నుండి పంచాంగం పేరుతో ఒక వర్గం వారు మరో వర్గాన్ని చెప్పుచేతుల్లో పెట్టుకున్నారు. ఎందుకు ఎక్కువ శాతం ఒక్క వర్గం వారే పంచాంగ శాస్త్రం రాస్తున్నారు. పని చేయలేని సోమరులే ఈ శాస్త్రాన్ని ఉపయోగించుకొని బతుకుతున్నారు. అసలు ఖగోళం గురించి తెలియదు? ఎన్ని గ్రహాలు ఉన్నాయో తెలియదు?. ఏ గ్రహం దేని చుట్టూ తిరుగుతున్నదో కూడా తెలియని పిచ్చి వారు కూడా పంచాంగాలు రాసి ప్రజలను అంధకారంలో పడేస్తున్నారు. స్వతంత్ర్య భారతదేశంలో కుల, మత పంచాగాలను శాశ్వతంగా తుడిచిపెట్టాలి.

- విరాజిత, హైదరాబాద్.

ప్రత్యేక తెలంగాణ ఇందుకా?

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కేవలం నిరుద్యోగ సమస్య, ప్రజల పేదరికాన్ని పోగొట్టుకోవడానికే మనం ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధిం చుకున్నాం. కానీ ప్రస్తుత ప్రభుత్వం చేసే పనులు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. దేవాలయాలను కూలగొట్టి కొత్తగా దేవాలయాలు నిర్మిస్తున్నారు. అంతేకాక వందల కోట్లు దేవాలయాలకు వెచ్చించడం అవసరమా? ప్రజాధనం ఇలా దుర్వినియోగం చేయడం అవసరమా? ముప్పైమూడు కోట్లు దేవతలు ఎగబడ్డ మనదేశంలో పేదల ఆకలి ఎలా తీరుతుంది? అని గుఱ్ఱం జాషువా ప్రశ్నించారు. బొమ్మల పెండ్లిండ్ల కోసం వందలు వేలు ఖర్చు చేస్తారు. కాని, పేదవాడికి పట్టెడు అన్నం పెట్టరు. కొత్త జిల్లాలు అవసరమా? ఉన్న జిల్లాలు సరిపోవా? అక్కడ ప్రజాధనం దుర్వినియోగమే? నియోజకవర్గ పునర్విభజన కూడా వ్యర్థమే. ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సరిపోరా? ఇలా చెప్పుకుంటూ పోతే టీఆర్ఎస్ గవర్నమెంట్ అన్నీ తప్పిదాలే చేస్తోంది.

సరికొండ రవిప్రకాశరాజు,
సూర్యాపేట.

ఆధార్ కూడలిలో భారత ప్రజాస్వామ్యం





శశికుమార్

భారతదేశంలో గుర్తింపు ఆధారాన్ని అందరికీ అందించాలన్న ప్రకటిత లక్ష్యంతో 2009లో మొదలైన ఆధార్ కార్డు ప్రహసనం పతాక సన్నివేశానికి అతి చేరువలో ఉంది. ఇదేదో ప్రజలకి ఆధా రంగా నిలుస్తుందని మొదట్లో అనిపించినా ఏకుమేకై చివరికి అశేష ప్రజాబాహుళ్యపు జీవితాలన్నీ తనపైన ఆధారపడే టట్టు చేయడమే దాని అసలు అప్రకటిత లక్ష్యమని తేలిపో యింది. అందరికీ ఆధార్ కార్డు అనే విధానం అసలు స్వరూపం ఏమిటి అనేది లోతుగా పరిశీలిస్తే తప్ప పూర్తిగా అర్థం కాదు.

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ఒక పక్క ఆధార్ యొక్క రాజ్యాంగ బద్ధతపై వాదోపవాదాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడలు పోతూ ప్రతీ ప్రాథమిక సేవకీ ఆధార్ కార్డు తప్పనిసరి అని పోరు పెట్టడం న్యాయ వ్యవస్థని సైతం అవమానించడమే కాదూ!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని లక్షల కోట్ల ధనాన్ని ప్రజా సంక్షేమ కార్యకలాపాల పేరుతో సబ్సిడీల రూపంలో పప్పు, బెల్లాల్లా పంచి పెడుతున్నా, కానీ ఎక్కువ శాతం నిధులు మధ్యలోనే కైంకర్యం అవుతున్నాయనీ, దీనికి ఏకైక పరిష్కారం లబ్దిదారుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు సృష్టించడమేననీ కొందరు కార్పొరేట్ మేధావుల ఆధ్వర్యంలో ఈ ఆధార్ కార్డు ఆలోచన పురుడుపోసుకుంది. ఇదంతా వినడానికి బాగానే ఉంది. లక్షల కోట్ల రుణాలు, పన్ను రాయితీలు, చవక భూ ములు, సహజ వనరులు, ఎర్ర తివాచీలూ ఆస్వాదించిన కార్పొరేట్ రంగం అసలు ఎంత ఉపాధి కల్పన చేయగలి గిది? ప్రతిగా నిజానికి మన ఆర్థిక వ్యవస్థకి ఒరిగిందేమిటి? లాంటి ప్రశ్నలు పూర్వపక్షం చేస్తూ అక్కడికి ఏదో ఈ సబ్సిడీల వల్లే దేశ పురోగతి కుంటుపడుతున్నాయి అంటే ప్రభుత్వ వైఫల్యం బట్టబయలైనట్టే కదా? అయినా తమ వైఫల్యాన్ని, అసమర్థతలను ప్రజలమీదికే రుద్దడం విధా నంగా మార్చుకున్న ప్రభుత్వాలు ఆ క్రమంలోనే యూఐడీఏఐ (యూనిక్యూ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) అనే సంస్థ ద్వారా ఆధార్ కార్డు ప్రాజెక్టుని తెరమీదకి తీసుకొచ్చింది. తద్వారా కోట్లాది లబ్దిదారులు మరోసారి తాము నిజమైన లబ్దిదారులమే అని రుజువు చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. అసలు గుర్తింపు కార్డుగా మొదలైన ఆధార్ ప్రస్థానం క్రమంగా ఇతర విషయాల్లోకి సైతం పాకసా గింది. నిజానికి ఆధార్ కార్డు పొందిన వారిలో 99.97శాతం మంది తమ వద్ద ఇదివరకే ఉన్న గుర్తింపు కార్డు చూపించే పొం దారు. అంటే కేవలం 0.03 శాతం మంది ప్రజలకు మాత్రమే ఆధార్ కొత్తగా గుర్తింపు వచ్చింది. అందుకోసం కోట్లాది పనిగంటలు వృథా చేయించటం మన పాలకులకే చెల్లింది. తద్వారా ఈ ఆధార్ కార్డు కనీవినీ ఎరుగనంత సామాజిక నష్టాన్ని కలుగజేసింది. దాంతోపాటు ఆహార భద్రతా, విద్యా, జీవించే హక్కులు, సమాచార హక్కులు సహా భారత రాజ్యాంగం, వివిధ చట్టాలు మన పౌరులకు ప్రసాదించిన అనేక విర్దిష్టమైన హక్కులు. ఆధార్ కార్డు ఉంటేనే లభించేటట్టుగా షరతులతో కూడిన హక్కులుగా మారా యి. కానీ విచిత్రమేమంటే ఏ రకమైన చట్టబద్ధతా లేకుం డానే ఈ ఆధార్ కార్డు నూరు కోట్లకిపైగా ఉన్న భారత ప్రజల మీద రుద్దబడింది. పార్లమెంటరీ సంఘం వ్యతిరేకిం చినా, అనేకమార్లు మన అత్యున్నత న్యాయస్థానం అక్షింత లు వేసినా వెరవక కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ఆధార్ కార్డు ప్రాజెక్టును ముందుకే తీసుకెళ్లింది. అప్పట్లో దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ముఖ్య నాయకుల్లో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ సైతం ఉండటం గమనార్హం. అలాం టిది అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్న రీతిలో అంతకు ముందు ప్రభుత్వం కంటే మరింత దూకుడుగా ఆధార్ ప్రాజెక్టు అమలు చేయడం రాజకీయ కుప్పిగంతులు గాక మరేమిటి. ఇంకొక విచిత్రమే మిటంటే అప్పటి ప్రభుత్వంలో మం త్రులుగా ఉన్న చిదంబరం, కపిల్ సిబాల్ వంటివారు ఆధార్‌కు వ్యతిరే కంగా సుప్రీంకోర్టులో వాదించడమే. అధికారంలో ఎవరున్నా ఆధార్ వల్ల పాలకవార్గానికి జరిగే ఉపయోగా లని వదులుకోవడానికి సిద్ధంగా లేరనే. అందుకే గ్యాస్ సిలిండర్ల కనెక్షన్‌తో మొదలైన ఈ ఆధార్‌కార్డు విషపు వల రేషన్ షాపులకూ, ఎరు వుల కొనుగోలుకూ, మొబైల్ ఫోన్ వాడకానికీ, బ్యాంకు ఖాతాలకూ, బీమా పాలసీలకూ, పన్ను చెల్లింపులకూ, విద్యార్థనకూ, పోటీ పరీక్షలకూ, స్థిరాస్థుల లావాదేవీలకూ ఇలా అనేక విషయాలకు విస్తరించి చివరికి అంత్యక్రియల నిర్వహణకు సైతం ఆధార్‌కార్డు కావాలనే దుస్థితికి దిగజారింది. ప్రజల దైనందిన జీవితంలో ఆధార్ కార్డు లేకుండా మనుగడ సాధించడం సైతం ప్రశ్నార్థకంగా మారిన గడ్డు పరిస్థితులను సృష్టించింది. కోట్లాది మంది భారతీయుల వేలి ముద్రలు, కంటి స్కాన్‌తో సహా వారి వ్యక్తిగత సమాచారం సేకరించడం అనే బృహత్తర బాధ్యత ను ప్రభుత్వం కానీ యూఐడీఏఐ కానీ స్వీకరించకుండా దానికి ఆధార్ నమోదు కేంద్రాల పేరుతో ప్రైవేటు వ్యక్తుల కు, సంస్థలకూ అప్పగించారు. ఈ మొత్తం ప్రక్రియలో కనీ సం ఏ రకమైన చట్టబద్ధ ఒడంబడికలూ లేకుండా కేవలం అవగాహనా పత్రాలతోనే (ఎంఓయూ) సమాచార సేకరణా కేంద్రాలని నియమించడం ఎంతో ప్రమాదకరం అని నిపు ణులు మొత్తుకుంటున్నా వినకుండా గుడ్డెద్దు చేలో పడ్డ చందాన ఆధార్ కేంద్రానికి ఎంపిక చేశారు. దాని ఫలితం గానే యూఐడీఏఐ సుమారు 49,000 ఆధార్ నమోదు కేంద్రాలను రద్దు చేయవలసిన దుస్థితి ఏర్పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ ప్రాజెక్టు అనీ, అత్యం త కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నాయనీ గప్పాలు కొట్టుకోవడం మీద ఉన్న శ్రద్ధ నిజంగా భద్రతకు బాధ్యత వహించడంపై లేకపోవడం వల్లే అన్ని కేంద్రాలు అవకత వకలకు పాల్పడగలిగాయి. కానీ అవే అప్పటికే చేసిన తప్పులకు పరిష్కారం ఏమిటి అనే ప్రశ్నకు మాత్రం సమా ధానం దొరకదు. ఎవరైనా ఆధార్ వ్యవస్థలో లోపాలని ఎత్తి చూపితే వారిపై చర్యలు తీసుకోవడమే తప్ప ఆయా లోపాలని సరిద్దిద్దుకునే విధంగా ఈ నిర్వహణ జరగడం లే దు. భిన్న సంస్కృతులు, విభిన్న రకాల పేర్లు ఉండే భారత దేశంలో కేవలం పేరు సరిపోలకపోయినా ఆధార్‌కార్డు విపరీతమైన గందరగోళ పరిస్థితులకి దారి తీస్తుంది. ఇటు వంటి సమస్యలతోనే శ్రద్ధగా చదువుకోవాల్సిన విద్యార్థులు ఆధార్ కేంద్రాలలో క్యూ కట్టడం వారి భవిష్యత్‌తో చెలగాట మాడటమే కదా! వేలి ముద్రలు వృద్ధాప్యం వల్లగానీ, కాయ కష్టం వల్ల గానీ మారిపోయే అవకాశం ఉంది. కనుక ప్రతీ పనికీ వేలిముద్రలే ఆధారమైతే ఇబ్బందులు తప్పవు. అంతే గాక వేలిముద్ర పరీక్షించే యంత్రం మొరాయించినా, నెట్‌వర్క్ సరిగ్గా లేకపోయినా పనులన్నీ ఆగిపోతాయి. ■





బయట ఎండ మండిపోతుంటే... చల్లని చల్ల తాగితే కలిగే హాయే వేరు. వేసవిలో ఎంతో ఆరోగ్యాన్నిచ్చే చల్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వేసవి అంతా తాగాల్సి వచ్చినప్పుడు... బోర్ కొడుతుంది. అలాంటప్పుడే ఈ ఫ్లేవర్స్ పనికొస్తాయి. కొంచెం వగరుగా, ఇంకొంచెం తీపిగా, మరికొంచెం పుల్లగా... మీకు కావాల్సిన విధంగా చల్లను తాగేసి కడుపు చల్లగా చేసుకోండి!

కడుపు చల్లగా...



మామిడికాయతో...

కావల్సినవి: కొద్దిగా పులుపు తక్కువగా ఉన్న పచ్చిమామిడికాయ – ఒకటి, చక్కెర – కప్పు, పెరుగు – కప్పు, జీడిపప్పు, బాదం – నాలుగు చొప్పున (నీళ్లలో నానబెట్టుకోవాలి).

తయారీవిధానం: మామిడికాయను చెక్కు తీసి కాసిని నీళ్లు పోసి ఉడికించుకోవాలి. మామిడికాయ ఉడికించిన నీటిని విడిగా తీసుకోవాలి. మామిడికాయ గుజ్జు, చక్కెర, పెరుగు మిక్సీలో తీసుకుని మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. తరవాత మామిడికాయ ఉడికించిన నీళ్లు పోసుకుని మరోసారి మిక్సీ పట్టి గ్లాసుల్లోకి తీసుకోవాలి. దీనిపై నానబెట్టిన జీడిపప్పూ, బాదంపలుకులూ అలంకరిస్తే మామిడికాయ చల్ల రెడీ!



ద్రాక్షతో రక్ష

చలికాలం చివరి రోజుల నుంచి మనకు ఎక్కడ చూసినా కనిపించేవి ద్రాక్షలు. వేసవిసీజన్‌లో సైతం లభించే ఈ ద్రాక్ష పండ్లతో ఎన్నో లాభాలున్నాయి. అందుకే రుచితో పాటు ఆరోగ్యాన్నీ అందించే ద్రాక్షలను వీలైనంత ఎక్కువగా తీసుకోవాలంటున్నారు పోషకాహార నిపుణులు.

విటమిన్ల ఖని... ద్రాక్షలంటే విటమిన్ సి గుర్తు వస్తుంది. కానీ సి–విటమిన్‌తో పాటుగా విటమిన్ ఎ, బి6, ఫోలిక్ ఆమ్లం కూడా వీటిలో పుష్కలంగా ఉన్నాయి. పొటాషియం, కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్, మెగ్నీషియం, సెలీనియం లాంటి ఎన్నో రకాల ఖనిజలవణాలు ద్రాక్షల్లో సమ ద్ధిగా లభిస్తాయి.

గుండెకు రక్ష.. ద్రాక్షలో ఉండే ఔషధ గుణాలు ఆస్తమాను అదుపులో ఉంచేందుకు ఉపయోగపడతాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదును తగిస్తాయి. ద్రాక్షపండ్లు రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ మోతాదును పెంచి, రక్తం గడ్డ కట్టకుండా నివారిస్తుంది. దీంతో గుండెపోటు అవకాశం తగ్గుతుంది.

మలబద్ధకానికి.. ద్రాక్షల్లో కర్బన ఆమ్లాలు, సెల్యులోజ్ లాంటి చక్కెరలు ఎక్కువగా ఉండటం వల్ల ఇవి మంచి లాగ్జేటివ్స్‌గా పనిచేస్తాయి. కాబట్టి మలబద్ధకంతో బాధపడుతున్నవారికి ద్రాక్షపండ్లు మంచి మందుగా పనిచేస్తాయి. అజీర్తి నుంచి బయటపడేయడానికి సహాయపడతాయి. ద్రాక్షల్లో ఇనుము సమ ద్ధిగా ఉండటం వల్ల రక్తవృద్ధి జరిగి అలసట, నీరసం లాంటివన్నీ మటుమాయం అవుతాయి. ద్రాక్షల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. కొన్ని రకాల బాక్టీరియా, వైరస్‌ల ఇన్‌ఫెక్షన్లను నిరోధించడంలో కూడా ద్రాక్షలు కీలకపాత్ర వహిస్తాయి. ద్రాక్షలు యూరిక్ ఆమ్లం మోతాదు తగ్గించి కిడ్నీలపై పనిభారం పడకుండా చేస్తాయి.

క్యాన్సర్ మందు... నల్లద్రాక్ష రసం రొమ్ము క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుంది. ద్రాక్షల్లోని రిస్‌వెరటాల్ చూపించే యాంటి ఇన్‌ఫ్లమేటరీ ప్రభావం అంతా ఇంతా కాదు. పెద్దపేగు క్యాన్సర్‌తో పాటు ఇతర జీర్ణవ్యవస్థ సంబంధిత క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్ల నివారణలో రిస్‌వెరటాల్ బాగా పనిచేస్తుంది. ఆంథ్రోసయనిన్లు, ప్రోఆంథ్రోసయనిన్లు యాంటి ప్రొలిఫరేటివ్ లక్షణాలను కలిగివున్నాయి. అంటే క్యాన్సర్ కారక పదార్థాల పెరుగుదలను ఇవి నిరోధిస్తాయి.

కంటి ఆరోగ్యానికి... వయసు పెరిగినకొద్దీ దాడిచేసే వ్యాధుల్లో మాక్యులర్ డీజనరేషన్ ఒకటి. దీనివల్ల మెల్లమెల్లగా ద ష్టి సామర్థ్యం తగ్గిపోతుంది. కానీ ప్రతిరోజూ ద్రాక్షలు తీసుకుంటే మాక్యులర్ డీజనరేషన్ అవకాశం 36 శాతం తగ్గిపోతుంది. రోజూ ద్రాక్షలు తీసుకుంటే కంటిలో శుక్లాలు ఏర్పడే అవకాశం చాలావరకు తగ్గిపోతుంది. మెదడు చురుకుదనాన్ని పెంచడంలో ద్రాక్షలు కీలకపాత్ర వహిస్తాయి.

చిట్కావైద్యం.. ఇలాంటి ఎన్నోరకాల జబ్బుల నివారణలో ద్రాక్షపండ్లు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇంట్లోనే చేసుకునే చిట్కావైద్యాలకు కూడా ఇవి బాగా పనిచేస్తాయి. బాగా పండిన ద్రాక్ష పండు పార్శ్వపు తలనొప్పి (మైగ్రేన్)కి మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఉదయం లేవగానే పరగడపున నీళ్లు కలపకుండా చిక్కని ద్రాక్షరసం తాగితే మైగ్రేన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. ❄





బెల్లం మిరియాలతో

కావల్సినవి: పెరుగు – కప్పు, బెల్లం – అరకప్పు, మిరియాలు – ఏడు గింజలు, యాలకులు – రెండు.

తయారీవిధానం: బెల్లాన్ని సన్నగా తరగాలి. అలాగే మిరియాలూ, యాలకులను పొడి చేసుకుని పెట్టుకోవాలి. ముందుగా పెరుగును మిక్సీలోకి తీసుకుని చిక్కని చల్ల చేసుకోవాలి. తరవాత పెరుగులో బెల్లం తరుగూ, పావుకప్పు చల్లనినీళ్లూ పోసుకుని నురగలా వచ్చేలా మిక్సీ పట్టుకోవాలి. దీన్ని గ్లాసుల్లో తీసుకుని మిరియాలపొడి, యాలకులపొడి కలిపి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తాగాలి.

పుదీనా జీరాతో...

కావల్సినవి: పుదీనా – కట్ట, పచ్చిమిర్చి – ఒకటి, ఉప్పు – తగినంత, పెరుగు – కప్పు, జీలకర్ర – పావుచెంచా, అల్లం – చిన్నముక్క, నిమ్మరసం – ఐదు చెంచాలు.

తయారీవిధానం: పుదీనా ఆకుల్ని బాగా కడిగి కొన్ని నీళ్లు పోసి పొయ్యిమీద పెట్టాలి. ఐదు నిమిషాల తరవాత దింపేసి నీళ్లు వంపేయాలి. పుదీనా ఆకులు చల్లారాక అవీ, తరిగిన పచ్చిమిర్చీ, ఉప్పూ, జీలకర్రా, నిమ్మరసం, కడిగి తరిగిన అల్లం, పెరుగు కాసిని చన్నీళ్లు మిక్సీలోకి వేసుకుని చిక్కని చల్ల చేసుకోవాలి. ఇది వేసవి తాపాన్ని తగ్గిస్తుంది.



తులసితో...

కావల్సినవి: పెరుగు – కప్పు, కీర– రెండు, యాపిల్– పావుముక్క, తులసి ఆకులు–5, తేనె– 1 టీస్పూను, అల్లం– చిన్న ముక్క (ఇష్టాన్ని బట్టి).

తయారీవిధానం: కీర, యాపిల్ రెండింటినీ సన్నగా తరగాలి. పైన పేర్కొన్న మిగతా పదార్థాలతో కలిపి వీటిని బ్లెండర్‌లో వేసి గ్రైండ్ చేయాలి. ఇది లేత ఆకుపచ్చ, క్రీమీ రంగులోకి వచ్చే వరకూ బ్లెండ్ చేయాలి. తర్వాత గ్లాసులో పోసుకుని తాగాలి.



కీరదోసతో..

కావల్సినవి : కీరదోస– రెండు, పెరుగు– అరలీటరు, అల్లం– 2 అంగుళాల ముక్క, కొత్తిమీర తురుము– 2 టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి– రెండు, పంచదార– 4 టేబుల్‌స్పూన్లు, ఇంగువ– చిటికెడు, ఉప్పు– రుచికి సరిపడా

తయారీ విధానం: కీరా ముక్కలు, అల్లం, కొత్తిమీర, పచ్చిమిర్చి, పంచదార, ఇంగువ, ఉప్పు అన్నీ మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి మళ్లీ తిప్పాలి. ఇప్పుడు దీన్ని గ్లాసుల్లో పోసి ఐస్‌క్యూబ్స్ వేసి చల్లచల్లగా అందించాలి.

చర్మం జాగ్రత్త

ఎండాకాలంలో చర్మం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ తగిలితే ఒక్కోసారి చర్మం పాడయ్యే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడే కొన్ని ఫేస్‌ప్యాక్స్ ప్రయత్నిస్తే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

గంధం పొడి: చర్మంపై ఏర్పడే నల్లవలయాలు, మచ్చలు పోవడానికి ఓ మార్గం ఉంది. అరకప్పు పసుపు పొడి, నాలుగో వంతు రోజ్ వాటర్, ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి కలిపిన మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 30 నిమిషాల పాటు ఉంచి తర్వాత చల్లటి నీళ్లతో కడుక్కోవాలి.

ఓట్స్: ఓట్స్ తినడానికే కాదు ముఖ వర్ఛస్సు పెంచుకోవడానికి ఇవి పనిచేస్తాయి. ఓట్స్, తేనె, కోడి గుడ్డు సొన, పెరుగు కలిపిన మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తర్వాత ముఖానికి పట్టించి, నీటితో కడుక్కోవాలి.



బనానా: ముఖంపై ఏర్పడ్డ మచ్చలను అరటిగుజ్జు పోగొడుతుంది. అయితే అరటిగుజ్జు ఒక్కటే కాకుండా దాంతో పాటు కాస్త పుదీనా ఆకులు కూడా వాడాలి. అరటిపండును గుజ్జుగా చేసి, అందులో పుదీనా ఆకులను వేసి గ్రైండ్ చేయాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి 15 నిమిషాల పాటు ఉంచుకోవాలి.

బాదం, రైస్ ప్యాక్: ఒక కప్పు పెరుగులో బియ్యం పిండి , తగినన్ని బాదం పలుకులు వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని రాత్రి నిద్రపోయేముందు రాసుకోవాలి.

కోడి గుడ్డు సొనతో: కోడిగుడ్డు సొనలో తేనె కలుపుకొని, ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. అది ఆరిపోయాక కడుక్కుంటే ముఖం ఫ్రెష్‌గా మారుతుంది. ఇది ఆయిలీ స్కిన్ వారికి బాగా పనికొస్తుంది.

టోనర్: ముఖంపై జిడ్డు పోగొట్టడం కోసం చాలా మంది టోనర్లు వాడతారు. వీటి వల్ల చర్మంపై మట్టి, దుమ్ము వదిలిపోతాయి. బయట దొరికే ఖరీదైన టోనర్లు కాకుండా ఇంట్లో కూడా వీటిని తయారు చేసుకోవచ్చు. ఫ్రిజ్‌లో ఉంచిన రోజ్‌వాటర్, కీరదోసకాయ రసం కలిపి మిశ్రమాన్ని ముఖానికి ప్రతి రోజు రాత్రి పట్టించుకుంటే మంచిది. ఇది అప్లై చేసుకోవడానికి కాటన్ క్లాత్ వాడాలి. ❄



నిజాయితీ గల అధికారిగా...

మన దేశంలో నిజాయితిగా పనిచేసే వారికి అందే సత్కారం ఏంటంటే బదిలిలు..ఎక్కడైనా తప్పు జరిగితే దాన్ని ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల అండ చూసుకుని అక్కడి నుండి వారిని బదిలి చేయించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు.ఈ కోవలోకే వస్తారు ఐఏఎస్ ఆఫీసర్ దాసరి రోహిణి సింధూరి.ఈవిడ గురించి గూగుల్ లో టైప్ చేస్తే మీకు తొలుత కనిపించేది ఆవిడ ట్రాన్సఫర్స్ న్యూసే..దాన్ని బట్టే ఆవిడ నిజాయితి అర్దం చేసుకోవచ్చు.

అమ్మ శ్రీలక్ష్మీ, నాన్న జైపాల్ వారిది ఖమ్మం జిల్లా సత్తుపల్లి, రుద్రాక్షపల్లి గ్రామం. నిత్యం ఇంట్లో గడిపే తల్లిదండ్రుల వ్యక్తిత్వం వారి పిల్లలపై తీవ్రప్రభావం పడుతుంది. ఆమెకు క్రమశిక్షణ అలవడడానికి గల ప్రధాన కారణం అమ్మ శ్రీలక్ష్మీ. ఆమెను ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగం, ఉన్నత జీవితం కోసం అమెరికా పంపాలని ఆశించారు.కాని "కలెక్టర్ అవుతానమ్మా" అని ఎంతో ఆశగా కూతురు కోరిన కోరికను తల్లిదండ్రులు కూడా అంతే ఆనందంతో ఒప్పుకున్నారు.. వెంటనే డిల్లీలోని కోచింగ్ సెంటర్ లో జాయిన్ చేసారు. అన్ని అనుకున్నట్టుగానే జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది. మంచి ప్రణాళికలతో ఐ.ఏ.ఎస్ కావడమే ముందున్న లక్ష్యం అనుకుంటున్న తరుణంలో ఆమెకు యాక్సిడెంట్ జరిగింది. ఢిల్లీలో ఓరోజు రోడ్ క్రాస్ చేస్తుండగా అటుగా వస్తున్న కారు రోహిణీ గారిని ఢీ కొట్టింది. తగిలిన గాయాలు చిన్నవేం కాదు. సంకల్పం ఉంటే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా అనుకూలంగా మార్చుకోవచ్చు. ఆమె అలానే చేసింది.

అనుకున్నట్టుగానే ఐఏఎస్ కలను నిజం చేసుకున్నది. ప్రభుత్వం ఏ బాధ్యతలు అందించినా గాని తనలో, సాటి అధికారులలో ఏ తప్పు, నిర్లక్ష్యం దొర్లకుండా పనిచేసేదామె. ఈ కోవలోనే సామన్య ప్రజానీకం నుండి కేంద్ర ప్రభుత్వం వరకు ఎంతోమంది మన్ననలు అందుకున్నది. ప్రస్తుతం కర్ణాటక హసన్ జిల్లా డీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా కొన్ని సమస్యలపై మంత్రుల నుండి విభేదాలు వచ్చాయి.. "రోహిణి ఇక్కడ ఉంటే మేము ఆశించిన పనులు జరగవని భావించి" మంత్రులు రోహిణి గారిని ట్రాన్స్ ఫర్ చేయాలని భావించారు.. ఐతే హసన్ జిల్లా నుండి రోహిణి గారు వెళ్ళితే మళ్ళి పాత పరిస్థితులే వస్తాయని భావించిన అక్కడి ప్రజలు రోడ్డు మీదకు వచ్చి రోహిణి గారిని ట్రాన్స్ ఫర్ చేయడానికి వీలులేదు అని తమ సొంత సమస్యలా ఉద్యమం చేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రజలు తిట్టుకునే అధికారులు ఎంతోమంది ఉంటారు కాని అధికారుల కోసమే ఇలా ప్రేమతో ఉద్యమాలు చేయించుకునే వారు కొందరే ఉంటారు. ❄

కూర్చున్నచోటే...



చాలామంది ఉద్యోగినులు ఇంట్లో చకచకా పనులు చేస్తారు. కానీ ఆఫీసుకు వెళ్లాక ఆరేడు గంటలు కదలకుండానే కూర్చుంటారు. మధ్యాహ్నం భోజనం కూడా ఉన్నచోటే కూర్చుని తినేస్తూ, పనిచేసేస్తుంటారు. ఇది చాలా ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇలా కూర్చున్నచోటు నుంచి కదళకుండా ఉండటంవల్ల శారీరక, మానసిక విశ్రాంతి ఉండదు. ఒత్తిడితోపాటూ అలసట తప్పదు. ఆ ప్రభావం పనిపైనా పడుతుందట.

కూర్చున్నచోటే లంచ్, స్నాక్స్ తీసుకోవడానికి కారణం.. క్యాంటీన్ దాకా వెళ్లితే సమయం వృథా అని. మరి సమయాన్ని మేనేజ్ చేసుకుంటే సరిపోతుంది కదా. మీ రోజు ప్రారంభించే ముందే ఓ ప్రణాళిక తయారు చేసుకోవడం మంచిది. అందులో మీ భోజనానికీ కొంత సమయం పెట్టుకోవడం మరవకండి. మీ కుర్చీలోనే కూర్చొని తినకుండా.. క్యాంటీన్‌కి సహొద్యోగులతో కలిసి వెళ్లి సరదాగా భోజనం చేయడం అలవాటుగా మార్చుకోండి. దానివల్ల సత్సంబంధాలు పెరగడమే కాదు, పని ప్రభావం నుంచి బయట పడగలుగుతారు.

సీట్లో ఎంత ఎక్కువ సేపు కూర్చుని ఉంటే... అంత సీరియస్‌గా పనిచేస్తున్నారని బాస్ అనుకుంటారని చాలా మంది ఫీలింగ్. నిజానికి బాగా పనిచేసేవారు ఎక్కువ సేపు కుర్చీకి అతుక్కుపోరు. కాబట్టి ఎంత పని ఉన్నా సరే.. ప్రతి గంటకోసారి లేచి కనీసం రెండు మూడు నిమిషాలు నడవడం మంచిది. దానివల్ల శరీరానికి కాస్త వ్యాయామం అందినట్లు అవుతుంది. మీకు రిఫ్రెష్ అవుతుంది.

ఎప్పుడో ఓసారి కదలలేనంతా హెక్టిక్ వర్క్ ఉంటుంది. అలాంటప్పుడు కుర్చీలోంచి లేవలేరు. అప్పుడు

కుర్చీలో కూర్చున్నా సరే.. పాదాల్ని గుండ్రంగా సవ్య, అపసవ్య దిశలో తిప్పాలి. దానివల్ల కాళ్ల కండరాలు పట్టేసే సమస్య ఎదురుకాదు. అదేవిధంగా చేతుల్ని పైకెత్తడం, మెడను కుడి, ఎడమల వైపునకు తిప్పడం మంచిది. అలాగే కూర్చున్నా, నిల్చున్నా నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ❄

ఇట్లచేద్దాం

పచ్చి బఠానీలు ఉడికించినప్పుడు వెంటనే రంగు మారిపోతాయి. అలా రంగు మారకుండా ఉండాలంటే అందులో కొంచెం చక్కెరవేయాలి.

పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావ సభ

- తెలంగాణ రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనా బాయ్‌కాట్, డైవెస్టిమెంటు, శాంక్షన్స్ నేషనల్ కమిటీ పోరాటానికి మద్దతుగా 27న హిమాయత్‌నగర్‌లోని మఖ్ధూంభవన్‌లో సంఘీభావ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో పాలస్తీనా సమాజంలో అతిపెద్దదైన'నేషనల్ కమిటీ' కోఆర్డినేటర్ మహమూద్ నవాజా, సెక్రటేరియట్ సభ్యురాలైన మారెన్ మన్జోవనిలు పాల్గొంటారని తెలిపారు. భారతదేశ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సభకు జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. రైతు కూలీ సంఘాల నేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

ఈయూ దీక్షలకు ఎస్‌డబ్ల్యుఎఫ్ సంఘీభావం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి రిలే దీక్షలు చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళనకు టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) సంఘీ భావం తెలిపింది. బుధవారంనాడిక్కడి ఈయూ కార్యాలయంలోని రిలేదీక్షల శిబిరాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రచార కార్యదర్శి రవీందర్‌రెడ్డి సందర్శించారు. తమ సంఘీభావాన్ని తెలిపారు. అన్ని కార్మిక సం ఘాల డిమాండ్లు ఒక్కటే అయినప్పుడు వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలకై కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్టీసీ కార్మికులపై తీవ్రమైన పనిభారాలు పెరిగాయని, సకల జనుల సమ్మెలో వేతనంతో కూడిన సెలవు మంజూరు సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ, యాజమాన్య నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే...నిర్బంధం కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఎంప్లాయిస్ యూనియన్ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, కె రాజిరెడ్డి మాట్లాడారు.

సెలూన్లకు సబ్సిడీపై విద్యుత్ ఇవ్వాలి

- క్షౌరవృత్తిదారులపై పెరుగుతున్న దాడులు
- రక్షణ చట్టం అమలు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వినయకుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

క్షౌరవృత్తిని ఆధునీకరిస్తామని, సెలూన్లకు వాడే విద్యుత్ సబ్సిడీపై ఇస్తామని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ముందు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, ఎంబీసీ సలహాదారులు ఎస్.వినయకుమార్ విమర్శించారు. 'నాయీ బ్రాహ్మణుల సమస్యలు-పరిష్కారాలు' అనే అంశంపై బుధవారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో నాయీబ్రాహ్మణ క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెన్నారం మల్లేశం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినయకుమార్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో సెలూన్లు నడుపుకుంటున్న క్షౌరవృత్తిదారులకు సబ్సిడీపై విద్యుత్ అందకపోవడం వల్ల వారి సంపాదనలో 50 శాతం కరెంటు బిల్లులకే పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై విద్యుత్ ఇవ్వకపోగా కమర్షియల్ బేస్‌లో బిల్లులు వసూలు చేస్తున్నారని అన్నారు. జీవో 27 ప్రకారం ప్రభుత్వ దవాఖానాల్లో బార్బర్, ధోబీ పోస్టులను భర్తీ చేయకుండా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో నియామకాలు జరపడం సరికాదన్నారు. నాయీబ్రాహ్మణులు ఆత్మగౌరవంతో కులవృత్తి చేసుకునే విధంగా 30 వేల వరకు కొత్త సెలూన్లు ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, కానీ, గత బడ్జెట్‌లో రూపాయి కూడా ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. నేటికీ క్షౌరవృత్తి దారులు గ్రామాల్లో వెట్టి, వివక్ష, సామాజిక అణిచివేతకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయీబ్రాహ్మణులపై దాడులు, దౌర్జన్యాలు, కులం పేరుతో దూషించే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో చట్టం చేయాలని, అది కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజ్యాధికారంలో వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ కులాలకు రాజ్యాధికారంలో రిజర్వేషన్లు కల్పించి ఏ,బీ,సీ,డీ కేటగిరీలు అమలు చేసి పంచాయతీ బోర్డుల్లో అవకాశం కల్పించి సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.మహేష్ చంద్ర మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పాటు చేసి పాలక వర్గాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి నాయీ బ్రాహ్మణులకు రూ.2 లక్షల నుండి రూ.12 లక్షల వరకూ 60 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సబ్‌ప్లాన్ రాష్ట్ర కార్యదర్శి కిల్లె గోపాల్, నాయి యువసేనా రాష్ట్ర కార్యదర్శి రాకేష్ నాయి, రజక యువసంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, టీపీఎస్‌కే రాష్ట్ర కార్యదర్శి కె.హిమబిందు, గ్రేటర్ రజక వృత్తి సంఘం నేత తాన్నె సంపత్‌కుమార్, ఎంబీసీ గ్రేటర్ నగర కార్యదర్శి జి.నరేష్ పాల్గొన్నారు.

28న సంచార జాతులపై జాతీయ సెమినార్


- బీసీ కమిషన్ చైర్మెన్ రాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంచార జాతులు, విముక్త జాతులు, అర్ధ సంచార జాతులపై ఈ నెల 28, 29న సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సెమినార్‌లో సామాజిక వర్గాల విద్యావంతులు, ఉద్యమకారులు, పరిశోధకులు దేశంలోని, రాష్ట్రంలోని విముక్త జాతుల వివరాలు, వారి జీవనశైలీ, సంస్కృతి గురించి తెలుసుకోవచ్చన్నారు.

రిజర్వేషన్లపై కేంద్రానికి తప్పుడు సమాచారం

కేసీఆర్‌పై షబ్బీర్ అలీ ఫైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గిరిజన, ముస్లిం రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖరరావు తప్పుడు సమాచారం అందించడం వల్లే...రిజర్వేషన్లపై కేంద్రం తేల్చడం లేదని మండలిలోని ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ చెప్పారు. జనాభా ప్రాతిపదికన ఎంత శాతం రిజర్వేషన్లు కావాలో చెప్పకుండా తప్పుడు కూడిన లేఖలు రాశారని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ రాసిన తప్పుడు లేఖలను ఆయన విడుదల చేశారు. పార్లమెంట్‌లో రిజర్వేషన్లపై టీఆర్‌ఎస్ డ్రామాలాడు తుందన్నారు. ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్లపై కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శిం చారు. రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం స్పందించిన లేఖ రాసినా ముఖ్యమంత్రి పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ రిజర్వేషన్లు ఎందుకు కోరుకుంటున్నారో,సరైన కారణాలు చెప్పాలని ముఖ్యమంత్రికి కేంద్రం లేఖ రాసిందన్నారు. రాష్ట్రంలో ముస్లింలు, ఎస్టీల జనాభా కంటే ఎక్కువ రిజర్వేషన్లను ఎందుకు అడుగుతున్నారో చెప్పాలని కేంద్ర హెూం శాఖ అడిగిన విషయాన్ని ప్రస్తావించారు.

కేటీఆర్ కుర్చీ కోసమే థర్డ్‌ఫ్రంట్ డ్రామా : శ్రవణ్

తన కుమారుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కుర్చీ కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ డ్రామా ఆడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ విమర్శించారు. రాజకీయ వారసుడిగా, ముఖ్యమంత్రిగా పట్టాభిషేకం చేసేందుకే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ అంటున్నారని చెప్పారు. కేటీఆర్‌కు పట్టాభిషేకం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించే ఎత్తుగడల్లో భాగంగానే ఈ ట్రిక్స్‌ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం రాత్రికి రాత్రి తీసుకోవడం వెనుక కొడుకు కేటీఆర్ రాజకీయ భవిష్యతుకు బాట వేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల నుంచి కేసీఆర్ తప్పుకుని కేటీఆర్‌ను ప్రధాన నాయకుడిగా తెర మీదకు తీసుకొస్తే.. నాలుగేండ్ల టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల మనసుల్ని మళ్లించవచ్చన్న వ్యూహంతోనే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానని అంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు ఎదురుగాలి వీస్తుందని, ఆ భయంతో ఆయన జాతీయ నాయకుడిగా ఎదిగాను అనే భ్రాంతి కల్పించడానికే ఈ హడావుడి చేస్తున్నారని చెప్పారు. నాలుగేండ్లుగా కేంద్ర బీజేపీ సర్కారుకు వత్తాసు పలికి ఇప్పుడు ఒక్కసారిగా విమర్శలు చేస్తే మద్దతు ఇచ్చేందుకు ప్రజలేమీ అమాయకులు కాదన్నారు.

కేంద్రంతో ప్రకటన చేయించండి...

రిజర్వేషన్ అంశంపై స్పీకర్‌కు టీఆర్‌ఎస్ ఎంపీల వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను టీఆర్‌ఎస్ ఎంపీలు బుధవారం కలిశారు. బడ్జెట్ రెండో విడత సమావేశాల ప్రారంభం నుంచి రిజర్వేషన్ అంశంపై టీఆర్‌ఎస్ ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ అంశంపై కేంద్రంతో ప్రకటన చేయించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఒక్కో రాష్ట్రంలో రిజర్వేషన్ కోటా ఒక్కో విధంగా ఉందని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందని వివరించారు. ఆ నేపథ్యంలోనే తెలంగాణలో రిజర్వేషన్ కోటాపెంచాలని కోరుతున్నామని చెప్పారు. కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పీకర్‌కు తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి, వినోద్, బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, సీతారాం నాయక్, బాల్క సుమన్, కొండా విశ్వేశ్వరరెడ్డి, నగేష్, పసునూరి దయాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నాల్గో 'సారీ'

- చర్చకు చేపట్టని అవిశ్వాస తీర్మానాలు
- విపక్షాల ఆందోళనలతో సభ వాయిదా
- రాజ్యసభ సైతం రోజంతా వాయిదా
- కేంద్రం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పాటించడం లేదు : గులాంనబీ ఆజాద్ విమర్శ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్ర సర్కారుపై టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను చేపట్టేందుకు లోక్‌సభ స్పీకర్ వరుసగా నాల్గోసారి నిరాకరించారు. టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే ఎంపీల ఆందోళనలను సాకుగా చూపి సభను మళ్లీ రోజంతా వాయిదా వేశారు. వెల్‌లో ఆందోళనలతో... ఈ తీర్మానాలకు మద్దతుగా నిల్చున్న ఎంపీలను లెక్కించడం సాధ్యపడటం లేదని గత మూడు రోజులుగా చెబుతున్న మాటలనే మరోసారి చెప్పారు. ఇక రాజ్యసభలోనూ ఇదే తీరు నెల కొంది. విపక్ష ఎంపీల ఆందోళనతో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు సభను ఏకంగా రోజంతా వాయిదా వేశారు. దీంతో ఎలాంటి సభా కార్యక్రమాలు చేపట్టకుండానే ఉభయసభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలను చేపట్టేందుకు ప్రయత్నించారు. దీంతో టీడీపీ, వైసీపీ ఎంపీలు ప్రత్యేక హోదా డిమాండ్‌ను లేవనెత్తగా.. రిజ్వేషన్‌పై టీఆర్‌ఎస్, కావేరీ నదీ నిర్వహణ బోర్డుపై అన్నాడీఎంకే, డీఎంకే ఎంపీలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. స్పీకర్ వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన తరువాత టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడారు. ఆందోళన చేస్తున్న సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని, సభ కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. అవిశ్వాస తీర్మానాలతో పాటు అన్ని అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అయినప్పటికీ టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ అవిశ్వాస తీర్మానాల నోటీసులపై ప్రకటన చేశారు. వైవీ సుబ్బారెడ్డి(వైసీపీ), తోట నరసింహం(టీడీపీ) సమర్పించిన అవిశ్వాస నోటీసులు అందాయని తెలిపారు. అయితే సభ్యులు ఆందోళన వల్ల ఈ నోటీసులకు మద్దతుగా నిల్చున్న ఎంపీలను లెక్కించడం సాధ్యపడటం లేదని అన్నారు. ఇదే సమయంలో సభను గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించండి

- ఈసీకి అనర్హతకు గురైన కాంగ్రెస్ ఎమ్మెల్యేల విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి అనర్హత వేటుకు గురైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న శాసనసభ కార్యదర్శి టీఆర్‌ఎస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ముద్రించిన ఓటర్ల (ఎమ్మెల్యేల) జాబితా నుంచి ఏకపక్షంగా తమ పేర్లను తొలగించారని వివరించారు. శుక్రవారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్ సమన్వయకర్త మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ బుధవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ కమిషనర్‌ను కలిశారు. ఈ మేరకు ఓ వినతిపత్రం అందజేశారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ పత్రాలపై ఈ ఇరువురు ప్రపోసర్స్‌గా సంతకం చేశారని, ఆ పత్రాలను పరిశీలించిన అనంతరం ఆమోదించారని గుర్తు చేశారు. కానీ అసెంబ్లీ స్పీకర్ కనీసం ఎన్నికల కమిషన్‌ను కూడా సంప్రదించకుండా ఇరువురి పేర్లను జాబితా నుంచి తొలగించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పైగా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఓటర్ల జాబితా నుంచి ఎమ్మెల్యే పేర్లు తొలగించడం లేదా చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సీఈసీతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నేతలు అనర్హత వేటు వేసిన ప్రక్రియపై ప్రధానంగా ఫిర్యాదు చేశారని తెలిసింది. గతంలో లోక్‌సభలో పెప్పర్ స్ప్రే వినియోగించినప్పటికీ ఆ ఎంపీలను కేవలం వారం రోజులు మాత్రమే సస్పెండ్ చేశారని, కానీ తెలంగాణ అసెంబ్లీలో ఏకంగా శాసనసభ సభ్యత్వం రద్దు చేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సైతం ఇదే గవర్నర్‌పై దాడికి పాల్పడ్డారని, అందులో ఛైర్మన్ కాలికి గాయం అయ్యిందని కూడా వివరించారని సమాచారం. అయితే అన్ని అంశాలను కమిషన్ సావధానంగా విన్నదని, సానుకూల నిర్ణయం వెలువడనుందని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐక్య పోరాటానికి సిద్ధంకండి

- టీఎస్‌ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ..
- బడ్జెట్‌లో రూ.1,500 కోట్ల కేటాయింపు చేయాలి : గుర్తింపు కార్మిక సంఘం టీఎమ్‌యూకి ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ అమలు చేయాలని, సంస్థకు బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించాలనే డిమాండ్ల సాధనకై అన్ని కార్మిక సంఘాలు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాంచందర్, వివిఎస్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఐక్య పోరాటానికి గుర్తింపు కార్మిక సంఘం టీఎమ్‌యూ అన్ని యూనియన్లను ఏకం చేయాలని సూచించారు. జీత భత్యాల సవరణ కోసం వారం రోజుల్లో మంత్రులతో సమావేశం జరిపి, సమస్యల్ని సానుకూలంగా పరిష్కరిస్తామని టీఎమ్‌యూ నేతలు ప్రకటించారని గుర్తుచేశారు. ఉద్యోగ భద్రతపై యూనియన్ ప్రతినిధులు, యాజమాన్యంతో కలిపి కమిటీలు వేసి చర్చిస్తామన్నారని, అయితే ఇప్పటి వరకు వేసిన కమిటీలు ఇచ్చిన రిపోర్టుల్ని ఏం చేశారని ప్రశ్నించారు. ఆ రిపోర్టుల వల్ల ఉద్యోగ భద్రత ఎందుకు రాలేదో కార్మికులకు బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉద్యోగ భద్రతకు ఆటంకంగా ఉన్న రెగ్యులేషన్స్ చట్టాలు మార్చుకుందామని ఉద్యమనేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, నాలుగేండ్లయినా ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. అక్రమ వాహనాలను అరికట్టేందుకు యూనియన్ ప్రతినిధులతో పాటు రవాణాశాఖ సిబ్బందిని నియమిస్తామని పత్రికల్లో వార్తలు వచ్చాయని, గతంలో వేసిన కమిటీల్లో జిల్లా ఎస్పీలు, రవాణాశాఖాధికారులు ఉన్నారని, కానీ అక్రమ వాహనాలు ఎందుకు నిరోధింపబడలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ భవనం ఎదుటే వందలాది వాహనాలు స్టేజి క్యారేజ్‌తో నడుపుతుంటే ఎందుకు నిరోధించలేకపోతున్నారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం, గుర్తింపు కార్మిక సంఘంపై ఉన్నాయని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలకు మూలకారణం పనిభారాలు పెంచడమేనని, స్పెషల్ ఆఫ్‌లు రద్దు చేసి, సింగిల్ క్రూ సర్వీసులు పెంచడం, కండక్టర్లు లేని సర్వీసులు నడపడం, కోర్టు తీర్పుకు భిన్నంగా డ్రైవర్లకు టిమ్ మిషన్లు ఇచ్చి రెండు పనులూ చేయించడం వల్ల నల్లగొండ, హైదరాబాద్ వంటి రీజియన్స్‌లో కండక్టర్లు అధికంగా ఉన్నారనే పేరుతో ఇతర రీజియన్స్‌కు బదిలీ చేస్తున్నారని వివరించారు. పని వత్తిడి వల్ల ఆరుగురు డ్రైవర్లు గుండెపోటుతో స్టీరింగ్‌పైనే మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ నష్టాలు పూడ్చుకోవడానికి 2017 మార్చి వరకు రిక్రూట్‌మెంట్ జరపనందునే ఖాళీలు ఏర్పడ్డాయని స్పష్టంచేశారు. ఆర్టీసీ విస్తరణ జరగాలంటే బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సుల కొనుగోలుకు రూ.140 కోట్లు అప్పుగా బడ్జెట్‌లో కేటాయిస్తే ఆర్టీసీ అభివృద్ధి ఎలా సాధ్యమౌతుందని ప్రశ్నించారు. గుర్తింపు కార్మిక సంఘం టీఎమ్‌యూ చొరవ చూపి, అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం సాధ్యమౌతుందని స్పష్టం చేశారు.

బలహీన వర్గాలకు రక్షణ కల్పించాలి

- ధర్నా కోసం మీరు ఢిల్లీ వెళ్తే.. మేమెక్కడ చేయాలే..? : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- కేసీఆర్‌ది నిరంకుశ పాలన : నగేష్ ముదిరాజ్



నవతెలంగాణ - సిటీబ్యూరో

తెలంగాణలో సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు కనీస రక్షణ కరువైందని, వారికి బడ్జెట్‌లోనూ తీరని అన్యాయం జరుగుతోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. రజకులపై దాడులు, హత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని అంబర్‌పేట మహాత్మా జ్యోతి పూలే విగ్రహం వద్ద బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పెంపు కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తానని చెబుతున్నారు... మరి హక్కులు సాధించుకోవడానికి, సమస్యల పరిష్కారానికి మేమెక్కడ ధర్నాలు చేయాలని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రజలపై ప్రయోగిస్తున్న నిర్బంధాలను మానుకోవాలన్నారు. ధర్నాచౌక్‌ను ఎత్తేయడం కారణంగానే పూలే విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్నామని, ఇక్కడా పోలీసులను మోహరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ నిరసనకు ముందుగా అనుమతించిన పోలీసులు, ఆ తర్వాత ఆటంకపర్చడం సరైంది కాదన్నారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధి నగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. నాలుగేండ్లుగా బీసీలకు కేటాయించే బడ్జెట్ తగ్గిపోతోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బడుగు, బలహీనవర్గాలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. టీడీపీ బీసీ సెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రామేశ్వర్ రావు మాట్లాడుతూ.. రజకుల న్యాయమైన డిమాండ్లకు టీడీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఎంబీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ.. రజకులపై నానాటికీ దాడులు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు మాట్లాడుతూ.. రజకుల సంక్షేమానికి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. బ్యాంక్‌లతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. నిరాహార దీక్షకు టీడీపీ నాయకులు రవీంద్రాచారి, మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.సుభద్ర, ఆర్.అశోక్, చంద్రకళ, కాశయ్య పాల్గొన్నారు.

వెయిటేజీ వద్దు.. ఇన్‌సర్వీసే ముద్దు

- ఉత్తర్వులను సవరించాలి : టీజీజీడీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీజీ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాను కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లను రద్దు చేసి వెయిటేజీ విధానాన్ని తీసుకువస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తుర్వులు జారీ చేయడాన్ని వారు తప్పుబట్టారు. ఈ మేరకు పలువురు సీనియర్ ప్రభుత్వ డాక్టర్లు బుధవారం కేంద్రం సంఘం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంతకు ముందు వున్న 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్‌క్లినికల్ కోటాను రద్దు చేస్తూ ప్రభుత్వం జీఓ నెం. 21, 22ను తీసుకువచ్చిందన్నారు. వెయిటేజీ మార్కుల ద్వారా ఇన్‌సర్వీస్‌లో పీజీ సీటు పొందాలనుకునే వైద్యులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తున్న సమయంలో వారి ఉత్సాహంపై నీళ్లు చల్లే విధంగా ఉత్తర్వులు జారీచేయడం శోచనీయమన్నారు. వెయిటేజీ నిర్ణయంతో భవిష్యత్తులో ప్రభుత్వ సర్వీస్‌లో చేరాలని భావించే వైద్యులకు ఈ జీఓ శరాఘతంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. జీఓలను సవరించకపోతే భవిష్యత్తులో వైద్య సేవలు కుంటుపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నేషనల్ పూల్‌కు 50 శాతం సీట్లు కేటాయించారని..మిగిలిన 50 శాతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ కోటాను ఇన్‌సర్వీస్ కోటా ద్వారా భర్తీ చేయాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెయిటేజీ రద్దు చేసి..ఇన్‌సర్వీస్ విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు.

అదుపుతప్పి బావిలో పడ్డ కారు

తాతామనువడు మృతి • తల్లీబిడ్డలకు తీవ్ర గాయాలు



బావిలో పడిన కారు

నవతెలంగాణ-హుజూరాబాద్ రూరల్

కారు టైర్ పంక్చర్ అయి అదుపు తప్పి బావిలో పడటంతో తాత, మనువడు మృతిచెందారు. తల్లీబిడ్డలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల వివరాల మేరకు.. వరంగల్ నగరంలోని గణేష్‌నగర్‌కు చెందిన ఎదురుగట్ల సుధాకర్ (65), కోడలు భవాని, మనువడు వివాన్ (6), మనువరాలు శాన్వీలు కారులో వరంగల్ నుంచి కరీంనగర్ జిల్లా తాడికల్‌కు వెళ్తున్నారు. మార్గంమధ్యలో సింగాపూర్ గ్రామ శివారులోకి రాగానే కారు టైర్ అకస్మాత్తుగా పగిలి అదుపు తప్పింది. అదే వేగంతో వెళ్లి రోడ్డు పక్కన గల వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లి బావిలో పడిపోయింది. పక్కనే ఉన్న స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామస్తుల సహకారంతో బావిలో నుంచి నలుగురిని బయటకు తీశారు. అప్పటికే తాత సుధాకర్, మనువడు వివాన్ చనిపోయారు. కోడలు భవాని, మనువరాలు శాన్వీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనాస్థలిని హుజూరాబాద్ ఏసీపీ కృపాకర్, టౌన్ సీఐ రమణమూర్తి, రూరల్ సీఐ రవికుమార్‌లు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అంకెల్లో పెంచారు.. అమల్లో తుంచారు

'దళితులు - బడ్జెట్' పై చర్చా వేదికలో జాన్‌వెస్లీ




మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాలుగేండ్ల టీఆర్‌ఎస్ పాలనలో దళిత సంక్షేమానికి ప్రతి బడ్జెట్‌లో కాగితాల్లో అంకెలు పెరుగుతున్నాయే తప్ప వాటిని ఖర్చు చేయడం లేదని టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్‌లో నిధులు విడుదల కావు.. అయినా వాటిని ఖర్చు చేయరని విమర్శించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కృపాసాగర్ అధ్యక్షతన దళితులు- బడ్జెట్ అనే అంశంపై చర్చా వేదిక జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ దళితులకు కేటాయిస్తున్న బడ్జెట్‌లో 50శాతం నిధులు కూడా ఖర్చు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేకాభివృద్ధికి కేటాయించిన నిధుల్లో 28 శాఖలు నయాపైసా ఖర్చు చేయలేదని తెలిపారు. దళితుల మౌలిక ప్రయోజనాల కోసం ఖర్చు చేయాల్సిన "ప్రత్యేక అభివృద్ధి నిధి" నిధులను సాధారణ పద్దుల కింద చట్ట విరుద్ధంగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. నాలుగేండ్ల బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.40,5277 కోట్లు కేటాయిస్తే అందులో నుంచి రూ.18,809 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వాలు చట్ట విరుద్ధంగా సబ్‌ప్లాన్ నిధులను మళ్లించిన విధంగానే టీఆర్‌ఎస్ సర్కారు కూడా అదే తరహాలో మిషన్ భగీరథ, హైదరాబాద్ రోడ్ల అభివృద్ధి, స్మార్ట్ సిటీ, పట్టణాభివృద్ధి, ట్రాన్స్‌కో లాంటి సాధారణ పథకాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను దారిమళ్లించిందన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది భూమి లేని నిరుపేద దళితులకు ప్రతి సంవత్సరం 60వేల కుటుంబాల చొప్పున ఐదేండ్లలో మూడు లక్షల కుటుంబాలకు తొమ్మిది లక్షల ఎకరాలను భూ పంపిణీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ నాలుగేండ్లలో ఇప్పటికీ కేవలం 4,989 కుటుంబాలకు 12,745 ఎకరాలను మాత్రమే పంపిణీ చేసిందని చెప్పారు. ఈ లెక్కన చూస్తే భూ పంపిణీ పూర్తవడానికి 100 ఏండ్లు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2,72,76 కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామన్న ప్రభుత్వం కేవలం 9, 522 కుటుంబాలకు మాత్రమే ఇండ్లు ఇచ్చిందన్నారు.

ఈ చర్చావేదికలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, పి శంకర్ (డీబీఎఫ్) డెవిడ్, సుధాకర్, శివలింగం, (పీఎంసీ) బి రాంప్రసాద్ (ఎంఎస్‌ఎస్) నర్సింహా(డీబీఎస్‌యు) ఎన్ మణ్యం (బుడగ జంగాల సంఘం) పి వీరస్వామి (బందు సొసైటీ) ప్రొఫెసర్ విజయలక్ష్మి, బండారు శంకర్ (ఆదివాసీ గిరిజన సంఘం) ఎం ధర్మానాయక్ (గిరిజన సంఘం) కిల్లె గోపాల్ (బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ) కోట రమేష్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆర్ వెంకట రాములు (వ్యకాసం) ఎ విజయ్‌కుమార్ (డీవైఎఫ్‌ఐ) గడ్డపాటి విజయరాజు(ఎంసీఎఫ్) పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటానికి సిద్ధం కావాలి



బండారు రవికుమార్

భారతీయుల హృదయాలను ఉత్తేజపరచిన విప్లవకారుడు భగత్‌సింగ్. 1931 మార్చి 23 నాడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష అమలు చేసింది. నిరంతర అధ్యయనశీలురైన ఆ విప్లవకారుల భావాలు, వారి స్వీయ రచనలు, జైలు డైరీలు, సందేశాలు, వారి సమకాలీకులు వారి గురించి రాసిన స్మృతులు చదివితే మాత్రం సామ్రాజ్యవాద వలస పాలన అంతం కావడంతోనే వారి లక్ష్యం పూర్తికాలేదని విదితం చేస్తున్నాయి. భగత్‌సింగ్ మాటల్లోనే చెప్పాలంటే " ఈ పోరాటాలు మాతోనే ప్రారంభం కాలేదు. మాతోనే అంతం కావు. ఒక వ్యక్తిని వేరొక వ్యక్తి, ఒక జాతిని వేరొక జాతి దోచుకోవడానికి వీలులేని న్యాయసమ్మతమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ నిర్మించబడేవరకూ కొనసాగుతాయి. అంతే కాదు, సామ్రాజ్యవాద యుద్ధాల పీడనుండి మానవజాతి విముక్తి అయ్యే సామాజిక వ్యవస్థను నెలకొల్పడమే మా అంతిమ లక్ష్యం" అని విస్పష్టంగా తన రాజకీయ లక్ష్యాన్ని ప్రకటించాడు. భగత్‌సింగ్ ఒక వీరుడిగా, ధైర్య సాహసాలకు, సమరశీలతకు మారుపేరుగా అందరికీ తెలుసు. అంతేకాదు, అతనో గొప్ప నిరంతర అధ్యయనశీలి. గొప్ప ఆలోచనాపరుడు. పరిపక్వమైన సిద్ధాంత భావజాలం కలిగిన మేథోశక్తి సంపన్నుడు.

విప్లవం అంటే .....

విప్లవం గురించి భగత్‌సింగ్ వ్యక్తపరచిన అభిప్రా యాలు మార్క్సిజం, కమ్యూనిస్ట్ పార్టీ కోసం బహిరం గంగానే వ్యవహరించడం కనపడుతుంది. ఒకసారి దిగువ కోర్టులో జడ్జి " విప్లవం " అనే పదం గురించి అడిగినప్పుడు, 1929లో పంజాబ్ విద్యార్థి మహాసభ కు పంపిన సందేశంలో, 1931లో యువ రాజకీయ కార్యకర్తల నుద్దేశించి చేసిన విజ్ఞప్తిలో స్పష్టంగా అభిప్రా యాలు ప్రకటించాడు. " పిస్తోళ్లను, బాంబులను చేపట్ట వల్సిందిగా ఈనాడు మనం యువ కులను అడుగజాలం. పారిశ్రామిక ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ, గ్రా మసీమల్లోని గుడిసెల్లోనూ నివసించే కోట్లాది ప్రజలను చైతన్యపర్చాల్సి ఉంది, నిజమైన విప్లవ సైనికులు గ్రామాల్లోనూ, ఫ్యాక్టరీల్లో వున్న కార్మికుల్లోనూ, కర్షకుల్లోనే వున్నారు". విప్లవం అంటే తప్పనిసరిగా రక్తపాతంతో కూడినదే కానవసరం లేదు. అది వ్యక్తిగత హింసావాదం కానేకాదు. బాంబులకు, పిస్టళ్లకు సంబంధించినది కూడా కాదు".

నేను విప్లవకారుడిని - టెర్రరిస్టును కాదు

పార్టీ నిర్మాణంపై తన రచనల్లో పేర్కొన్నాడు. "నే ను టెర్రరిస్టును కాను. విప్లవకారుడను. ఇందుకు సం బంధించిన ఖచ్చితమైన భావాలు, సుదీర్ఘమైన క్రమ మూ ఉంది. నా విప్లవ జీవితం మొదటి రోజుల్లో మిన హా నేను ఎన్నడూ టెర్రరిస్ట్‌గా వ్యవహరించలేదని గట్టిగా చెప్పగలను. వ్యక్తిగత హింసా చర్యల ద్వారా ఏమీ సాధించలేమని నా దృఢవిశ్వాసం. మార్క్స్, లెనిన్ రచ నలను చదవండి. వారి బోధనలను కార్యాచరణకు మా ర్గదర్శకంగా ఉంచుకోవాలి. ప్రజల వద్దకు వెళ్లండి. కా ర్మికుల్లో, కర్షకుల్లో, విద్యావంతులైన మధ్య తరగతి యు వజనుల్లో పనిచేయండి. వర్గ ప్రాతిపదికపై యూనియ న్లను నిర్మించండి. పార్టీ లేకుండా ఇవన్నీ సాధ్యంకావు."

దైవం - మతం :

ఈనాడు తమ రాజకీయ సిద్ధాంతాల అవసరాల కోసం భగత్, ఆజాద్‌ల పేరు ప్రతిష్టలను ఉపయోగిం చుకొనేందుకు అన్ని రకాల అభివృద్ధి నిరోధకులు, మత ఛాందసవాదులు, మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారు. అందువల్ల వాటిపై భగత్ అభిప్రాయాలు తెలుసుకోవాలి. ఈ భూమిని, ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఒక సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి, భగవంతుడున్నాడని నమ్ముతున్నవారిని కొన్ని ప్రశ్నలు అడు గుదాము. ఒక మనిషి ఏదైనా పాపకార్యం చేయకుండా సర్వశక్తివంతుడైన దేవుడు ఎందుకు ఆపకూడదు? యుద్ధ బీభత్సాలను, మానవ మారణహోమాన్ని సాగించే దుర్మార్గులను ముందుగానే ఎందుకు శిక్షించకూడదు? ప్రపంచ యుద్ధాలను రాకుండా ఆపుచేయలేడా? ఉత్పత్తి సాధనాలను తన గుప్పిట్లో ఉంచుకున్న శతకోటీశ్వ రులు ఒకవైపు, కూడూ, గూడూ, గుడ్డా, వైద్యం లేని కోట్ల మంది ప్రజలు ఒకవైపు – ఈ పరమ కిరాతకమైన దోపిడీ నుండి సమాజాన్ని దేవుడే స్వయంగా విముక్తి చేస్తే బాగుంటుంది కదా ! న్యాయస్థానాన్ని ప్రచార వేదికగా ఉపయోగించుకోవడంలో బాగా జయప్రదమ య్యారు భగత్ ప్రభృతులు. పార్లమెంట్ భవనం బాంబు కేసు, లాహోర్ కుట్ర కేసుల్లో ప్రణాళికాబద్ధం గా, శక్తివంతంగా దేశ ప్రజలను ఉత్తేజపరిచేందుకు కోర్టులో విప్లవకారుల వాదనలు ఉపయోగపడ్డాయి. ఆ సమ యంలోనే జైళ్లలో అధికారులు రాజకీయ ఖైదీలతో అ మానుషంగానూ, అవమానకరంగానూ వ్యవహరిస్తు న్న తీరుకు వ్యతిరేకంగా పోరాడాలనే కేంద్ర కమిటీ నిర్ణయంలో భాగంగా ఏడు ముఖ్యమైన డిమాండ్ల సాధన కోసం భగత్, భటుకేశ్వర్‌దత్తు నిరాహారదీక్షల్లో ఉన్నారు.

మాయావాదులు, మిథ్యావాదులు నిజాయితీగా పోరాడలేరు :

భావవాదులను, మిథ్యావాదులనుద్దేశించి "మీ మార్గం నిష్క్రియతా మార్గం. అన్నిటికీ భగవంతుడి మీద భారం వేసి చేతులు ముడుచుకొని కూర్చొనే పద్ధతి మీది. నిష్కామకర్మ సిద్ధాంతం చాటున " తలరాత " అను మత్తు మందును యువకులకు తాగించి పడుకోబెట్టే మార్గం మీది. ఆ మార్గం ఎన్నటికీ నా మార్గం కాజాలదు. ఈ ప్రపంచాన్ని మిథ్యగా భావించేవారు, ఈ దేశాన్ని, ప్రజలనూ మాయ అని చెప్పేవారు ఎప్పటికీ ప్రపంచ సంక్షేమం కోసమో, ఈ దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసమో నిజాయితీతో పోరాడలేరు. మిథ్య కోసం, మాయ కోసం పోరాటం ఎలా చేయగలరు. ఈ దేశం సజీవమైన వాస్తవం. అందమైన యదార్థం. నేను, నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. నాకు ఈ ప్రపంచం తప్ప వేరే స్వర్గమో, ప్రపంచమో లేదు. కొంతమంది వ్యక్తులు ఈ ప్రపంచాన్ని తమ స్వార్థం కోసం నరకంగా తయారుచేశారనేది నిజం. కానీ అంతమాత్రం చేత ఈ ప్రపంచాన్నే మిథ్య అని ప్రకటించి పారిపోవడం వల్ల ప్రయోజనం లేదు. దోపిడీదారులను, ఇతరులను బానిసత్వంలో బంధించేవారిని అంతంచేసి ఈప్రపంచాన్నే స్వర్గంగా మార్చవల్సి ఉంది " అని భగత్‌సింగ్ అన్నాడు.

మరణమే ఒక సందేశం

భగత్‌సింగ్ ప్రభృతులకు ఉరిశిక్ష తీర్పు కోర్టులో చెప్పే రోజురానే వచ్చింది. " సర్దార్! నీవు చనిపోవడానికి సిద్ధంగా వున్నావు. ఇందుకు నీవేమీ విచారపడటం లేదు కదా? " అని జయదేవ్ కపూర్ భగత్‌సింగ్ నుద్దేశించి అడిగినప్పుడు " విప్లవ పథంలో నేను అడుగిడేటపుడు నా ప్రాణాలర్పించి దేశమంతటా "ఇంక్విలాబ్ జిందాబాద్, విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాన్ని వ్యాపింపజేయగలిగానంటే నా జీవితమే ధన్యమై పోతుందనుకుంటున్నాను. నా ఈ నినాదం స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఉద్దీపింపచేసే శక్తిగా సామ్రాజ్యవాదులను చివరివరకూ దెబ్బతీస్తూనే ఉంటుందనే నమ్మకం నాకుంది. ఇంత చిన్న జీవితానికి ఇంతకంటే మరేం కావాలి". ఈరోజు సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు భగత్‌సింగ్ జీవితమే ఒక సందేశం, స్ఫూర్తి. మరణించడానికి ముందు భగత్ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి రాసిన లేఖలో కొన్ని వాక్యాలు: "త్వరలోనే అంతిమ పోరాటానికి సూచకంగా దుందుభులు మోగనున్నాయి. దాని ఫలితం నిర్ణయాత్మకంగా ఉండబోతోంది. సామ్రాజ్యవాదమూ, పెట్టుబడిదారీ వ్యవస్థ తమ అంతిమ క్షణాలను లెక్కబెడుతున్నాయి. మేము వాటికి వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నందుకు మేమెంతో గర్విస్తున్నాం కూడా". విప్లవ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ భగత్‌సింగ్ ప్రభృతులు మరణించిన తరుణంలో వారి వీర మరణాన్ని ఇలా వర్ణించాడు. " జిస్ తేజ్‌సే కోయీ ముక్తాల్ మే గయా,వో షాన్ సలామత్ రహెతే హై. యే జాన్‌తో అన్‌జానీ హై. ఇస్ జాన్‌కీ కోయీ బాత్ నహీ ". (ప్రాణానిదేముంది – వస్తుంది, పోతుంది. మృత్యు ముఖంలో ఎంత హుందాగా వ్యవహరించారన్నదే ఎవరైనా గుర్తుంచుకుంటారు.)

సెల్ : 9121080160

స్టీఫెన్ హాకింగ్ - మనం



ప్రసాద్

శాస్త్రవిజ్ఞానాన్ని మానవాళికి మరింత చేరువగా తీసుకొని రావడానికి, విశ్వావిర్భావంలో మనకు ఇప్పటికీ అంతుచిక్కని విషయాలను ఆవిష్కరించి, భూమిపై మన మనుగడకు మరింతగా తపించిన ఓ అసాధారణ శాస్త్రవేత్తగా, విజ్ఞాన పిపాసి స్టీఫన్ హాకింగ్‌ను ఆయన జీవితాకాలంలోనే గుర్తించాం. అందుకు ఆయన పరిశోధనలే కారణం.

చదువుచెప్పే ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉండాలనే విషయం మరిచిపోయినట్టుగా కనిపిస్తుంది. పిల్లలకు చెప్పే పాఠాలు మనం నేర్చుకోవాలి. శాస్త్రవిజ్ఞానాన్ని బోధించే ఉపాధ్యాయులను ఈ సందర్భంలో ప్రత్యేకించి చెప్పుకోవాలి. పాఠ్యాంశాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడం, వాటిని పిల్లలకు అందించే క్రమంలో వాళ్లల్లో శాస్త్రీయ వివేచన పెంపొందించడం సైన్సు ఉపాధ్యాయులుగా మనం చేయాల్సిన పని. ఉపాధ్యాయులుగా మనం శాస్త్రీయంగా ఆలోచించలేకపోతే పాఠ్యాంశాలను మనం మన పిల్లలు శాస్త్రీయంగా అర్థం చేసుకొనేలా చేయలేం. శాస్త్రీయంగా మనం ఆలోచించడమనేది మన జీవితంలో విడదీయలేని భాగం. అది నిరంతరం ఆలోచనలు, ఆచరణ కలిసి కొనసాగే ఓ ప్రక్రియ. నాగరిక మానవులుగా మనం జీవితాంతం నేర్చుకుంటూనే ఉంటాం. అలాగే శాస్త్రీయంగా విషయాల్ని అర్థం చేసుకోవడం కూడా. ఇది అంత సులువైనది కాదు. కానీ ప్రయత్నమే చేయకపోతే ఉపాధ్యాయ వత్తిని వంచించడమే అవుతుంది. నేర్చుకోవడానికి మనదగ్గర చేరిన పిల్లలు దీనికి భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుంది. మన సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలు, మన ఆలోచనలు పరస్పరం ప్రభావితం చేసుకుంటుంటాయి. శాస్త్రీయంగా ఆలోచించలేని వాళ్లు వీటిని అర్థం చేసుకోలేరు. స్వార్థం, సంకుచితత్వం, పిడివాదం, పలాయనవాదం, విశాలదష్టి లోపించడం వీళ్ల ఆలోచనలు, వాదాలలో కనిపిస్తుంటాయి. మన ఆలోచనలు శాస్త్రీయమైనప్పుడు మాత్రమే మనం నాగరికులం. శాస్త్రీయమైన ఆలోచనలది పైచేయి అయినప్పుడే మన మానవసమాజం ఆరోగ్యకర ప్రజాస్వామిక పునాదులపైన పురోగమిస్తుంది. శాస్త్రీయంగా ఆలోచించడమంటే మూఢనమ్మకాలను తిరస్కరించడం. ఆధారసహితమైన వాటినే అంగీకరించడం. నిరంతరం ఎందుకు, ఎలా? అని ప్రశ్నించడం. విజ్ఞాన శాస్త్ర వెలుగులో మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. జ్ఞానమనేది మనిషి నిరంతరం సంఘజీవనంలో భాగస్వామిగా ప్రయత్నం చేసి సంపాదించుకొనే సమిష్టి సంపదగా అర్థం చేసుకోవడం. అది దానంతట అదిగా మానవ సంబంధాలు, గత, వర్తమాన కాలాల అనుభవాలు, శోధనలతో నిమిత్తం లేకుండా భగవత్ స్సాక్షాత్కార పదార్థంగా భావించకుండా ఉండటం. కల్పనకు వాస్తవానికి ఉన్న తేడాను అర్థం చేసుకోవడం. శాస్త్రీయ పరిశోధనల ద్వారానే మనకు ఇంకా అర్థంకాని విశ్వరహస్యాలను శోధించగలమని గుర్తించటం. విశ్వం, మానవ నాగరికతలు, నమ్మకాలు, ఎప్పుడూ ఒకేలా ఉండవని, చివరకు విజ్ఞానశాస్త్రం కూడా నిరంతరం తననుతాను కొత్తగా వెలుగులోనికి వచ్చిన వాస్తవాలు, ఆవిష్కరణల నేపథ్యంలో మార్పు చేసుకుంటూ విస్తరిస్తుందని నేర్చుకోవడం. విద్యార్థులలో శాస్త్రీయజ్ఞానాన్ని పెంపొందించడమంటే వాళ్లలో ఉన్న ఆసక్తిని, పరిశీలనాశక్తిని, ప్రశ్నించే తత్వాన్ని, మరింతగా ప్రోత్సహించడం. తిరోగమన వాదాల్ని, కొత్త ముసుగు వేసుకున్న సంప్రదాయాల్ని తిరస్కరించడం. పని సంస్కతిని ప్రేమించేలా చేయడం. నిరంతర విద్యార్థిగా ఉండటం.

ఉపాధ్యాయులకు శాస్త్రీయ ఆలోచనా విధాన అవసరం

చైన్యవంతులైన ఉపాధ్యాయులు శాస్త్రీయ ఆలోచనా విధాన బీజాలు తరగతిగదిలోనే నాటాలి. ఉపాధ్యాయులుగా మనం ఓ శాస్త్రీయ సంస్కతికి ప్రతినిధులుగా ఉండాలి. శాస్త్రీయ ఆలోచన విధానం ఒక్క సైన్స్ ఉపాధ్యాయులకే కాదు, ఉపాధ్యాయులందరికీ ఉండాలి. ఎందుకంటే శాస్త్రీయ వివేచనే మెరుగైన గురుశిష్య సంబంధాలను పెంచుతుంది. శాస్త్రీయ దక్పథం పెంచడంలో ప్రత్యేకించి ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందుండాలి. వారి జీతభత్యాలు, ఉద్యోగ భద్రత వారి బాధ్యతను మరింతగా పెంచుతాయి.

వేగంగా విస్తరించాల్సిన పురోగామి భావజాలం

స్టీఫన్ హాకింగ్ మరణించిన తర్వాత ఆయనకు వాట్స్‌అప్ ద్వారా నివాళి అర్పిస్తే మా నవోదయ ఉపాధ్యాయ గ్రూపుల్లోనే స్పందించిన వారు తక్కువ. కొద్దిమంది నా ఉపాధ్యాయ మిత్రులు ఆయన గురించి ఇప్పుడే మొదటిసారిగా వినుంటారు. అందరికీ అందరి గురించి తెలియాలంటే కష్టమే. ప్రజాశక్తి వారు 2016 నవంబరులో ప్రచురించిన ఏ.ఎస్.నీల్ పుస్తకం 'పిల్లలు నేర్చుకోవడంలో ఉపాధ్యాయులతో వచ్చే సమస్యలు' నా దష్టికి రావడాని దగ్గర దగ్గరగా రెండు సంవత్సరాలు పట్టింది. నిజానికి ఏ.ఎస్.నీల్ ఆ పుస్తకం రాసి ఓ అరశతాబ్దకాలం పైగానే గడిచింది. ఇలా ప్రగతిశీల మేధావుల ఆలోచనలు విశ్వవ్యాప్తమవ్వడానికి పట్టే సమయం చాలా విచారం కల్గిస్తుంది. దీనివలన కలిగే నష్టం అపారం.

సమిష్టి సంస్కతి ద్వారా శాస్త్రీయ ఆలోచనా విధాన వ్యాప్తి

ఉపాధ్యాయులు కలిసి పనిచేసే సంస్కతి ఉన్నప్పుడు ప్రగతిశీల ఆలోచనలు, పరిశోధనలపై చర్చ జరిగే వాతావరణం ఉంటుంది. నిరంతర అధ్యయనం, చర్చ, భావాల సంఘర్షణ, మానవాళి ఆరోగ్యకర పురోగమనం కోసం తపన ఉపాధ్యాయులుగా మన ఆలోచనలు, పనితీరులో కనిపించాలి. ఇందుకు చాలాసార్లు వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంటుంది. శాస్త్రీయ భావజాలం వేగంగా విస్తరించడాన్ని ఉపాధ్యాయులు తరగతి గదులను, మీడియాను సాంస్కతిక, కళా రంగాలను వాడుకోవాలి. ఇది సమిష్టి బాధ్యత. ఈ కర్తవ్యాన్ని నిరంతరం నిర్వహించడమే మనం స్టీఫెన్ హాకింగ్ లాంటి మేధావులకు ఇచ్చే నిజమైన నివాళి.

సెల్ : 9494343022

భగత్‌సింగ్ భావనలు యువతకు మార్గదర్శకం



తాళ్ల నాగరాజు

దేశ విముక్తి కోసం సామ్రాజ్యవాద కసాయితనాన్ని సవాల్‌చేసి, మృత్యువును ముద్దాడిన విప్లవకారులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు. వారు చూపిన తెగువ, త్యాగం, ధైర్యం, సామ్రాజ్యవాద వ్యతిరేకత నేటి మన దేశ విద్యార్థి, యువజన ప్రజలందరి హృదయాలలో చెరగని ముద్ర వేసింది. వారు వెదజల్లిన త్యాగాల విప్లవ పరిమళం నేటికీ స్ఫూర్తినిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో మతం, మతతత్వం పట్ల వారి ఆలోచనలు తెలుసుకోవడం నేడున్న సమాజానికి చాలా అవసరం. ఈరోజు 71 సంవత్సరాల తర్వాత స్వతంత్ర భారతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి దేశ ప్రజల ఐక్యతకు గొడ్డలిపెట్టుగా వున్న మతోన్మాదం. ఒక దేశ చరిత్రను తెలుసుకోకుండా ఆ దేశ భవిష్యత్‌ను నిర్మించలేం. స్వాతంత్ర్యోద్యమ వారసత్వంలేని పార్టీ, ఆంగ్ల పాలకులకు లొంగిపోయిన వారిని నాయకులుగా కలిగిన పార్టీ ఈ రోజున పెద్ద పార్టీగా ఆవిర్భవించి దేశంలో నేడు అధికారంలో ఉంది. మతం పట్ల, మతోన్మాదం పట్ల సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పిన వ్యక్తి భగత్‌సింగ్. ఆయన మతోన్మాదం పట్ల ఇలా వ్యాఖ్యానించాడు. "భయం, అజ్ఞానం, ఆత్మన్యూనత నుండి మానవుడు సృష్టించుకున్నదే మతం, దేవుడు" అన్నారు. "క్రూరమైన దోపిడీ సమాజంలో ఒకవైపు సకల భోగాలతో కొద్దిమంది కులుకుతుంటే, అత్యధిక ప్రజానీకం అంతులేని దారిద్ర్యంతో అలమటించి పోతుంటారు. ఆకలి, అనారోగ్యం, ఆర్తనాదాలు సర్వ సామాన్యం. ఈ స్థితిలో మతం అనేది అణచివేయబడిన మనిషి యొక్క నిట్టూర్పు. అది హృదయం లేని ప్రపంచంలో హృదయం లాంటిది. కాబట్టి అది ప్రజల పాలిట మత్తు మందులాంటిది. అని మార్క్స్ వ్యాఖ్యానించాడు. కానీ నేడు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేవారే భగత్‌సింగ్ వారసులం అంటున్నారు. లెనిన్ రాసిన గ్రంథాలు చదివిన తర్వాత మాత్రమే "నేను నాస్తికుడిని" అని భగత్‌సింగ్ ప్రకటించుకున్నాడు. భారతదేశ జాతీయోద్యమాన్ని మనం పరిశీలిస్తే స్వాతంత్ర్యానికి ముందు దేశమంతా అనేక స్వతంత్ర సంస్థానాలుగా ఉంది. హిందువులు, ముస్లింల మధ్య గానీ, రాజుల మధ్య గానీ మతం ఆధారంగా మొదట అసూయా ద్వేషాలు లేవు. హిందూ రాజైన శివాజీ యొక్క నౌకాదళాధిపతి ధర్మసాంగ్, సేనాపతులు ఇబ్రహీంఖాన్, దౌలత్‌ఖాన్, శివాజీని ఆగ్రా నుండి తప్పించిన యువకుల్లో ఒకరైన మెహతర్‌లు ముస్లింలే. అంతేకాదు, అక్బర్ మంత్రులు, సేనానులు తోడమల్, బీర్బల్, మాన్‌సింగ్, ఔరంగజేబు సర్వ సేనాని జయసింగ్‌లు హిందువులు. బ్రిటిష్ వారితో యుద్ధంలో చనిపోయిన టిప్పుసుల్తాన్ చక్రవర్తి యొక్క ప్రధాని పూర్ణయ్య పండితుడు. తానీషా మంత్రులు అక్కన, మాదన్నలు హిందువులు. 1857 తిరుగుబాటు తర్వాత ఒక సీనియర్ బ్రిటిష్ అధికారి "ఐచిసిన్" భారతదేశంలోకి మనం రావడానికి ఒక తరం హిందూ, ముస్లింల మధ్య అసూయా ద్వేషాలు లేవు. 1857 తిరుగుబాటు ఘటన ఏం తెలియజేసిందంటే భారతీయులు మధ్య యుగాల్లో "మతతత్వవాదులు" కారు. హిందూ, ముస్లిం ఐక్యత పెరిగితే తమ ఆటలు సాగవని ఆంగ్లేయులు భావించారు. చరిత్రలో హిందూ–ముస్లిం తగాదాల కంటే హిందూ మతంలోనే తగాదాలు ఉన్నాయి.

అందుకే నిరంతర అధ్యయనశీలి భగత్‌సింగ్ మతతత్వ ముప్పును అర్థం చేసుకున్నాడు. సామ్రాజ్యవాదంలాగా, మతోన్మాదం కూడా అతి పెద్ద ప్రమాదమని ఆయన "నవజవాన్ భారత సభ", "హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ" (హెచ్ఎస్ఆర్ఏ) ఏర్పాటు సందర్భంగా తన సహచరులకు చెప్పాడు. మతం వ్యక్తిగత అంశంగా ఉండాలనీ అది రాజకీయాలలో చొరబడి మతోన్మాద రూపం తీసుకున్నప్పుడు దానిని పెద్ద శత్రువుగా ఎదుర్కొనాలనీ, మతం, మూఢ నమ్మకాల నుండి ప్రజలు బయటపడాలని భగత్‌సింగ్ అనేవాడు. గదర్ పార్టీ (1914–1918) కూడా మతాన్ని రాజకీయం నుండి వేరు చేసింది. మతం స్వంత వ్యవహారమని ప్రకటించింది. బాబా సోహన్‌సింగ్ బాక్నా "మేము సిక్కులం లేదా పంజాబీలం కాదు. మా మతం దేశభక్తి" అని ప్రకటించాడు. సుభాష్ చంద్రబోస్ కూడా జాతీయోద్యమ పోరాటంలో మతతత్వవాదులను ఆంగ్ల పాలకులు విభజించు–పాలించు వ్యూహం ప్రకారం ఎంతగానో ప్రోత్సహించారనీ, జాతీయ కాంగ్రెస్ పలుకుబడి తగ్గడానికి వీరిని వాడారని తన ఆత్మకథలో ప్రకటించాడు. నెహ్రూ కూడా స్వాతంత్ర్యం రాక ముందు నుండే ముస్లింలీగ్, హిందూ మహాసభలను ఫాసిస్ట్ తరహా సంస్థలంటూ ఎండగట్టాడు. అందుకే దేశ చరిత్రను లోతుగా అధ్యయనం చేయాలి. "భగత్‌సింగ్ చెప్పినట్టుగా మతపరమైన భావోద్వేగాల నుండి ప్రతి మతం వారు బయటపడాలి. 1930 అక్టోబర్ 7న భగత్‌సింగ్, అతని సహచరులు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఉరిశిక్ష విధించగా 1931 మార్చి 23న దానిని అమలు చేశారు. ఈ ఆరు నెలల కాలంలో ఆయన ఏనాడూ నిరాశా, నిస్పృహలకు లోను కాలేదు. ఉరికి ముందు కూడా చదువుతూనే ఉన్నాడు. ఈ దేశానికి సామ్యవాద భావాలు అవసరం అని చెప్పిన గొప్ప దార్శనికుడు భగత్‌సింగ్.

కానీ నేడు భగత్‌సింగ్ హెచ్చరించిన మతోన్మాద విధానాలను అమలు చేస్తున్న పార్టీనే దేశాన్ని పరిపాలిస్తున్నది. ఈ కాలంలో నిరుద్యోగం పెరిగింది. ఉపాధి కల్పన రేటు 1 శాతం కన్నా తక్కువగా ఉంది. 15–29 వయస్సుగల వారు 30 కోట్ల మంది ఉన్నారు. నిరుద్యోగ శాతం 13.3 శాతంగా ఉంది. ఆర్థిక సంక్షోభం, పారిశ్రామిక సంక్షోభం మూలంగా ఐటీ రంగంలో నిరుద్యోగం పెరిగింది. దేశంలో తీవ్రమైన అసమానతలు పెరిగాయి. అత్యంత సంపన్నులైన భారతీయుల వద్ద దేశ సంపద మొత్తం 28శాతం ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయి. దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య పెరిగిపోతున్నది. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం సంవత్సరానికి 28.84 లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇస్తున్నది. ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ దేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదులకు అప్పజెప్పే కుట్ర చేస్తున్నారు. విద్యలో, బీమాలో, రైల్వేలో, చివరకు రక్షణ రంగంలో ఎఫ్‌డీఐలు తెస్తూ భారత ప్రజలను విదేశీ కంపెనీలకు దాసోహం చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వ విధానాలు, నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా దేశంలో ప్రతిఘటన పెరుగుతున్నది. రైతుల సమైక్య పోరాటాలు పెరిగాయి. మహారాష్ట్రలో గతంలో 11 రోజుల రైతుల సమ్మె అనంతరం నాసిక్ నుండి ముంబై వరకు వేలమంది రైతుల పాదయాత్ర, జార్ఖండ్, రాజస్థాన్‌లో రైతుల ఆందోళనలు, కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె, యూనివర్శిటీలలో విద్యార్థుల పోరాటాలు, దళితుల పోరాటాలు బలంగా రోజు రోజుకూ పెరుగుతున్నాయి. రానున్న కాలంలో సామ్రాజ్యవాద, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్, అతని సహచరుల స్ఫూర్తితో బూర్జువా ప్రభుత్వ విధానాలను అరికట్టాలి. 12 ఏండ్లకే స్వాతంత్ర్య ఉద్యమంలో నిలిచి, 23 ఏండ్ల చిరుప్రాయంలోనే ఉరికంబం ఎక్కి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు సింహస్వప్నంగా నిలిచిన భగత్‌సింగ్ కలలు కన్న భారతదేశం మాత్రం రూపొందలేదు. అందుకే భగత్‌సింగ్, అతని సహచరుల సామ్యవాద ఆశయ సాధన కోసం నిత్యం పోరాడుతూ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగం, సోషలిజం వంటి భావాలు నేటి యువత పుణికిపుచ్చుకొని మతోన్మాద, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించాలి.

సెల్ : 9493063626

భగత్‌సింగ్ భావజాల వ్యాప్తే నిజమైన నివాళి



ప్రభాత్ కట్టా

భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి అంటే ఒక దండ వేసి, నాలుగు పూలు చల్లి జోహార్లు అర్పించడమేనా? లేకుంటే మన కంప్యూటర్ డెస్క్‌టాప్ మీద, ఫేస్‌బుక్, వాట్సాప్ ప్రొఫైల్ పిక్‌గా భగత్‌సింగ్ ఫొటో పెట్టడం.. ఇవేనా భగత్ సింగ్‌కు జోహార్లు అర్పించడానికి మార్గాలు? వీటితోపాటు ఇంకా ఏదో చేయాలి. భగత్ సింగ్ అంటే ఒక వ్యక్తి కాదు. ఎంతోమంది భగత్‌సింగ్ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అలాంటి భగత్‌సింగ్‌ను అభిమానించే ప్రతిఒక్కరూ ఏ రంగంలో ఉన్నవారైనా భగత్‌సింగ్ చరిత్రను, ఆయన ఆలోచనలను వారి చుట్టూ ఉన్నవారితో చర్చ చేయాలి. ప్రధానంగా విద్యా సంస్థల్లో పని చేసే టీచర్స్ భగత్‌సింగ్ భావజాలాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలి. నిజమైన దేశభక్తుడు ఎలా ఉండాలో భగత్‌సింగ్‌ను చూసి నేర్చుకోవాలి. ఈమధ్య కాలంలో కొన్ని సినిమాల్లో ఆర్ఎస్ఎస్‌లో సభ్యుడు, కార్యకర్త అయితే దేశభక్తుడు అన్నట్టు చిత్రీకరించే పరిస్థితి వచ్చింది.

ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి ఏం చేసింది? స్వతంత్ర్యోద్యమంలో పాల్గొందా? పాల్గొనకపోగా బ్రిటిష్ వాళ్లకు తొత్తుగా మారిన ఆర్ఎస్ఎస్ దేశభక్తియుత సంస్థ ఎలా అవుతుంది? జాతిపితను చంపిన వారు దాని అనుబంధ సంస్థలు తామే ఈ దేశంలో నిజమైన దేశభక్తులమని ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాన్ని ఎలా ప్రతిఘటించాలి. దానికి ఏకైక మార్గం భగత్‌సింగ్ భావజాలాన్ని విస్తృతం చేయడమే. మనం ఉన్న కాలనీలో, అపార్ట్‌మెంట్స్‌లో ఎక్కడ వీలైతే అక్కడ, విద్యా సంస్థల్లో ప్రాథమిక స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు భగత్‌సింగ్ భావజాలాన్ని తీసుకెళ్లాలి. అలాగే పిల్లలున్న ప్రతి ఇంటిలో భగత్‌సింగ్ ఫొటో ఉండాలి. పిల్లలు భగత్ సింగ్‌ను చూస్తూ పెరగాలి. భగత్‌సింగ్ చైతన్యాన్ని, చిరుప్రాయంలో దేశంకోసం ప్రాణాలర్పించిన ఆ ధైర్యాన్ని పిల్లల్లో నింపాలి. అలాంటి వారు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ నుండి ఏ స్థాయి ఉద్యోగంలో ఉన్నా వారు ఈ దేశం కోసం బాధ్యతగా పనిచేస్తారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ లాంటి అమరవీరు ల చరిత్రను పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టి నిజమైన దేశభక్తులను దేశానికి అందించాలి. నేటి పాలకుల ప్రకారం దేశభక్తి అంటే పెద్ద నోట్ల రద్దు అయినప్పుడు డబ్బులకోసం గంటలకొద్దీ లైన్లలో నిలబడటం. స్వచ్ఛభారత్ అంటూ ఫొటోలకు చీపుర్లతో పోజులివ్వడం. థియేటర్లో సినిమాకు ముందు లేచి నిలబడటం. భారత్ మాతాకీ జై అనడం లాంటివి చేస్తేనే దేశభక్తి అనేలా వ్యవహరిస్తున్నారు. నిజమైన దేశభక్తి అంటే ఇదేనా? దేశభక్తికి అర్థమే మార్చింద్రు. దేశభక్తి అంటే ప్రదర్శించేది కాదు. ఆచరణలో ఈ దేశానికి ఏం చేస్తున్నామో చూపించాలి.

తమ వాదన బలంగా వినిపించలేక దాడులతో, హత్యలతో భయాందోళన సృష్టించి మేం చెప్పిందే అందరూ వినాలి, తినాలి అనే ధోరణి మతతత్వవాదుల్లో పెరిగిపోతున్నది. ఈమధ్య కాలంలో కొంతమంది మత ఛాందస వాదులు భగత్‌సింగ్‌కు మేమే వారసులమని చెప్పుకోవడం ముమ్మాటికి అవకాశవాదం. వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం. భగత్‌సింగ్‌కు దేవుని పట్ల, మతంపట్ల స్పష్టమైన అవగాహన ఉంది. "నేను నాస్తికుడిని ఎందుకు అయ్యాను. నాస్తికత్వం ఆత్మ విశ్వాసం పెంచేదే తప్ప అహంకారాన్ని కలించేది కాదు" అని ఒక పుస్తకమే రాశాడు భగత్‌సింగ్. అలాంటి భగత్‌సింగ్‌కు వీళ్లు ఎలా వారసులవుతారు? భగత్‌సింగ్ కేవలం స్వాతంత్ర్యం వరకే పరిమితం కాకుండా స్వాతంత్ర్యానంతరం భారతదేశం సోషలిస్టు దేశంగా ఏర్పడేందుకు ఎలా పోరాడాలో ఆలోచించేవారు. భగత్‌సింగ్ రచనలు, ఆయన రాసిన అనేక వ్యాసాలు పరిశీలిస్తే ఈ విషయం మనకు అర్థమవుతుంది. "ఏ సంఘటననైనా విశ్లేషించేటప్పుడు మనం ఎటువంటి దురాభిప్రాయానికి తావివ్వకుండా కేవలం ఆచరణ యోగ్యమైన పద్ధతినే అనుసరించాలి" అని తోటి విప్లవకారులకు చెప్పేవారు. అలాగే విప్లవకారుడు ఎలా ఉండాలి "ముందుగా వ్యక్తిగత మోహాలను, వ్యక్తిగత సుఖసంతోషాల స్వప్నాల్ని తుడిచేసి పనిచేయడం ప్రారంభించాలి. ఒక్కొక్క అంగుళం చొప్పున ముందుకు సాగండి. వేసే అడుగు దృఢంగా, స్థిరంగా వేయండి. కష్టాలు, అడ్డంకులు మిమ్మల్ని నిరుత్సాహపరచలేవు. విద్రోహులు మిమ్మల్ని అధైర్యపరచలేరు. మీలోని విప్లవచేవని నాశనం చేయలేవు. కష్టాల, త్యాగాల అగ్ని పరీక్షలో మీరు తప్పక విజయం సాధిస్తారు. విడివిడిగా సాధించే విజయాలే అంతిమంగా విప్లవానికి విలువైన సంపద అవుతాయి" అని భగత్‌సింగ్ ఉత్సాహ పరిచేవారు.

స్వాతంత్ర్య సమరానికి, విప్లవాత్మక మార్పుకి ఒక శక్తివంతమైన చిహ్నం భగత్‌సింగ్. భగత్‌సింగ్ సహచరుల జీవిత చరిత్రను భావిభారత పౌరులందరిలోకి తీసుకెళ్లాలి. ఐన్‌స్టీన్, న్యూటన్ నుండి నేటి స్టీఫెన్ హ్యాకింగ్ వరకు ఎంతోమంది శాస్త్రవేత్తలు సైన్స్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. మనదేశంలోని పాలకులు మాత్రం శాస్త్రవేత్తలు చేసిన గొప్ప ప్రయత్నాలను, వారి పరిశోధనల ఫలితాలను అపహాస్యం చేస్తున్నారు. మన దేశంలోని ప్రజలను, దేశాన్ని మూఢత్వంలోకి నెట్టి ప్రజల్లో చైతన్యం రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే ఇలా చేస్తున్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో మూఢత్వానికి, కుల, మతతత్వాలకు వ్యతిరేకంగా భిన్నమైన మతాలు, కులాలు, జాతులు ఎన్ని ఉన్నా మాది భారతదేశం, మేమంతా భారతీయులం అనే విధంగా కృషిచేయాలి. మూఢత్వం అనే మత్తు నుండి సైన్స్ అనే నిజంవైపు అడుగులు వేయిస్తూ భగత్‌సింగ్ భావజాలాన్ని విస్తృతం చేయడమే భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు మనం ఇచ్చే ఘన నివాళి.

సెల్ : 9542585226

మహిళల పట్ల ఎందుకీ వివక్ష?



మేకిరి దామోదర్

దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆడపిల్లలపై వివక్ష అనేక రూపాల్లో కొనసా గుతూనే ఉంది. మగపిల్లాడు మాత్రమే కావాలనే వితండ విధానాలతో లింగ వివక్ష పాటిస్తూ తల్లి గర్భంలోనే చంపేస్తున్నవారు కొందరైతే (విద్యావంతులే) మగపిల్లవాడిని కనేవరకు ఆడపిల్లలను కన్నవారు, వారికి సరియైన పౌష్టికాహారం అందివ్వక అనారోగ్యం పాలవుతున్న తల్లీ, పిల్లలను చూస్తుంటిమి. మగబిడ్డ మాత్రమే కావాలనే లింగ వివక్ష మూలంగా స్త్రీ పురుష నిష్పత్తిలో అసమానతల వల్ల 6.30 కోట్ల మంది మహిళలు గల్లంతయ్యారని తెలుస్తుంది. తల్లిదండ్రులు, పాలకులు, సమాజం, నవీన ధోరణులను అర్థం చేసుకొని అమ్మాయి పుట్టుక నుండే వివక్షకు తావులేకుండా ఆడపిల్ల ఉన్నతికి మనమందరం భరోసా ఇవ్వాల్సిన బాధ్యతను మరవరాదు. ప్రతి సంబంధం వ్యాపార సరుకుగా మారిన వేళ ఆడపిల్లంటే గుండెల మీద కుంపటి అనుకుంటు న్నారు. మగ పిల్లలను ఉన్నత చదువుకు పంపుతూ ఆడపిల్లను పని మనిషిలా చే(చూ)స్తూ, చిన్నచూపు, తిరస్కార ధోరణితోపాటు అభలని, అనామక అని ఈ సమాజం అనుసరిస్తుంది నిజం కాదా! ఏదో కొంత ఆర్థికంగా, సామాజికంగా ఎదిగిన కుటుంబాల్లో చదువు అందిస్తున్న పుటికీ, పెండ్లి తదనంతరం ఇంటి గడప దాటనివ్వకుండా స్వేచ్ఛను అణిచివేస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయి. జంతువులు కూడా ఇలాం టి వివక్షను చూపవని గమనిస్తున్నాం. మరి మనిషిలో ఎందుకు ఈ లిం గ వివక్ష, ఆడపిల్లల అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు. అందుకే మనిషి మారాలి, మనిషిగా బతకాలి, మహిళలను స్వేచ్ఛగా బతకనివ్వాలి.

ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో... అక్కడ విద్య, ధనం విరాజిల్లుతూ సకల సౌకర్యాలతో ఆదేశం ప్రజ్వరిల్లుతుందని నమ్మే భూమిలో మహిళలపై వేధింపులు, దాడులు, అత్యాచారాలు, వివక్ష తల్లి గర్భంలో ఆడపిల్ల అని తెలిసిననాడే భ్రూణ హత్యలతో దుర్మార్గానికి పూనుకుంటు న్నారు. ఆ తర్వాత కుటుంబంలో మగ పిల్లలకు ఉన్న స్వేచ్ఛ ఆడపిల్లలకు ఇవ్వడం లేదు (అక్షరాస్యులే). బడిలోని ప్రాథమిక చదువులో కూడా కార్పొరేటు వైపు మగ పిల్లలని పంపుతూ, ఆడపిల్లలని పేదవాళ్ల పని మనిషిగా, మధ్యతరగతి వారు సర్కారు బడితోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఆడపిల్ల ఇంట్లోంచి కాలు బయటపెడితే కట్టుబాట్లు, క్రమశిక్షణలు, అడ్డుగోడలతో కంచె వేస్తూ, ఆడపిల్ల స్వేచ్ఛ, హక్కును కాలరాస్తున్నది నిజం కాదా ! ఆడపిల్ల బరువు తీర్చుకోవాలని 18 ఏండ్లు నిండక ముందే వివాహాల పేరుతో అత్తవారింటికి పంపివేస్తున్నారు. ఆ తర్వాత అత్తవారి వేధింపులు, మగా(గ)డి పర్యవేక్షణలో స్వేచ్ఛ, హక్కుల ను ప్రశ్నించలేక, కక్కలేక, మింగలేక ఎక్కెక్కి ఏడుస్తూ స్వేచ్ఛా హక్కును చంపుకొని సర్దుకోక తప్పడం లేదు. ఆడపిల్ల పుట్టింది అవ్వ (అమ్మ) అవ్వ డానికి మాత్రమే అన్నట్టు నేటి ఆధునిక సమాజం సహితం భావిస్తున్న ది. అలనాటి గుహ జీవితం నుండి నేటి ఆధునిక ల్యాప్‌టాప్‌లు పట్టిన గృహిణి వరకు మహిళల బాధ్యతలు పెరుగుతూనే ఉన్నాయి. హక్కులు హరించబడుతూనే ఉన్నాయి. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలు, ఆచార వ్యవహారాల పేరుతో ఆడపిల్లలపై వివక్ష రాజ్యమేలుతుంది.

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ (ప్రాతినిధ్య) బిల్లు చట్టం కాకపోయే? బిల్లుకు అందరం మద్దతంటూ నీతులు చెబుతూ పాతాళంలో పాతిపెట్టడంలో పాలకులంతా "ఆ తానుముక్కలే" అన్నట్టు వ్యవహరించిరి. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించారు కానీ, చట్టసభల్లో మహిళా బిల్లుకు ముఖం చాటేశారు. స్థానిక సంస్థల పదవుల్లో పేర్లు మహిళలవి, పెత్తనం మగాళ్లది. "ఓ తల్లి కడుపులో పడ్డనాటి నుంచి తాను వివిధ దశలతోపాటు తను (చనిపోయే) కట్టెకాలేవరకు మహిళ నిలువునా తన ఒళ్లు గుల్ల చేసుకొని చేసే సేవకు, కష్టానికి శ్రమకు, త్యాగానికి ఈ సమాజం యావత్తు ఏమిచ్చినా తన రుణం తీర్చుకోలేరనే" నగ్న సత్యాన్ని అంగీకరిద్దాం... మహిళపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింసలు ఇలా అనేక రకాల ఇబ్బందుల నుండి రక్షణ పొందేందుకు నిర్భయలాంటి కఠిన చట్టాలకు కూడా వెరవకుండా మృగాలుగా వ్యవహరించడం చూస్తుంటే మానవ సమాజానికే సిగ్గుచేటుగా భావించక తప్పదు. ప్రపంచంలో లైంగిక హింస ఎదుర్కొంటున్న మహిళలు 35శాతం ఉన్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మనదేశంలో 79శాతం మహిళలు బాధితులేనని తేల్చింది. ప్రతి 26 నిమిషాలకో అసభ్యకర వేధింపులు, 34 నిమిషాలకో అత్యాచారం, 42 నిమిషాలకో లైంగిక వేధింపులు. 43 నిమిషాలకు అపహరణ, 93 నిమిషాలకో వరకట్న చావులు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ విధానాల మార్పును కోరుతూ చైతన్యవంతులై సమాజం, మహిళలు పల్లెనుండి ఢిల్లీ వరకు, పంచాయతీ కార్యాలయాల నుండి అత్యున్నత పార్లమెంట్ వరకు పాలనలో ప్రతిరంగంలో మహిళల హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలి. పదవుల్లో హోదాలో సామాజికంగా గుర్తింపు, గౌరవంతోపాటు మహిళా రిజర్వేషన్లు సాధించాలి. ప్రపంచంలోనే భారతదేశం స్త్రీని గౌరవించే దేశంగా మాటల్లో చెప్పడం కన్నా వారికి సమాన స్థాయిని కల్పించి ఈ దేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆదర్శంగా తీసుకొని, లింగవివక్ష లేని సుసంపన్న దేశంగా కీర్తించబడాలంటే మగాళ్ల(మన మ)ంతా మృగాళ్లలా కాకుండా మనసున్న మనుషులుగా మారుదాం... మానవత్వాన్ని చాటుదాం. మహిళలోని శక్తి సామర్థ్యాలకు చేయూతని ద్దాం... మహిళల మనుగడకు మనమంతా మంచి మనస్సుతో చేయూ తనిద్దాం ... దేశకీర్తిని దేదీప్యమానంగా వెలుగనిద్దాం... మహిళను ఎదగనిద్దాం...

సమాజంలోని సకల వివక్షలకు మూలం అవిద్య – అజ్ఞానమేనని, నాటి సంఘ సంస్కర్తలు రాజారామ్ మోహన్ రాయ్, పూలే దంపతులు, కందుకూరిల వరకు మహిళా వివక్షపై పోరాటాలు చేశారు. మహిళలు విద్యావంతులైతే సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపించడంలో గొప్పపాత్ర పోషిస్తారని పాలకులు గ్రహించి నినాదాలతో కాలం కరిగిపోనివ్వకుండా బాలిక విద్యకు, మహిళల హక్కుల పరిరక్షణకు పెద్దపీట వెయ్యాలి. 2011 జానాభా లెక్కల ప్రకారం బాలిక విద్య బాలురకంటే వెనకబాటను తెలియజేస్తుంది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో అతి స్వల్పంగా ఉందని తెలుస్తుంది. "మహిళా పురోగమనాన్ని చూసే నేను దేశ పురోగమనాన్ని అంచనా వేస్తాను" అన్నాడు డా॥అంబేద్కర్. మహిళా విద్యకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమాజంలో లింగ వివక్ష రూపుమాపడానికి, మూఢాచారాలను తొలిగించేలా ప్రజలను చైతన్య పరచాలి. కొడుకులు సంపద తెస్తారని, ఆడపిల్లలు ఇతరులకు సంపదని భావించే పద్ధతులు మారాలి. ప్రజా పాలనలో శాస్త్ర సాంకేతికరంగాలు అభివృద్ధి చెందాయని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ ప్రపంచానికి మనమే మేధస్సును అందించామని విర్రవీగుతున్న పాలకులు, లింగవివక్షలో వెనకబాటు తనాన్ని క్షేత్ర స్థాయిలో తెలుసుకొని నిర్మూలించే చర్యలకు పూనుకోవడం లేదు.

వివక్ష నివారణ చర్యలు

- భ్రూణ హత్యలను ఆపాలి. లింగనిర్ధారణ పరీక్షలను వెల్లడించరాదు. మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, అత్యాచారాలు, అవిద్య లాంటివి రూపుమాపేలా శాస్త్రీయ, అభ్యుదయ భావజాలాలను పెంచాలి.
- బాలికల విద్యకు ప్రత్యేక పాఠశాలలు, నిధులు, వసతుల కల్పనకు పూనుకోవాలి. బాలికలకు కేజీ నుండి పీజీ వరకు చదువును ప్రభుత్వమే చెప్పించాలి. ఆ తర్వాతనే వివాహాలు జరిపేలా చర్యలు చేపట్టాలి. మహిళా సాధికారత, అభివృద్ధి, భద్రత, రక్షణ, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. పెండ్లి పేరిట మహిళలు మోసపోకుండా వివాహాల నమోదు తప్పనిసరి చేయాలి.
- మహిళల సారధ్యంలోనే అందరికీ సౌభాగ్యం అని నిరూపించే అవకాశం పాలకులు కల్పించాలి. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల సాధికారతకు పాలకులు నిధులను, ఉద్యోగాలను వ్యాపారాల్లో ప్రోత్సహించాలి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం వంటి రంగాల్లో మహిళ మరింత ప్రగతి సాధించేలా చర్యలు చేపట్టాలి.
- సామాజిక స్పృహ, మానవత్వం, శాస్త్రీయ స్పృహ, సమభావంతో అన్ని స్థాయిల్లో పంచాయతీ నుండి పార్లమెంటు వరకు రాజకీయ, అధికారాల్లో రిజర్వేషన్లు కల్పించాలి. సామాజిక మాధ్యమాలు లింగవివక్షను చూపడాన్ని మానాలి. మహిళను విలాస(భోగ) వస్తువుగా చూపడాన్ని ఆపాలి.

సెల్: 9573666650

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

నవచిత్రం

ఆశయం కోసం పంతం


గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'పంతం'. 'ఫర్ ఏ కాజ్' అనేది ట్యాగ్‌లైన్. 'బలుపు', 'పవర్', 'జైలవకుశ' వంటి చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించిన కె.చక్రవరి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. గోపీచంద్‌కిది 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ బుధవారం విడుదలైంది. నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో గోపీచంద్ 25వ చిత్రాన్ని నిర్మించడం హ్యాపీగా ఉంది. అనుకున్న ప్లాన్ ప్రకారం సినిమాలో 60శాతం చిత్రీకరణ పూర్తి చేశాం. మంచి సందేశంతోపాటు కమర్షియల్ హంగులతో సినిమాను దర్శకుడు చక్రి అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. గోపీచంద్ క్యారెక్టరైజేషన్ శక్తివంతంగా ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు కనిపించని స్టయిలీష్ లుక్‌లో గోపీచంద్ కనిపిస్తారు. మెహరీన్ కథానాయికగా మంచి పాత్రలో మెప్పిస్తుంది. గోపీసుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద అసెట్. అనుకున్న విధంగా సినిమాను పూర్తి చేసి వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: ఎ.ఎస్.ప్రకాష్, సంగీతం: గోపీసుందర్.


మహి వి రాఘవ్, మమ్ముట్టి

వైఎస్ఆర్ యాత్రలో మమ్ముట్టి

తెలుగులో బయోపిక్‌ల జోరు ఊపందుకుంటుంది. ఇప్పటికే సావిత్రి, ఎన్టీఆర్ బయోపిక్‌లు తెరకెక్కుతుండగా, తాజాగా మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితాన్ని తెరపైకి ఎక్కించేందుకు 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి రాఘవ్ ప్లాన్ చేస్తున్న విషయం విదితమే. వైఎస్ పాత్రలో మమ్ముట్టి నటిస్తున్న ఈ చిత్రాన్ని 'యాత్ర' పేరుతో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ, "ఆనందో బ్రహ్మ'తో మా సంస్థకు ద్వితీయ విజయాన్ని అందించిన మహి వి రాఘవ్ దర్శకత్వంలో మరో సినిమాను నిర్మించడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా కోసం మహి రెడీ చేసిన లైన్ నచ్చడంతో సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించడానికి ఒప్పుకోవడం చాలా ఆనందంగా ఉంది. రెండు రాష్ట్రాల ప్రజలు ఆదరించే నాయకుడు, ఎమోషన్‌ల్‌గా ప్రజలకు దగ్గరైన వ్యక్తి వైఎస్. ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఎమోషనల్ కంటెంట్‌గా ఈ సినిమాను నిర్మిస్తున్నాం. త్వరలోనే ఈ బయోపిక్‌కి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తాం' అని తెలిపారు.

కన్నడ రీమేక్‌లో..


బాలకృష్ణ

బాలకృష్ణ ఇటీవల సినిమాల విషయంలో దూకుడు పెంచాడు. గతేడాది రెండు సినిమాలు 'గౌతమి పుత్ర శాతకర్ణి', 'పైసా వసూల్'తో ఆకట్టుకున్న ఆయన ఈ ఏడాది 'జై సింహా'తో మెప్పించారు. ప్రస్తుతం 'ఎన్టీఆర్' బయోపిక్‌లో నటించబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. 'ఎన్టీఆర్' సినిమా తర్వాత రీమేక్ చిత్రంలో నటించేందుకు బాలకృష్ణ ఆసక్తిగా ఉన్నారట. కన్నడలో శివరాజ్ కుమార్ నటించిన విజయవంతమైన సినిమా 'మఫ్టీ'. ఇటీవలే సినిమాను చూసి ఇంప్రెస్ అయిన బాలకృష్ణ తన నెక్ట్స్ చిత్రంగా ఈ సినిమాను రీమేక్ చేయాలని భావిస్తున్నారట. శివరాజ్ కుమార్, శ్రీ మురళీ, శాన్వీలు ప్రధాన పాత్రధారులుగా యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'మఫ్టీ' చిత్రం కన్నడలో పెద్ద హిట్ అయ్యింది. బాలకృష్ణ నటించిన 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో శివరాజ్ కుమార్ అతిథి పాత్రలో కనిపించిన విషయం విదితమే. ఆ పరిచయంతోనే ఇటీవల ఆ సినిమాను బాలకృష్ణ తిలకించినట్టు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. మరి రీమేక్‌కు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ముందు తెలియనుంది. బాలకృష్ణ ప్రస్తుతం నటించబోయే 'ఎన్టీఆర్' చిత్రానికి తేజ దర్శకత్వం వహిస్తున్నారు.


కత్రీనా కైఫ్

భారీ డాన్స్ చిత్రం..!

బాలీవుడ్‌లో డాన్స్ నేపథ్య చిత్రాలకు దర్శకుడు రెమో డి సౌజా కేరాఫ్. కొరియోగ్రాఫర్ అయిన రెమో దర్శకుడిగా మారిన విషయం విదితమే. డాన్స్ నేపథ్యంతో 'ఎబిసిడి', 'ఎబిసిడి 2' చిత్రాలతో దర్శకుడిగా తానేంటో నిరూపించుకున్నారు. తాజాగా మరో భారీ డాన్స్ నేపథ్య చిత్రాన్ని రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో వరుణ్ ధావన్, కత్రీనా కైఫ్ జంటగా నటించనున్నారు. ఈ ఇద్దరు తనదైన డాన్స్ విలక్షణతో మెస్మరైజ్ చేయడం ఖాయమని నిర్మాత భూషణ్ కుమార్ భావిస్తున్నారు. ఈ చిత్రం గురించి కత్రీనా కైఫ్ చెబుతూ, 'రెమో విజన్‌లో మేం భాగం కావడం ఎగ్జైటింగ్‌గా ఉంది. వరుణ్ ప్యాషన్ అద్భుతం. ఎలాంటి అలుపు లేకుండా వెండితెరపై మ్యాజిక్ చేయడంలో వరుణ్ దిట్ట. ఈ చిత్రంలో నటించేందుకు ఆతృతగా వెయిట్ చేస్తున్నాం' అని తెలిపింది. వరుణ్ ధావన్ మాట్లాడుతూ, 'ఇండియాలోనే అతిపెద్ద డాన్స్ నేపథ్య చిత్రంలో భాగం కావడం, రెమో డి సౌజా వంటి దర్శకుడితో పనిచేయడం పెద్ద అఛీవ్‌మెంట్‌గా భావిస్తున్నా. న్యూయార్క్‌లో ఓ సారి కత్రీనాతో కలిసి ఓ ప్రదర్శన ఇచ్చాం. తిరిగి మళ్ళీ కలిసి నటించడం హ్యాపీగా ఉంది. కత్రీనా అద్భుతమైన డాన్సర్' అని అన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమాను ప్రారంభించి వచ్చే ఏడాది నవంబర్ 8న విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తుంది. కత్రీనా ప్రస్తుతం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', 'జీరో'లో, వరుణ్ ధావన్.. 'అక్టోబర్', 'నవాబ్‌జాదే', 'సూయి దాగా' చిత్రాల్లో నటిస్తున్నారు.


భూమిక

యూటర్న్‌లో కీలకపాత్ర...!

ఇటీవల 'ఎంసిఏ' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన భూమిక తాజాగా రీమేక్ చిత్రంలో నటించబోతుందట. కన్నడలో విజయం సాధించిన 'యూ టర్న్' చిత్రాన్ని తెలుగు, తమిళంలో రీమేక్ చేస్తున్నారు. సమంత ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఇందులో కీలక పాత్ర కోసం భూమికను ఎంపిక చేశారట. పవన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు తెలుగు, తమిళంలో కూడా 'యూ టర్న్' అనే టైటిల్‌నే ఫిక్స్ చేశారట. నికేత్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న ఈ చిత్రం రెగ్యుల్ షూటింగ్ ఇటీవల ఏపీలో ప్రారంభమైంది. భూమిక ప్రస్తుతం హిందీలో 'ఖామోషి', తెలుగులో 'సవ్యసాచి' చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తుంది.

ఇప్పుడు నా వంతు!


పూజా హెగ్డే

"బాహుబలి'తో ప్రభాస్ తానేంటో నిరూపించుకున్నారు. ఇక ఇప్పుడు నేను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది' అని అంటోంది పూజా హెగ్డే. ఇటీవల భారీ ఆఫర్స్‌ను దక్కించుకుంటూ దూసుకుపోతున్న కథానాయిక ఎవరైనా ఉన్నారంటే అది పూజానే. ఎన్టీఆర్, మహేష్‌బాబు, ప్రభాస్ వంటి స్టార్ హీరోల సరసన కథానాయికగా నటించే ఛాన్స్‌లను ఒకేసారి అందుకుంది. దీంతో ఒక్కసారిగా స్టార్ రేంజ్ హీరోయిన్‌గా మారిపోయింది. ఈ నేపథ్యంలో పూజా హెగ్డే ప్రభాస్ గురించి స్పందిస్తూ, 'బాహుబలి'తో వరల్డ్ వైడ్‌గా ప్రశంసలందుకున్న ప్రభాస్‌తో నటించే ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదొక గొప్ప అవకాశం. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రభాస్‌తో కలిసి నటించే చిత్రం ఉండబోతుంది. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు ఆతృతగా వెయిట్ చేస్తున్నా. 'బాహుబలి'తో ప్రభాస్ నిరూపించుకున్నారు. ఇప్పుడు నా వంతు వచ్చింది' అని తెలిపింది. 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ నెక్ట్స్ ఓ సినిమా చేయనున్నారు. గోపీకృష్ణ మూవీస్ పతాకంపై కృష్ణంరాజు నిర్మించే ఈ చిత్రంలో ప్రభాస్ సరసన పూజా హెగ్డే కథానాయికగా ఎంపికైన విషయం విదితమే. ఈ సినిమా జూలైలో ప్రారంభం కానుంది.


రవికిషన్, కళ్యాణ్ రామ్, కాజల్, అల్లరి నరేష్, కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి, టి.జి.విశ్వప్రసాద్, ఉపేంద్ర మాధవ్

నా హృదయానికి దగ్గరైన చిత్రం ఎంఎల్ఏ

- ప్రీ రిలీజ్ వేడుకలో కళ్యాణ్‌రామ్

'నా హృదయానికి దగ్గరైన చిత్రం 'ఎంఎల్ఏ'. ఇందులో కొత్త కళ్యాణ్ రామ్‌ని చూస్తారు' అని కళ్యాణ్ రామ్ అన్నారు. నందమూరి కళ్యాణ్ రామ్, కాజల్ జంటగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎంఎల్ఏ'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ, 'కథను నమ్మి సినిమాలు తీసే నిర్మాతలంటే నాకిష్టం. ఈ చిత్రనిర్మాతలు అలాంటి వారు. తప్పకుండా భవిష్యత్‌లో పెద్ద నిర్మాతలు అవుతారు. 'పటాస్' కథ విన్నప్పుడు ఎంత ఎగ్జైట్ అయ్యానో, ఈ సినిమాకు కూడా అంతే ఎగ్జైట్ అయ్యాను. ఉపేంద్ర కళ్లకు కట్టినట్టు నెరేషన్ ఇచ్చాడు. సినిమాలో నన్నుకొత్తగా చూపించాడు. కొత్త దర్శకుడిని గైడ్ చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌ది భార్యభర్తల సంబంధం. నేను పనిచేసిన కెమెరామెన్స్‌లో ప్రసాద్ మూరెళ్ల ది బెస్ట్. రవికిషన్ నాకు దేవుడిచ్చిన అన్నయ్య. ఆయన బోజ్‌పూరిలో సూపర్‌స్టార్. అలాంటి ఓ వ్యక్తి మన ఇండస్ట్రీలో నెగటివ్ పాత్రలు పోషించడం గొప్ప విషయం. 500సినిమాలు చేసిన రవికిషన్ ఇంకా ఏదో నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఆయన్ను చూసి ఎన్‌స్పైర్ అయ్యాను. కాజల్‌తో నాకు రెండో సినిమా. నేను 14 సినిమాలు చేస్తే, తను 50 సినిమాలు చేసింది. అందుకు కారణం తన డెడికేషన్. మరో 50 సినిమాలు చేయాలని కోరకుంటున్నా. ఈ సినిమాలో కొత్త కళ్యాణ్‌రామ్‌ను చూస్తారు. సినిమాను చూసిన వారు బోర్‌గా ఫీలవ్వరు. ప్రతి ఒక్కరి కష్టం తెరపై కనిపిస్తుంది. తప్పకుండా ప్రేక్షకులందరికీ నచ్చుతుంది' అని అన్నారు. 'రియల్ లైఫ్‌లో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఎమ్మెల్యే అవడం ఎంత కష్టమో నాకు తెలియదు, కానీ డైరెక్టర్ అవడం ఎంత కష్టమో తెలుసు. ఉపేంద్ర నా వద్ద చాలా సంవత్సరాలు పనిచేశాడు. తను ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. అతని కలను నిజం చేసిన కళ్యాణ్‌రామ్‌కు థ్యాంక్స్ సినిమా పెద్ద హిట్ కావాలి' అని శ్రీనువైట్ల తెలిపారు.


అల్లరి నరేష్ చెబుతూ, 'దర్శకుడు ఉపేంద్ర మంచి వ్యక్తి. మణిశర్మ పాటలు బాగున్నాయి. కళ్యాణ్‌కిది పెద్ద బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'నేను, ఉపేంద్ర కలిసి పనిచేశాం. మంచి టైమింగ్ ఉన్న డైరెక్టర్. మంచి సినిమాను, మంచి హీరో, మంచి టీమ్‌తో చేయడం సులభం కాదు. సినిమాను వెనకుండి నడిపిస్తున్న వివేక్‌కు థ్యాంక్స్. కాజల్ మరిన్ని మంచి సినిమాల్లో నటించాలి. మంచి లక్షణాలున్న అబ్బాయికి మంచి ఉదాహరణ కళ్యాణ్ రామ్. ఆయన భవిష్యత్‌లో గొప్ప సినిమాలు చేయాలి. 'పటాస్' తర్వాత అదే ఎనర్జీ ఈ చిత్రంలో కనిపిస్తుంది. కచ్చితంగా హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అని వంశీపైడిపల్లి తెలిపారు. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ చెబుతూ,'ముందుగా కళ్యాణ్‌రామ్‌కు థ్యాంక్స్. ఆయన దర్శకుల హీరో. కథ చెప్పగానే ఓకే చేశారు. దర్శకుడిగా నాకు స్వేచ్ఛ ఇచ్చారు.ఏమీ తినకుండా 16 గంటలపాటు ఉండేవారు. సినిమాటోగ్రాఫర్ ప్రసాద్ మూరెళ్ల ఎంతో సపోర్ట్ చేశారు. మణిశర్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. పాటలు ఎంత బాగా చేశారో, రీరికార్డింగ్ కూడా అంతే బాగా చేశారు. టెక్నీషియన్లందరికీ కృతజ్ఞతలు' అని అన్నారు. 'పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. కళ్యాణ్ రామ్‌తో పనిచేయడం హ్యాపీగా ఉంది. ఈ నెల 23న విడుదల కానున్న ఈ సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజల్, సురేష్‌బాబు, జెమినీకిరణ్, పోసాని, భీమనేనిశ్రీనివాస్‌రావు, వి.ఎన్.ఆదిత్య, రవికిషన్, బ్రహ్మానందం, ఎం.ఎల్.కుమార్ చౌదరి, వివేక్, ఎన్.శంకర్, కోన వెంకట్, రామజోగయ్య శాస్త్రి, పృథ్వీ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

ప్రయత్నం ఫలించింది


'కర్తవ్యం'లో నయనతార


నయనతార ప్రధాన పాత్రలో తమిళంలో రూపొంది ఘన విజయం సాధించిన 'ఆరమ్' చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో నిర్మాత శరత్ మరార్ విడుదల చేశారు. ఇటీవల విడుదలైన సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్న నేపథ్యంలో నిర్మాత శరత్ మరార్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, 'మా నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై పవన్ కళ్యాణ్‌తో మంచి సినిమాలు చేశా. ఆ తర్వాత మెడికల్ మాఫియా గురించి ప్రజలందరికి తెలిసేలా 'అదిరింది' సినిమాను అందించాం. దానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'కర్తవ్యం' సినిమాను చూసిన ప్రతి ఒక్కరి గుండె తడుస్తుంది. మీడియాలో, సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇలాంటి మంచి చిత్రాన్ని చూసినప్పుడు నా మనసు చలించిపోయింది. దర్శకుడి ప్రతిభ, నయనతార, ఇతర నటీనటుల నటన నన్ను కట్టిపడేసింది. జిబ్రాన్ మ్యూజిక్ భావోద్వేగంలో ముంచేసింది. ఈ సినిమా ఒక రోజంతా నన్ను వెంటాడింది. అసలు గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఇంత అవస్థ పడాలా అనే ప్రశ్న నాలో నేను వేసుకున్నాను. డబ్బుల కోసం కాకుండా, మనుషుల కోసం కొన్ని చిత్రాలుంటాయని గట్టిగా నమ్మి ఈ సినిమాను మా బ్యానర్‌లో తెలుగు ఆడియెన్స్‌కు చూపించాలనుకున్నా. ఈ ప్రయత్నానికి మీడియా బాగా సపోర్ట్ చేసింది. ఇలాంటి సందేశాత్మక చిత్రాన్ని తెలుగులో తీసుకొచ్చినందుకు నాకు ధన్యవాదాలు చెబుతుంటే నా కంట ఆనందభాష్పాలు వచ్చాయి. ఈ సినిమా మా బ్యానర్ వ్యాల్యూని రెట్టింపు చేసింది. ఇలాంటి మంచి సినిమాలు తెలుగు ప్రేక్షకుడికి అందించేందుకు నేనెప్పుడూ సిద్ధంగా ఉంటా' అని చెప్పారు

మహాభారతం కోసం


అమీర్‌ఖాన్

దక్షిణాదిలో ఫిల్మ్ మేకర్స్ అందరి చూపు ఇప్పుడు 'మహాభారతం'పై పడింది. తెలుగులో రాజమౌళి, మలయాళంలో సుకుమారన్, హిందీలో అమీర్‌ఖాన్ మహాభారతంపై సినిమాలు తీసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. హిందీలో మహాభారతాన్ని తెరకెక్కించాలనేది తన డ్రీమ్ అని అమీర్ ఖాన్ పలు సందర్భాల్లో తెలిపారు. ఈ చిత్రాన్ని తీయడానికి దాదాపు 20 సంవత్సరాలు పట్టే ఛాన్స్ ఉందన్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌లో కాస్త పురోగతి కనిపిస్తుంది. చిత్ర నిర్మాణంలో రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీ భాగం కాబోతున్నారట. దాదాపు వెయ్యి కోట్లతో ఈ సినిమాను నిర్మించాలని వారు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. అంతేకాదు వివిధ దర్శకులచేత నాలుగైదు పార్ట్‌లుగా సినిమా చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ రచయితల చేత కథ రాయిస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే మలయాళంలో వాసుదేవన్ నాయర్ రచించిన 'రాందమూళం' అనే నవల ఆధారంగా మహాభారతాన్ని తెరకెక్కించబోతున్నారు. మోహన్‌లాల్ భీముడి పాత్రలో నటిస్తున్నారు. కర్ణుడి పాత్ర కోసం నాగార్జునను సంప్రదించారు. సుకుమారన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో ప్రారంభించి 2020లో విడుదల చేయనున్నారు. మలయాళంతోపాటు తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

బృందావనమది అందరిది సాంపిల్ టీజర్


'బృందావనమది అందరిది'లో రిచా పణయ్

రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'బృందావనమది అందరిది'. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రిచా పణయ్, హర్షవర్ధన్, లగడపాటి విక్రమ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా సాంపిల్ టీజర్ వీడియోను విడుదల చేశారు. దర్శకుడు శ్రీధర్ సీపాన మాట్లాడుతూ, 'వైజాగ్ సాగర తీరంలో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. అవుట్‌పుట్ బాగా వచ్చింది. చిత్ర ఫస్ట్ షెడ్యూల్ మేకింగ్, సాంపిల్ వీడియో టీజర్‌ను ఉగాది సందర్భంగా విడుదల చేశాం. దానికి మంచి స్పందన లభిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. నెక్ట్స్ షెడ్యూల్ ఏప్రిల్ 1 నుంచి బెంగుళూరులో, ఆ తర్వాత హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నాం' అని అన్నారు.

రొమాంటిక్ కామెడీ రాజరథం


రామ్‌కుమార్, నిరూప్ భండారి, అవంతిక శెట్టి, సతీష్ శాస్త్రి

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ నెల 23న సినిమా విడుదల కానున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత సతీష్ శాస్త్రి మాట్లాడుతూ, 'గతంలో మేం యూఎస్‌లో డిస్ట్రిబ్యూట్ చేసి ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాం. ఈ సినిమాను మేకింగ్ పరంగా రాజీపడకుండా నిర్మించాం. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అజనీష్ లోక్‌నాథ్ మంచి నేపథ్య సంగీతాన్ని అందించారు. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. "రంగితరంగి' చిత్రంతో నిరూపించుకున్న దర్శకుడు నిరూప్ భండారి హీరోగా ఈ చిత్రాన్ని రూపొందించడం ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాలను ఆదరిస్తే మరిన్ని కొత్త కాన్సెప్ట్ చిత్రాలొస్తాయి. పాటలకు మంచి స్పందన లభించింది' అని రామ్ కుమార్ తెలిపారు.

హీరో నిరూప్ భండారి చెబుతూ, 'సినిమా కోసం తెలుగు నేర్చుకున్నా. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇందులో నేను అభి అనే మెకానికల్ ఇంజనీర్ విద్యార్థిగా కనిపిస్తా. అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన రానాకు థ్యాంక్స్. ఆర్య ముఖ్య పాత్రలో నటించారు. సినిమా తెలుగు ఆడియెన్స్‌ను కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్ముతున్నాం' అని చెప్పారు. 'ఒక మంచి సినిమాకుండాల్సిన అన్ని క్వాలిటీస్ ఇందులో ఉన్నాయి' అని హీరోయిన్ తెలిపింది.

ఎస్పీఎం పునరుద్ధరణకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

- పదేండ్లపాటు రాయితీలు
- జేకే కంపెనీకి అనుకూలంగా జీవో నెం.18 జారీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు పేపర్ మిల్లు పునరుద్ధరణలో కీలక ముందడుగు పడింది. మిల్లు పునరుద్ధరణకు ముందుకు వచ్చిన జేకే కంపెనీ(ఒడిస్సా)కి పదేండ్లపాటు అనేక రాయితీలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ బుధవారం జీవో ఎంఎస్ నెం.18 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మిల్లును షట్‌డౌన్ పేరిట పాత యాజమాన్యం 2014 సెప్టెంబర్ 27న మూసేసిన విషయం విదితమే. అప్పటి నుంచి మిల్లు పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది.మిల్లు నుంచి డబ్బులు రావాల్సిన బకాయిదారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం, ట్రిబ్యునల్ ఐఆర్‌పీని నియమించడంతో ఐఆర్‌పీ ఆధ్వర్యంలో మిల్లు పునరుద్ధరణ చర్యలు కొన్ని నెలలుగా కొనసాగుతున్నాయి. ఎస్పీఎంను తీసుకోవాలనే ఉద్దేశంతో తొమ్మిది కంపెనీలు ముందుకొచ్చి మిల్లును పరిశీలించాయి. వాటిలో జేకే కంపెనీ మాత్రమే టెండర్ ప్రక్రియలో పాల్గొంది. మిల్లు పునరుద్ధరణకు తాము సిద్ధంగా ఉన్నట్టు ఆ కంపెనీ ప్రతినిధులు అంగీకారం తెలిపారు.

రూ.628 కోట్ల నికర పెట్టుబడితో జేకే పేపర్ మిల్లు ముందుకు వచ్చిందని జీవోలో పేర్కొన్నారు. పది వేల మంది కార్మిక కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పలు రాయితీలు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ రాయితీలపై మార్చి 2న జరిగిన మంత్రిమండలి సబ్ కమిటీ ఆమోదం తెలుపగా, ఈ నెల14న మంత్రిమండలి సమావేశం కూడా ఆమోదం తెలిపింది. ఈ మేరకు పలు అంశాలలో పదేండ్ల పాటు జేకే కంపెనీకి పలు రాయితీలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

జేకే కంపెనీకి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు

- పదేండ్లపాటు వంద శాతం ఎస్‌జీఎస్‌టీ మినహాయింపు
- వంద శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు
- పెట్టుబడి మీద 20 శాతం సబ్సిడీ (రూ.50 కోట్లకు మించకుండా)
- ముడిసరుకు అయిన యూకలిప్టస్, సుబాబుల్‌ను పదేండ్లపాటు ప్రభుత్వ నర్సరీతో పాటు మార్కెట్ నుంచి కూడా సబ్సిడీపై ఇచ్చేందుకు అంగీకారం
- పేపర్ ఉత్పత్తిలో ముడిసరుకు అయిన బొగ్గు కోసం సింగరేణి కాలరీస్ నిర్వహించే వేలం పాటలో పాల్గొనే అవకాశం
- సబ్సిడీపై పదేండ్లపాటు బొగ్గు సరఫరా
- బీళ్లుగా ఉన్న అటవీ భూముల్లో ముడిసరుకు అయిన సుబాబుల్, యుకలిప్టస్ చెట్లను పెంచేందుకు ప్రాధాన్యత
- పరిశ్రమలో ఉత్పత్తి అయిన కాపీయర్, మ్యాప్‌లితో పేపర్‌ను తెలంగాణ ప్రభుత్వమే మార్కెట్ రేటుకు కొనుగోలు చేసేందుకు అంగీకారం
- పదేండ్లపాటు ఎలక్ట్రిసిటి డ్యూటీ మినహాయింపు
- మూడేండ్ల పాటు రూ.3కే యూనిట్ చొప్పున విద్యుత్ సరఫరా
- లిక్విడేషన్ వాల్యూ ప్రకారం కార్మికుల వేతన పాత బకాయిలను ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకారం.

కేసీఆర్ కన్నెర్ర

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. దేశ రాజకీయ వ్యవస్థ మారాల్సిన అవసరం ఉందన్నారు.

ధనిక రాష్ట్రంగా తెలంగాణ

తెలంగాణ కచ్చితంగా ధనిక రాష్ట్రమేనని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర రెవెన్యూలో 22 శాతం అభివద్ధిని సాధించామని తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు బడ్జెట్‌ను విశ్లేషణాత్మకంగా అవగాహన చేసుకునే మాట్లాడే పరిణితి రావాలన్నారు. 'బడ్జెట్ చప్పగా ఉంది. అంకెల గారడీ' అనడం సరికాదన్నారు. బడ్జెట్‌పై పూర్తి అవగాహనతో సభ్యులు మాట్లాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తుందని మాట్లా డటం హాస్యాస్పదమని..బడ్జెట్ ప్రవేశపెట్టగానే విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర జీడీపీలో 21 శాతం మాత్రమే అప్పులు అన్నాయని తెలిపారు. అమెరికా, జపాన్ అప్పుల్లో ఉన్నా ప్రపంచాన్ని శాసిస్తున్నాయని చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెట్టగానే విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 నుంచి 2014 మధ్య కాలంలో 23 జిల్లాలకు ఖర్చు పెట్టింది రూ. ఒక లక్ష 29 వేల కోట్లు మాత్రమేనని, అదే తెలంగాణలో ఈ నాలు గేండ్లలో ఖర్చు చేసింది రూ. ఒక లక్షా 24 వేల కోట్లు అని చెప్పారు. తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉంటదని ఉద్యమ సమయంలో చెప్పామని, అదే జరుగుతున్నదని అన్నారు. . ఈ సంవత్సరం దేశంలో ఏ రాష్ట్రానికి రానన్ని అవార్డులు తెలంగాణకు వచ్చాయన్నారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రం అని సీఎం కేసీఆర్ చెప్పారు. రాష్ట్ర అభివద్ధికి ఖర్చు చేస్తే తప్పుబట్టడం సరికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే పనులు పూర్తి అవుతాయి. అనేక రంగాల్లో మంచి పనులు జరుగు తున్నాయి. మంచి పనులు చేసినప్పుడు అభినందించండి. తప్పులు చేస్తే నిర్మాణాత్మకంగా విమర్శ చేయండి అని సూచించారు. ఏ రాష్ట్రంలో నిధులు ఉంటే ఆ రాష్ట్రంలో ప్రగతి సాధ్యమవుతుందని సీఎం అన్నారు. వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటేనే అభివద్ధి సాధించగలమని చెప్పారు. రాష్ట్రానికి పాజిటివ్ గ్రోత్ ఇండికేటర్ ఉందని సీఎం చెప్పారు.

ఏప్రిల్‌లో కొత్త రేషన్ కార్డులు : మంత్రి ఈటల

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 75 వేల దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించామన్నారు. ఈపాస్ ద్వారా అవినీతి తగ్గిందన్నారు. రేషన్ పోర్టబులిటీ పెట్టడం వల్ల గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు వలసపోయిన కూడా అక్కడే రేషన్ తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈపాస్ మిషన్లు సిగ్నల్స్ లేకపోవడంతో వేలిముద్రలు పడటం లేదని, త్వరలోనే ఐరిస్ ద్వారా రేషన్ ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. రేషన్ సరుకులు తగ్గించిన మాట వాస్తవమేనన్నారు.

గత ప్రభుత్వం తొమ్మిది సరుకులిచ్చినా బియ్యం, చక్కర, కందిపప్పు, ఉప్పుకు మాత్రమే అదరణ ఉండేదన్నారు. గ్యాస్ కనెక్షన్లు పెరగడంతో కిరోసిన్ వాడకం తగ్గిపోయిందన్నారు. భవిష్యతులో దీపం పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తామన్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్లో అదే ధరకు అందుబాటులో ఉందని, అందుకే వినియోగదారులు రేషన్‌షాపుల్లో కొనడం లేదన్నారు.

'మహా'గతి తేవొద్దు

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో జరగలేదన్నారు. వీలైనంత త్వరగా రుణమాఫీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

గిట్టుబాటు ధరపై కేంద్రంపై రాష్ట్రం.. రాష్ట్రంపై కేంద్రం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు అడుతున్నాయని విమర్శించారు. గిట్టుబాటు ధరపై నిలదీస్తే కేంద్రంపై రాష్ట్రం.. రాష్ట్రంపై కేంద్రం విమర్శలు చేసుకుంటున్నాయే తప్ప ఒక నిర్ణయానికి రావడం లేదన్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పులపాలవుతున్నారని చెప్పారు. జాతీయ బ్యాంకుల రంగ ప్రవేశంతో సహకార సంస్థలు బలహీనమయ్యాయని తెలిపారు. జాతీయ బ్యాంకులు రైతులకు రుణాలు అందించడం లేదన్నారు. రైతులను ఆదుకోవడానికి సహకార వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. అలాగే వ్యవసాయం, పశుసంవర్ధ శాఖలో ఉన్న ఖాళీలను వెంటనే బర్తీ చేయాలని తెలిపారు.

రెండో పంటగా గొర్రెల పంపిణీ చేపట్టాలి

గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని గిరిజనులకు కూడా వర్తింపచేయాలనీ సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పంటలకు పెట్టుబడి కూడా రావడం లేదని, రెండో పంట కింద గిరిజనులకు గొర్రెల పంపిణీ చేయాలని కోరారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపర్చండి

ఏజెన్సీ, గూడేల్లో ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలని సున్నం రాజయ్య విజ్ఞప్తి చేశారు. తండాలు, గూడేల్లో రేషన్ షాపులను ఏర్పాటు చేయకపోవడం వల్ల రేషన్ సరుకులు తీసుకోవడానికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెండు గూడేలను కలిపి ఒక రేషన్ షాపును ఏర్పాటు చేయాలని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఉన్న ఇచ్చిన రేషన్ కార్డులే ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని, వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలన్నారు. గిరిజన సహకార సంస్థలో కారుణ్య నియామకాలను చేపట్టాలని వెల్లడించారు.

మనం బాగుంటే..

న్యూఢిల్లీ : దేశంలో అనేక నగరాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. ముఖ్యంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. నగరంలో పాఠశాలల్ని 5రోజులపాటు మూసేశారు. పిల్లలు స్కూల్స్‌కు వెళ్లలేని పరిస్థితి మొన్నటి శీతాకాలంలో ఏర్పడింది. కొద్దికాలంపాటు ప్యూరిఫైర్లను ఏర్పాటుచేసి..పిల్లలకు ఇబ్బంది లేకుండా చేద్దామని ఏ ఒక్క ప్రభుత్వ శాఖా ఆలోచించలేదు. కానీ, కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు, ప్రధాని మోడీ కార్యాలయం, మంత్రుల కోసం రూ.36 లక్షలు ఖర్చుపెట్టి 'ఎయిర్ ప్యూరిఫైర్లు' కొనుగోలు చేశాయి. దేశ ప్రజల్ని బాధిస్తున్న అతి ముఖ్యమైన సమస్యపట్ల పాలకులు చూపిన శ్రద్ధ ఇలా ఉందని 'రాయటర్స్' ప్రత్యేక కథనం రాసింది.బ్రిటీష్ మెడికల్ జర్నల్ 'ద లాన్సెట్' 2016 నివేదిక ప్రకారం, భారతదేశంలో 10 శాతం ఆరోగ్య సమస్యలు కేవలం గాలి కాలుష్యం వల్ల వస్తున్నాయి. ఢిల్లీ నగర పరిధిలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు 45కు పైగా ఉన్నాయి. మొన్నటి శీతాకాల కాలుష్యం వల్ల ఈ పాఠశాలలన్నీ వారంపాటు మూతపడ్డాయి. కాలుష్య నియంత్రణ కోసం ఎలాంటి చర్యలూ చేపట్టలేదని 'కేంద్రీయ విద్యాలయ సంఘటన్' అధికారి సంతోష్ కుమార్ మాల్ తెలియజేశారు.

ఢిల్లీలో కాలుష్యం పెరగటం 'ఎయిర్ ప్యూరిఫైర్ల'కు డిమాండ్ తెచ్చిపెట్టింది. 2017లో 'అమెజాన్ డాట్ కామ్' ద్వారా పెద్ద సంఖ్యలో 'ఎయిర్ ప్యూరిఫైర్లను ప్రజలు కొనుగోలు చేసినట్టు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణ చర్యలేమీ చేపట్టకపోవటం ప్రజలు 'ఎయిర్ ప్యూరిఫైర్ల'ను కొనుగోలుచేసేట్టు చేసిందని సామాజిక ఉద్యమకారులు విమర్శిస్తున్నారు.

కేంద్ర హోం శాఖ రూ.13 లక్షలు ఖర్చుచేసి, గతమూడేండ్లలో 44 ఎయిర్ ప్యూరిఫైర్లను కొనుగోలు చేసింది. ప్రధాని పార్లమెంట్ కార్యాలయం కోసం రూ.7లక్షలకు పైగా నిధులు వెచ్చించి 25 ఎయిర్ ప్యూరిఫైర్లు కొన్నారు. ఉన్నతస్థాయి అధికారుల విజ్ఞప్తుల మేరకు 'నీటి ఆయోగ్' రూ.7లక్షలు వ్యయం చేసి పరికరాల్ని కొనుగోలుచేసింది. కొనుగోలు చేసిన ఎయిర్ ప్యూరిఫైర్లు ఆరోగ్య, వ్యవసాయ, పర్యాటక, విదేశాంగ శాఖలకు వెళ్లాయి. సమాచార హక్కు ద్వారా సేకరించిన దీనిపై సంబంధిత శాఖల్ని 'ఇలా చేశారా ?' అని అడిగితే ఎలాంటి సమాధానం రావటం లేదని 'రాయిటర్స్' పేర్కొంది.

అంకుర సంస్థల భవితవ్యం అంతంతే..!

- 60 శాతం స్టార్టప్‌లు ఇంటికే
- ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ మోహన్‌దాస్

జైపూర్: స్కిల్ ఇండియా పేరుతో ప్రధాని మోడీ ఆర్భాటంగా ప్రవేశపెట్టిన 'స్టార్టప్ ఇండియా' పథకంలో ఏర్పాటవుతోన్న అంకుర సంస్థల్లో.. 60 శాతం నిలదొక్కుకోలేక చతికిలపడుతున్నాయని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ చైర్మన్ మోహన్‌దాస్ అన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ... దేశంలో ప్రతీ యేడాది 5 నుంచి 6 వేల అంకుర సంస్థలు ఉద్భవిస్తోన్నాయన్నారు. ఇప్పటికి 30 వేల స్టార్టప్‌లతో దేశంలోని దాదాపు 30 లక్షల మంది యువతకు ఇవి ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు. కానీ ఇందులో 60 శాతం అంకుర సంస్థలు నిలదొక్కుకోలేవన్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి మార్కెట్ పట్ల సరైన అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. 2025 నాటికి దేశంలో లక్ష స్టార్టప్‌లు ప్రారంభమవుతాయని తెలిపారు. మోహన్‌దాస్ అంతకు ముందు ఐటీ రంగంలో అగ్రగామి ఇన్ఫోసిస్ సంస్థలో డైరెక్టర్‌గా పనిచేశారు.

దళితులపై దాడులు ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

దళితులు తమ హక్కుల కోసం గళమెత్తారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో డీఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచందర్ డోమ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చినప్పటి నుండి ఈ నాలుగేళ్లలో దేశంలో దళితుల పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ బీజేపీ పాలనలో హిందూత్వ భావజాలాన్ని అమలు చేయడంతో మత విభజన జరుగుతుందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత దారుణమైన పరిస్థితి నెలకొందని విమర్శిం చారు. అక్కడ దళితులపైన, ఆదివాసులపైన అత్యా చారాలు, హింస పెరిగాయని, మమత ప్రభుత్వం బహిరం గంగానే నేరస్తులను కాపాడుతుందని దుయ్యబట్టారు. దళిత యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో మోడీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో దళిత యువత నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాల్సి ప్రభుత్వం కనీసం ఆలోచన చేయటం లేదని మండిపడ్డారు.

విగ్రహాలు ధ్వంసం చేయగరేమో.. కానీ సిద్ధాంతాలను కాదు: సుభాషిణీ అలీ

ఎస్సీ సబ్ ప్లాన్‌ను ఎత్తివేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నం చేస్తున్నదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ విమర్శంచారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి నిధులు కేటాయింపు పెంచాలని కోరారు. నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో విడుదల చేసిన గణంకాల్లో దళిత మహిళలపై అత్యాచారాలు పెరిగాయని తెలిపారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దళితులపై అత్యాచారాలు పెరిగాయని, దేశంలో 20 శాతం ఉన్న దళిత జనాభాలో 17శాతంపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో గోరక్షకులు దళితులపై విరుచుకుపడుతున్నారని, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. జేఎన్‌యూలో ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన ప్రొఫెసర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడితే, ఆయనపై విద్యార్థులు ఫిర్యాదుచేసినా... అరెస్టు చేయ లేదని, కానీ ఉత్తర ప్రదేశ్‌లో దళితుల హక్కుల కోసం పోరాడుతున్న భీమ్ ఆర్మీ నేత చంద్రశేఖర్‌ను మాత్రం అరెస్టు చేసి జైల్లో ఉంచారని విమర్శించారు. అంబేద్కర్, పెరియార్, పులే విగ్రహాలు ధ్వంసం చేయడం అమానుష మని, అధికారాన్ని ఉపయోగించుకొని వారి విగ్రహాలు ధ్వంసం చేయగలరేమో కానీ వారి సిద్ధాంతాలను ధ్వంసం చేయలేరని స్పష్టం చేశారు. డీఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, కానీ ప్రభుత్వానికి పట్టనట్టు వ్యవహారిస్తోందని విమర్శించారు. కెవిపిఎస్ తెలంగాణ, ఏపి కార్యదర్శులు భాస్కర్, మాల్యాద్రి, వివిధ రాష్ట్రాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై పెరిగిన దాడులు

- 2016లో నమోదైన కేసులు.. 40 వేలకు
- డ్లై : పార్లమెంటుకు తెలిపిన ప్రభుత్వం



న్యూఢిల్లీ : దళితులపై రోజురోజుకూ వివక్ష పెరుగుతున్నది. దళితులపై వివక్ష, వారిని అవమానించడం తదితరాలకు సంబంధించి 2015తో పోలిస్తే.. 2016లో మరింత పెరిగాయి. 2016లో దేశవ్యాప్తంగా 40,774 కేసులు నమోదైనట్టు పార్లమెంటుకు ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో సభ్యుడు అర్జున్‌లాల్ మీనన్ అడిగిన ప్రశ్నకు సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథ వలే రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కాగా, ఒక్క రాజస్థాన్‌లోనే ఈ కేసుల సంఖ్య 5,134 ఉన్నట్టు ఆయన తెలిపారు. 2015లో దేశవ్యాప్తంగా 38,564 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2015లో రాజస్థాన్‌లో 5,911 కేసులు నమోదైనట్టు రామ్‌దాస్ అథవలే తెలిపారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే దళితులపై దాడులు గణనీయంగా పెరుగుతున్నవిషయాన్ని ఎన్సీఆర్బీ రికార్డులు ధ్రువీకరించిన విషయాన్ని పార్లమెంటులో కేంద్రమంత్రి వెల్లడించటం విశేషం.

రైస్‌మిల్లు మిషన్‌లో పడి మహిళా కూలీ మృతి

- రెండు నెలల కిందనే భర్త మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

రైస్‌మిల్లులోని మిషన్‌లో చీర చుట్టుకొని మహిళా కూలీ తల తెగిపడి అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బాదలాపురంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...మిర్యాలగూడ ఆలగడప గ్రామానికి చెందిన కుర్ర నర్సమ్మ(45) బాదలాపురంలోని సూర్యతేజ రైస్‌మిల్లులో కూలీగా పని చేస్తోంది. బుధవారం యథావిధిగా ఆమె పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మిషన్‌లో చీర కొంగు చుట్టుకుంది. దీంతో ఆమె మిషన్‌లో పడటంతో తల నుంచి మొండెం వేరై అక్కడకక్కడే మృతి చెందింది. విషయం గమనించిన తోటి కూలీలు, యాజమాన్యం హుటాహుటిన మిషన్ ఆఫ్ చేసి మహిళ మృతదేహాన్ని అందులో నుంచి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందని, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మృతురాలి భర్త రెండు నెలల కింద మృతి చెందగా ఇద్దరు కుమార్తెలున్నారు. రూరల్ ఎస్ఐ సైదాబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హుటాహుటిన రైస్‌మిల్లు వద్దకు చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎం) నాయకులు అంజద్, నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

'గురుకుల' ఉద్యోగుల చలో అసెంబ్లీ ఉద్రిక్తం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

గిరిజన మినీ బాలికల గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు పెంచాలని, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆ ఉద్యోగులు తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. సుందరయ్య పార్కు నుంచి ర్యాలీగా ప్రారంభమైన ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఉద్యోగులకు తోపులాట జరిగింది. చివరికి పోలీసులు ఉద్యోగులను అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గిరిజన మినీగురుకులాల కాంట్రాక్టు ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వి.నిర్మల మాట్లాడుతూ...1999-2000 సంవత్సరంలో ప్రారంభమైన గిరిజన మినీగురుకులాలు..ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 29 ఉన్నాయని అన్నారు. నాటి నుంచి నేటి వరకు వాటిల్లో బోధన, బోధనేతర సిబ్బంది అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నారని చెప్పారు. 2009నుండి ఉపాధ్యాయులకు రూ.4వేలు, బోధనేతర సిబ్బందికి రూ.2,500ల వేతనం ఇస్తున్నారని తెలిపారు. 2012-13సంవత్సరం నుండి మిని గురుకులాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఒకటో తరగతి నుంచి ఇంగ్లీష్‌మీడియం చేయడంతో రోజుకు 12గంటల పాటు డ్యూటీలు చేయాల్సి వస్తుందని చెప్పారు. ఒకేస్కీము కింద 2004-05లో ప్రారంభమైన కేజీబీవీల్లో మాత్రం ఇప్పటికే మూడుసార్లు వేతనాలు పెంచారని గుర్తుచేశారు. ఆ పాఠశాలలతో పోలిస్తే మినీ గురుకులాల కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జీవోనెంబర్ మూడు ప్రకారం మినీ గురుకులాల్లో పనిచేసే టీచర్లకు రూ.18వేలు, వర్కర్స్‌కు రూ.10వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఈడీ, టీటీసీ చేసిన ఉద్యోగులకు టీఆర్‌టీలో వెయిటేజీ ఇవ్వాలని కోరారు. జీవోనెంబర్ 22 ప్రకారం అర్హత, సీనియారిటీ ప్రకారం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శారద, నీల, సుగుణ, యశోధ, రాణి, పూల్‌బాయి, రజిత, సమ్మక్క, మణెమ్మ, సుశీల, అరుణ, అనసూయ, పాల్గొన్నారు.

బీజేపీతో పొత్తు లేదు: పళనిస్వామి

చెన్నై: బీజేపీతో ఎలాంటి పొత్తు లేదని తమిళనాడు సీఎం ఎడప్పాడి పళనిస్వామి అసెంబ్లీలో బుధవారం స్పష్టం చేశారు. కావేరీ బోర్డు ఏర్పాటు విషయం పై తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీతో ఎలాంటి పొత్తుగానీ, మద్దతుగానీ లేదు' అని ఆయన అన్నారు. కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు విషయంలో కేంద్రంతో రాష్ట్రప్రభుత్వం మెతక వైఖరి అవలంభిస్తోందని ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. కావేరీ వాటర్ మానిటరింగ్ కమిటీ, బోర్డును ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరుతూ ఈ నెల 15న రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇదే విషయం పై ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

జాడలేని రేవంత్

నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకు కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేసినా, ఆ పార్టీ తరపున ఒకే ఒక్క ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సస్పెండ్ కాలేదు. ఇటీవల ఆయన టీడీపీ నుండి కాంగ్రెస్‌పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఆయన మాత్రం అసెంబ్లీ సమావేశాలకు రావడం లేదు. కాంగ్రెస్‌పార్టీలో చేరినరోజే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినట్టు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందుకే తాను అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని చెబుతున్నారు. స్పీకర్ కార్యాలయం వర్గాలు మాత్రం తమ వద్దకు ఎలాంటి రాజీనామా లేఖ రాలేదని అంటున్నారు. ఇందులో వాస్తవమెంత అన్నదానిపై స్పష్టత రావాలంటే, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, రేవంత్‌రెడ్డితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు స్పందించాల్సి ఉంది. కానీ తన రాజీనామా ఆమోదించాలని స్పీకర్‌పై రేవంత్‌రెడ్డి ఒత్తిడైనా పెంచాలి. లేదా తన రాజీనామా లేఖను స్పీకర్ కార్యాలయానికి పంపాలని చంద్రబాబుకైనా విజ్ఞప్తి చేసి ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రాజీనామా లేఖను ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు అందించానని, అయినా తాను రాజీనామా చేసినట్టేనని అంటున్నారు. వాస్తవానికి ఆయన చంద్రబాబుకు రాజీనామా లేఖ ఇచ్చారా? ఒకవేశ ఇస్తే ఆ లేఖను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు చంద్రబాబు పంపించారా? ప్రస్తుతం రేవంత్ రాజీనామా లేఖ స్పీకర్ కార్యాలయంలో ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేవు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రాజీనామా మాదిరిగానే , రేవంత్‌రెడ్డి రాజీనామా హైడ్రామా నడుస్తున్నదని తెలుస్తున్నది. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రాజీనామా లేఖ అందిందని స్పీకర్ చెబితే, తాను కూడా తన రాజీనామా లేఖను రేవంత్‌రెడ్డి అందించే అవకాశం ఉంది. ఇప్పట్లో ఈ రెండూ తేలవని తెలుస్తోంది. ఒకవేళ తాను అసెంబ్లీకి వస్తే ఉపయోగం లేదనీ, తనకు స్పీకర్ మైకు అందించరన్న అభిప్రాయానికి రేవంత్‌రెడ్డి వచ్చారని గాంధీభవన్ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

అధికారిక కార్యక్రమాలకు హాజరుకావడంపై..

రాజీనామా చేశాను కాబట్టి అసెంబ్లీకి రానని చెబుతున్న రేవంత్ రెడ్డి మాత్రం తన నియోజకవర్గమైన కొడంగల్ లో మాత్రం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాజీనామా చేసిన వ్యక్తి నియోజకవర్గంలో ఎందుకు పాల్గొంటున్నాడన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

'ట్రైడెంట్'లో సీఐటీయూ గెలుపు

- నాలుగు ఓట్లతో హెచ్ఎంఎస్‌పై విజయం
- కార్మికుల విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామ శివారులోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో బుధవారం నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలో సీఐటీయూ విజయం సాధించింది. నాలుగు ఓట్లతో హెచ్ఎంఎస్‌పై గెలుపొందింది. ఫ్యాక్టరీలోని మొత్తం 189 ఓట్లకుగానూ 188 పోలయ్యాయి. సీఐటీయూకు 96ఓట్లు, హెచ్ఎంఎస్‌కు 92 ఓట్లు వచ్చాయి. సీఐటీయూ విజయం పట్ల యూనియన్ నాయకులు, సభ్యులు సంబరాలు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ కర్మాగారంలో హెచ్ఎంఎస్సే గుర్తింపు కార్మిక సంఘంగా ఉంది. మొదటిసారి సీఐటీయూ విజయం సాధించింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బి.మల్లేశం మాట్లాడుతూ ఈ విజయం కార్మికులకు అంకితమన్నారు. తనపై నమ్మకంతో గెలిపించినందుకు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ కార్మికుడు తమ సమస్యలను నేరుగా తెలిపి పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఎన్నికలో కార్మికులకు ఇచ్చిన ప్రతీ హామీని నేరవేర్చుతామని, నూతన వేతన ఒప్పందానికి కృషిచేస్తానన్నారు. కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలన్నారు. కార్మికులు, యాజమాన్యం ఇద్దరి శ్రేయస్సును సీఐటీయూ కోరుకుంటుందని తెలిపారు. విజయాన్ని పురస్కరించుకుని పరిశ్రమ నుంచి కొత్తూర్(బి) వరకు ర్యాలీ నిర్వహించి అక్కడి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. దిడ్గి గ్రామం వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రాంచందర్, సాయిలు, మహిపాల్, రాజిరెడ్డి, చంద్రశేఖర్, మహ్మద్ యూసుఫ్, కనకారెడ్డి, వంశీ, నర్సయ్య, నర్సింహ్మారెడ్డి, రత్నం, భూమప్ప, రాములు, హన్మంత్‌రెడ్డి, భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మస్కూర్ కన్నా కలెక్టర్ అధ్వానం

- రాజకీయ పబ్బం కోసమే ఆ రెండు పార్టీల విమర్శలు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

నవతెలంగాణ-నర్సంపేట

ప్రభుత్వ కార్యకలాపాల్లో జిల్లా కలెక్టర్ హరిత ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారని, మస్కూర్ కన్నా అధ్వానంగా వ్యవహరిస్తున్నారని ఏఐసీసీ సభ్యులు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విమర్శించారు. రాజకీయ పబ్బం కోసమే టీఆర్ఎస్, టీడీపీ తనపై విమర్శలు చేస్తున్నాయన్నారు. బుధవారం నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దొంతి మాట్లాడారు. తనకు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలో కలెక్టర్ పర్యటించడం సరైంది కాదన్నారు. నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి కనీసం జీవో అయినా ఉందా అంటూ ప్రశ్నించారు.

ఎలాంటి మంజూరు లేకుండానే కోట్ల అభివృద్ధి చేస్తామని టీఆర్ఎస్ నాయకులు చెప్పడం మోసగించడమే అవుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నెక్కొండ, చెన్నారావుపేట జెడ్పీటీసీలు బక్కి కవిత, జున్నుతుల రాంరెడ్డి, ఎంపీపీ జక్క అశోక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్‌కు రూ. 5వేలు చెల్లించాలి

- కల్వకుర్తి మార్కెట్‌లో రైతుల ఆందోళన

నవతెలంగాణ-కల్వకుర్తి

వేరుశనగ పంటకు మద్దతు ధర చెల్లించకుండా వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని వివిధ గ్రామాల రైతులు నాగర్‌కర్నూల్ జిల్లాలో బుధవారం ఆందోళనకు దిగారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట భైటాయించారు. అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. నాణ్యమైన వేరుశనగ క్వింటాల్‌కు రూ.4వేలు, కొద్దిగా నాణ్యత తగ్గిన వేరుశనగకు రూ3వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేయడానికి టెండర్లు వేయగా వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. నాణ్యమైన వేరుశనగకు క్వింటాల్‌కు రూ.5వేలు చెల్లించాలని నాణ్యత తగ్గిన వేరుశనగకు రూ.4వేలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

వ్యాపారులు పట్టించుకోకపోవడంతో కార్యాలయం గేటుకు ఎదురుగా భైటాయించి నినదించారు. ఈ సంద ర్భంగా మార్కెట్ చైర్‌పర్సన్ విజితారెడ్డి వ్యాపారులతో, రైతులతో చర్చలు జరిపారు. నాణ్యమైన వేరుశనగకు అదనంగా రూ.200, నాణ్యతలేని వేరు శనగకు 100 చెల్లిస్తామని వ్యాపారులు చెప్పారు. క్వింటాల్‌కు రూ.5వేలు చెల్లించే వరకు ఇక్కడి నుండే కదిలేది లేదంటూ భీష్మించారు. సాయంత్రం వరకు వ్యాపారులు, రైతులతో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎంతో కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించకుండా వ్యాపారులు మోసం చేస్తున్నా అధికారులు గానీ, ప్రభుత్వంగానీ పట్టించుకోవడం లేద ని రెడ్య తండాకు చెందిన రైతు రమేష్‌నాయక్ వాపోయాడు. గిట్టుబాటు ధర చెల్లించేవరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు చెప్పారు.

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
▲139 33,136	▲31 10,155	65.20	రూ. 30,418	రూ. 40,200

కోడిగుడ్లు

హైదరాబాద్	330	విజయవాడ	317
ఒక్కగుడ్డుకు	3.90	చెన్నై	370
వరంగల్	332	ముంబయి	370

ట్రయంఫ్ నుంచి రూ.14 లక్షల బైక్



న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన సూపర్‌బైక్ తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్ సైకిల్స్ మరో కొత్త బైక్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. టైగర్ సిరీస్‌లో 800 ఎక్స్‌సీఎక్స్, ఎక్స్‌ఆర్, తరహా బైక్‌లను ఆ సంస్థ బుధవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కొత్త బైక్స్ ధరలను కంపెనీ రూ. 11.76 లక్షల నుంచి రూ.13.76లక్షలుగా (ఎక్స్‌షోరూం దిల్లీ) నిర్ణయించింది. ఈ బైక్‌లను 800సీసీ, 3 - సిలిండర్, 94 బీహెచ్‌పీ పవర్, 79 ఎన్‌ఎం టార్క్ ఇంజిన్‌తో రూపొందించారు. కొత్త బైక్స్‌ను 6-స్పీడ్ గేర్‌బాక్స్ తదితర అధునాతన ఫీచర్లతో రూపొందించినట్టుగా సంస్థ తెలిపింది. 'ట్రయంఫ్‌లో మంచి మోడల్స్‌ను వినియోగదారులకు అందించేందుకు టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేస్తున్నాం' అని ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విమల్ సంబ్లీ అన్నారు.

మహాభారత్ సహా నిర్మాతగా అంబానీ!



న్యూఢిల్లీ: భారీ బడ్జెట్‌తో నిర్మించతలపెట్టిన 'మహాభారత్' సినిమా నిర్మాణపై రిలయన్స్ అధినేత కన్నేసినట్టుగా సమాచారం. దాదాపు రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న 'మహాభారత్'కు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ సహ నిర్మాతగా వ్యవహరించనున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. నాలుగు నుంచి ఐదు భాగాలుగా ఈ సినిమా నిర్మితమవనుంది. కొత్త సంస్థను స్థాపించడం ద్వారా 'మహాభారత్'కు ముఖేష్ పెట్టుబడులు పెడతారా? లేక ఇప్పటికే రిలయన్స్ గొడుగు కింద ఉన్న మీడియా సంబంధిత సంస్థలు జియో, వయాకామ్-18ల ద్వారా పెట్టుబడులు పెడతారా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే ఈరోస్, ఏక్తా కపూర్‌కు చెందిన బాలాజీ టెలీ ఫిలింస్‌లలో ముఖేష్ పెట్టుబడులున్నాయి. ఈ సినిమాను ప్రపంచంలోని సమారు అన్ని భాషల్లోనూ విడుదల చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

మొబైల్ వాడకందార్లకు తీపికబురు



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల వాడకందార్లకు టెలికాం శాఖ గుడ్‌న్యూస్ ప్రకటించింది. ఆధార్‌తో మొబైల్ నెంబర్లను అనుసంధానం చేసుకొనే గడువును అప్రకటిత కాలానికి పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఆధార్ అనుసంధానతపై సుప్రీంకోర్టు వెసులుబాటుతో కూడిన తీర్పునిచ్చిన నేపథ్యంలో ఆధార్-మొబైల్ నంబర్ల వెరిఫికేషన్‌ను గడువు తేదీగా ప్రకటించిన మార్చి 31 తరువాత కూడా చేపట్టుకోవచ్చని పేర్కొంది. అదేవిధంగా ప్రస్తుతం టెలికాం కంపెనీలు పంపుతున్న వాయిస్, టెక్స్ట్ మెసేజ్‌లలో రీ-వెరిఫికేషన్ ప్రక్రియ చివరి తేదీని పేర్కొనకూడదని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యం బీమా పాలసీలను కూడా ఆధార్‌తో అనుసంధానం చేసుకొనే ప్రక్రియను అప్రకటిత కాలానికి పొడిగిస్తున్నట్టు బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ తెలిపింది. దీంతో పాలసీదారులకు కాస్త ఊరట లభించినట్టయింది.

మరో వెయ్యి కోట్ల మోసం!

14 బ్యాంకుల్ని ముంచిన 'కనిష్క్' గోల్డ్ సంస్థ

- పదేండ్ల నుంచి దర్జాగా బ్యాంకుల లూటీ
- ప్రజాప్రతినిధులు, అధికారుల హస్తం!
- అలసత్వంతో ఆలస్యంగా వెలుగులోకి..
- తాపీగా సీబీఐకి ఫిర్యాదు చేసిన ఎస్‌బీఐ
- బెయిల్‌పై వచ్చి దేశం దాటేసిన 'డైరెక్టరు'



చెన్నై: బ్యాంకుల్లో జ్యువెల్లరీ సంస్థల మోసాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వేలాది కోట్ల మేర రుణాలు తీసుకొని బ్యాంకులకు ఎగనామం పెట్టిన గీతాంజలి జ్యువెల్లర్స్, నీరవ్ మోడీ మోసాల కేసులు ఒక కొలిక్కి రాకముందే.. తాజాగా మరో ఆభరణాల సంస్థ మోసం వెలుగులోకి వచ్చింది. చెన్నైకి చెందిన కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ (కేజీపీఎల్) సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్‌తో (ఎస్‌బీఐ) సహా 14 బ్యాంకుల నుంచి దాదాపు రూ.824.15 కోట్ల మేర రుణాలను తీసుకొని కుచ్చుటోపీ పెట్టింది. ఈ ఉదంతంపై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని కనిష్క్ గోల్డ్ దుకాణం డైరెక్టర్స్ భూపేష్ కుమార్, ఆయన భార్య నీతా జైన్‌పై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు చేసింది. 2008 నుంచి దాదాపు పదేండ్లుగా కేజీపీఎల్ డైరెక్టర్ల నకిలీ ధ్రువపత్రాలు, రికార్డులను బ్యాంకుల్లో దాఖలు చేసి వందల కోట్ల మేర రుణాలను స్వీకరించినట్టుగా తెలుస్తోంది. సరైన స్టాక్స్ చూపకుండా కేవలం రికార్డుల్లో మాయంజాలం చేస్తూ కనిష్క్ ప్రమోటర్లు మోసాని పాల్పడ్డట్టుగా తెలుస్తోంది. తన బ్యాంకు ఫోరెన్సిక్ ఆడిట్‌లో భాగంగా కేజీపీఎల్ సమర్పించిన పత్రాలను పరిశీలించి చూస్తే రుణాల నిమిత్తం డైరెక్టర్స్ భూపేష్ కుమార్, ఆయన భార్య నీతా జైన్‌లు స్టాట్యుటరీ ఆడిటర్లతో కలిసి నకిలీ ధ్రువ పత్రాలను, ఫోర్జర్డ్ డాక్యుమెంట్లతో బ్యాంకులను పెద్దమొత్తంలో రుణాలను స్వీకరించి వాటిని ఇతర అవసరాలకు మళ్లించిన విషయం వెలుగులోకి వచ్చిందని ఎస్‌బీఐ తన ఫిర్యాదులో పేర్కొంది. వీటిపై వివరణ కోరేందుకు వెళ్లగా రాత్రికి రాత్రే వాళ్లు దుకాణాలన్నింటినీ మూసివేసి, వారు రికార్డులను కూడా మాయం చేసినట్లు భారతీయ స్టేట్ బ్యాంక్ సీబీఐకిచ్చిన ఫిర్యాదులో తెలిపింది. రుణం మొత్తానికి రావాల్సి వడ్డీ కూడా జతచేసి చూస్తే.. ఎగవేత మొత్తం రూ.1000 కోట్ల వరకు చేరనుందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి కనిష్క్ జ్యూయలరీ రుణాలు తీసుకున్న 14 బ్యాంకులకు డబ్బులు కట్టడం నిలిపివేసింది. గతేడాది నవంబరులో ఎస్‌బీఐ కనిష్క్ గోల్డ్ జ్యూయలరీ యజమానిని రుణ ఎగవేతదారుడిగా ప్రకటించి సదరు రుణాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించింది. ఈ విషయమై ప్రశ్నించేందుకు బ్యాంకు అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లగా అవన్నీ మూసేసి కనిపించాయి. అయితే కనిష్క్ మోసం వెనుక బడా ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్టుగా విచారణ సంస్థలు అనుమానిస్తున్నాయి.. బ్యాంకుల్లో కొందరు అధికారుల లాలూచీ పడ్డ విషయం కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తోందని విచారణ సంస్థలు చెబుతున్నాయి.

బెయిల్‌పై వచ్చి.. మారిషస్ ఉడాయించారు..

రుణాలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా కనిష్క్ ప్రమోటర్ల ఆచూకీ తెలియడం లేదని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. భూపేష్, నీతా జైన్‌లు మారిషస్ పారిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మోసంలో కీలక పాత్ర పోషించిన ఆడిటర్లు తేజ్‌రాజ్, అజయ్ కుమార్ జైన్, సుమిత్ కేడియాలను కూడా బ్యాంక్ నిందితులుగా ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఇది ఇలా ఉంటే 2017 సెప్టెంబరులో కనిష్క్ గోల్డ్ వ్యవస్థాపకుడు భూపేష్ కుమార్ జైన్‌ను రూ. 20 కోట్ల ఎక్సైజ్ పన్ను మోసం కేసులో అరెస్టు అయ్యాడు. బెయిల్ మీద విడుదలైన భూపేష్ అప్పటి నుంచి భార్యతో సహా పరారీలో ఉన్నాడు. కాగా చెన్నైలోనే కాకుండా హైదరాబాద్, కొచ్చిన్, ముంబైలలో కూడా కనిష్క్ జువెలరీ తన షాపులను విస్తరించింది.

ఎస్‌బీఐకే అత్యధికం భారం..

మొత్తం రుణంలో ఎస్‌బీఐ వాటాయే దాదాపు రూ.240 కోట్ల వరకు ఉందని ఆ సంస్థ ఫిర్యాదు ద్వారా తెలుస్తోంది. బాధిత బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు (రూ.128 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.53 కోట్లు), ఐడీబీఐ (రూ.49 కోట్లు), సిండికేట్ బ్యాంకు (రూ.54 కోట్లు), యూకో బ్యాంక్ (రూ.45 కోట్లు), సెంట్రల్ బ్యాంక్ (రూ.22 కోట్లు), కార్పొరేషన్ బ్యాంక్ (రూ.23 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.32 కోట్లు), తమిళనాడు మెర్కంటైల్ బ్యాంక్ (రూ.27 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.27 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.27 కోట్లు), ఆంధ్రా బ్యాంక్ (రూ.32 కోట్లు) ఉన్నాయి.

రాణించిన స్టాక్ మార్కెట్లు

లాభాల స్వీకరణతో తగ్గిన ప్రాఫిట్స్

ముంబయి: వరుస నష్టాలతో సతమతమవుతున్న మార్కెట్లకు బుధవారం భారీ ఊరట లభించింది. ఇటీవలి కాలంలో మార్కెట్ల వరుస పతనాల నేపథ్యంలో చాలా స్టాక్స్ ధరలు అందుబాటు ధరల్లోకి రావడం.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అనుకూల పవనాలు రావడం.. దేశంలో రాజకీయ అవిశ్వాసంపై నీలినీడలు దూరం అవుతున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు బుధవారం పరుగులు తీశాయి. ఇంట్రాడేలో దాదాపు 300 పాయింట్లకు పైగా ఎగిసిన సెన్సెక్స్, చివరికి మదుపరుల లాభాల స్వీకరణకు దిగడంతో 139 పాయింట్ల లాభంలో 33,136 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 30 పాయింట్ల లాభంలో 10,155 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడంతో మార్కెట్లు ఆద్యంతం సానుకూలంగానే ట్రేడయ్యాయి. ట్రేడింగ్ చివర్లో ఫెడ్ భయాలు, లాభాల స్వీకరణతో మార్కెట్లు కొంత లాభాలను పోగొట్టుకున్నాయి. ఔషధ, లోహ, మీడియా సంస్థల షేర్లు నష్టాల్లో నడవగా.. స్థిరాస్తి రంగం దాదాపు 0.8 శాతం మేర పైకెగిసింది. బ్లూచిప్స్‌లో ఎయిర్‌టెల్ 4.3 శాతం లాభపడగా.. బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, ఐబీ హౌసింగ్, బీపీసీఎల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ, అల్ట్రాటెక్, ఓఎన్‌జీసీ, ఇండస్‌ఇండ్ 2.5-1 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే టాటా స్టీల్, హీరోమోటో, ఐషర్, అదానీ పోర్ట్స్, ఇన్‌ఫ్రాటెల్, అరబిందో, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా 2-1 శాతం మధ్య కుంగాయి.

రద్దులో తర్కం అర్థం కాలేదు!



కోల్‌కతా: మోడీ సర్కారు నోట్లరద్దును ఎందుకు చేపట్టిందో తనకు ఇప్పటి వరకు అర్థం కాలేదని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి అన్నారు. ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో నారాయణ మూర్తి మాట్లాడుతూ తన విశ్లేషణ ప్రకారం పెద్దనోట్ల రద్దు చర్యను పట్టణ మేధావులు చాలా మంది అంగీకరించనప్పటికీ.. గ్రామీణ భారతంలో అత్యధికులు ఈ నిర్ణయాన్ని స్వాగతించారని వివరించారు. తాను వాస్తవానికి ఆర్థిక శాస్త్ర నిపుణుడిని కాదని..తన దృష్టికి వచ్చిన అంశాల్ని మాత్రమే చెబుతున్నట్టుగా వివరించారు. దేశంలో దాదాపు 75 శాతం మంది చిన్నారులు పాఠశాలకు వెలుతున్నా అందులో చాలా మంది 8వ తరగతికి వచ్చే సరికి డ్రాపవుట్‌గా మిగిలి పోతున్నారని అన్నారు. వీరు 22 ఏండ్లకు వచ్చే సరికి ఉపాధి కోసం ఉద్యోగ అన్వేషణకు వస్తున్నారని తెలిపారు. పెద్ద చదువులకు పోని కారణంగా వీరు ఎక్కువగా తక్కువ టెక్నాలజీతో కూడిన ఉద్యోగాలపై దృష్టి పెడుతున్నారని నిరుద్యోగులుగా మారిపోతున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా జపాన్, చైనాల మాదిరిగా తక్కువ టెక్నాలజీతో కూడిన తయారీ రంగంపై మొదటి నుంచి దృష్టి సారించాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

నవతెలంగాణ

పాలకుల కోసం కాదు.. ప్రజల గొంతుకగా ఉండేదే పత్రిక

జనస్వరం వినిపిస్తున్న నవతెలంగాణ

- సర్కారు ప్రకటనలివ్వకున్నా ముందుకు
- బూర్జువా పత్రికలకు వార్షికోత్సవాలు కాదు... వార్షికాదాయమే ముఖ్యం : సామాజికవేత్త జయధీర్ తిరుమలరావు




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలకవర్గాల కోసం కాకుండా ప్రజల గొంతుకగా ఉండేదే పత్రిక అని సామాజికవేత్త జయధీర్ తిరుమలరావు అన్నారు. నవతెలంగాణ దినపత్రిక నిజంగానే జనస్వరం వినిపిస్తోందని చెప్పారు. నవతెలంగాణ మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఒకరు వేసే తప్పటడుగు వల్ల ఆ వ్యక్తికే ఇబ్బంది ఉంటుందని చెప్పారు. ప్రజల తరపున ఉన్న ఒక సంస్థ తప్పటడుగు వేస్తే లక్షలాది మందిపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ పత్రిక వెనుక ప్రజలున్నారని చెప్పారు. పాఠకులే కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వార్షికోత్సవాలు జరిపే సంస్కృతి నవతెలంగాణ వంటి పత్రికలకే ఉంటుందని చెప్పారు. బూర్జువా పత్రికలు వార్షికోత్సవాలు కాకుండా వార్షికాదాయంపైనే కేంద్రీకరిస్తాయని ఎద్దేవా చేశారు. పాలకవర్గాల ఆశీస్సులు పొంది వార్షికాదాయాన్ని ఎలా పెంచుకోవాలా?అన్న దానిపైనే వాటి దృష్టి ఉంటుందని అన్నారు. నవతెలంగాణకు సర్కారు ప్రకటనలు ఇవ్వకపోయినా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రజా ప్రత్యామ్నాయం అని రాకపోతే ఫెడరల్ ఫ్రంట్ ముందుకు వచ్చేది కాదన్నారు. సృజనాత్మకతతో నవతెలంగాణ శక్తిగా మారాలని ఆకాంక్షించారు. నవతెలంగాణలో చార్వాక వంటి ప్రత్యేక పేజీ ప్రత్యామ్నాయ ఆలోచనలకు నిలయంగా ఉందన్నారు. ప్రతిపేజీ సైద్ధాంతిక ధోరణిని ప్రతిబింబిస్తోందని చెప్పారు. బూర్జువా పత్రికల్లో ప్రజాభిప్రాయాలను ప్రచురించడం లేదని అన్నారు. ఆ పత్రికల్లో ప్రజలు మాయమైపోయారని, ఆ స్థానంలో పెట్టుబడిదారులు వచ్చారని చెప్పారు. బూర్జువా పత్రికలన్నింటికీ చీఫ్ ఎడిటర్ ఒకరేనని అన్నారు. ప్రజా వ్యతిరేక వార్తలను ప్రజానుకూల వార్తలుగా రూపుదిద్దబడుతున్నాయని చెప్పారు. ఇలాంటి ధోరణి ప్రమాదకరమని అన్నారు. అందుకే ప్రజలను కదిలించే దిశగా వాస్తవాలను ప్రచురించే బాధ్యత నవతెలంగాణపై ఉందన్నారు. బహుజన, వామపక్ష, స్వరంలేని ప్రజల పక్షాన నిలబడాలని చెప్పారు. పాత్రికేయ వృత్తిని కాపాడుకుంటూ, రాజ్యాన్ని ప్రశ్నిస్తూ ముందుకుసాగాలని అన్నారు. రాష్ట్రంలో ఏ పత్రిక మీద లేనన్ని ఆంక్షలు నవతెలంగాణ మీద ఉన్నాయని, ధైర్యంగా ముందుకు సాగుతున్నందుకు యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు చెప్పారు.

రెండు పుస్తకాలు ఆవిష్కరణ

నవతెలంగాణ మూడో వార్షికోత్సవం సందర్భంగా రెండు పుస్తకాలను ఆవిష్క రించారు. నవతెలంగాణ సంపాదకులు ఎస్ వీరయ్య రాసిన 'మీరు జర్నలిస్టులా? కొన్ని సూచనలు, సలహాలు' పుస్తకాన్ని, జి గంగాధర్ సిర్ప రాసిన 'మీ సత్తా తెలుసుకోవడం ఎలా?' అనే పుస్తకాన్ని దేవరాజు మహారాజు ఆవిష్కరించారు. నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పివి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత అంపశయ్య నవీన్, నవతెలంగాణ ఫీచర్స్ ఎడిటర్ గుడిపాటి వెంకటేశ్వరరావు, కవి యాకూబ్, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు గుడిపూడి విజయారావు, జనరల్ మేనేజర్ కె చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన గౌరవానికి ఆనందిస్తున్నా : దాసు కేశవరావు



నవతెలంగాణ యాజమాన్యం తనను సత్కరించడం అరుదైన గౌరవంగా ఆనందిస్తున్నానని సీనియర్ జర్నలిస్టు దాసు కేశవరావు చెప్పారు. 2005లో రిటైరైన తర్వాత మళ్లీ జర్నలిజంలో ఉండకూడదని నిర్ణయించుకున్నానని అన్నారు. ప్రస్తుతం జర్నలిజం భయంకరంగా మారిందని చెప్పారు. ఒకప్పుడు జర్నలిస్టు అంటే గౌరవం ఉండేదని, ఇప్పుడు చెప్పుకోలేని స్థితిలో ఉండడం బాధాకరమని అన్నారు. నాడు విలువలుండేవని, నేడు క్రమంగా దిగజారుతున్నాయని చెప్పారు. సంచాలనాల కోసం పత్రికలు పోటీపడుతున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థ చేయాల్సిన పనిని పత్రికలు చేస్తున్నాయని వివరించారు. జర్నలిజానికి మంచి రోజులొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దాసు కేశవరావు గురించి ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్ వివరించారు.

దాసు కేశవరావుకు ఆత్మీయ సన్మానం

దహిందూ పత్రికలో డిప్యూటీ ఎడిటర్‌గా పనిచేసి 2005లో రిటైరైన దాసు కేశవరావును నవతెలంగాణ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆత్మీయ సన్మానం చేశారు. దాసు కేశవరావుకు నవతెలంగాణ ఎడిటర్ ఎస్ వీరయ్య శాలువా కప్పి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్ మెమోంటో ఇచ్చి సత్కరించారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా లఘు నాటికలు, పాటలు అందరినీ అలరించాయి. ఉత్తమ నవల, కథ, సింగిల్ పేజీ కథ, కవితలు రాసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజాస్వామ్యానికి మీడియా వాచ్‌డాగ్

జస్టిస్ వి. గోపాలగౌడ ప్రసంగ పాఠం

> నవతెలంగాణ మూడో వార్షికోత్సవానికి హాజరుకావాల్సిన జస్టిస్ వి.గోపాలగౌడ అనారోగ్య కారణాల దృష్ట్యా రాలేకపోయారు. ఆయన పంపిన ప్రసంగ పాఠమిది.

మీడియా స్వేచ్ఛపై రాజ్యాంగంలో స్పష్టతనివ్వలేదు. కానీ, ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛలో మీడియా స్వేచ్ఛ అనివార్యంగానే అంతర్భాగంగా ఉంటుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వివరణ ఇచ్చారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి మనం సుదీర్ఘ ప్రయాణం సాగించాం. ఆతరం ప్రజలు వలసవాదులపై జరిపిన పోరాటం ముగిసినట్టుగా భావించారు. మిగిలిందల్లా సంస్కరణే.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో పాలకుల అణచివేతకు గురవుతున్నామనే భావన ప్రజల్లో ఇంకా నెలకొన్నదని వారు కొంతైనా గ్రహించి ఉంటారు.

భావప్రకటనా స్వేచ్ఛ కోసం పత్రికలు సుప్రీంకోర్టులో వేసిన కీలక కేసుల్ని ఓసారి గుర్తు చేసుకుంటే..ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియా ఆత్మవిశ్వాసంతో గర్వంగా నిలిచిందనే భావన నాలో కలిగింది. అందువల్లే పరిశోధనాత్మక జర్నలిజం ద్వారా బోఫోర్స్ కుంభకోణంలాంటి విలువైన కుంభకోణాల్ని బయటపెట్టగలిగారు. రాడియా టేపులు, ఆహార ధాన్యం కుంభకోణాలు, పోలీస్ ఎన్‌కౌంటర్లలో ప్రముఖ రాజకీయవేత్తల ప్రమేయం...వంటివి మీ కృషి వల్లే ఈ నేరాలకు సంబంధించిన కేసుల్ని సుప్రీంకోర్టు చేపట్టగలుగుతోంది.

పరిశోధనాత్మక జర్నలిజమనేది రిస్క్‌తో కూడుకున్న పని. ఇటీవల మరణించిన జర్నలిస్టులు, ప్రజావేగులను గుర్తు చేసుకుంటే వారు ఎంత ఒత్తిడి, బెదిరింపుల మధ్య పని చేశారో అర్థమవుతుంది. సుప్రీంకోర్టు, మీడియా మధ్య ఆత్మీయ సంబంధాల వల్ల వ్యవస్థల ప్రాధాన్యత అర్థమవుతుంది. పరస్పర గౌరవాన్ని నెలకొల్పుతోంది.

ఉదాహరణకు అజయ్‌గోస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా(2006) కేసులో పత్రికల్లో ప్రకటనలు (ADVERTISEMENTS) ప్రచురించే హక్కును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. బాధ్యతాయుత పాఠక సంస్కృతిని బలపరిచేందుకే ఈ తీర్పు ఇచ్చినట్టు సుప్రీంకోర్టు తెలిపింది.

స్వతంత్ర, స్వేచ్ఛాయుత మీడియా అవసరాన్ని సుప్రీం కోర్టు ఎల్లప్పుడూ గుర్తెరిగి ఉంటుంది. 1950 నుంచి అదే రీతిన వ్యవహరిస్తోంది. రమేశ్‌థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ కేసులో సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది...

"ప్రజాస్వామిక సంస్థలన్నింటికీ వాక్ స్వాతంత్ర్యం, మీడియా స్వేచ్ఛ పునాదిలాంటివి. స్వేచ్ఛాయుత రాజకీయ చర్చలు లేకుండా ప్రజలకు విద్య ఉండదు. ప్రజాదరణతో ప్రభుత్వం నడిపించాలంటే ఈ ప్రక్రియ ఎంతో అవసరం. స్వేచ్ఛ విస్తృతమైనపుడు అసభ్యత అనే ఇబ్బందులూ ఉంటాయి. సమాఖ్య రాజ్యాంగంలో మొదటి సవరణకు స్ఫూర్తినిచ్చిన మేడీసన్ ప్రభావం మన రాజ్యాంగ నిర్మాతలపై ఉన్నది. ' కొన్ని విషపూరిత కొమ్మలను ఎదగనీయడమే సరైంది. వాటిని కత్తిరించడం వల్ల మంచి ఫలాలకు హాని కలిగే ప్రమాదమున్నపుడు".

మీడియా స్వేచ్ఛ గురించి భారత రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. అంతమాత్రాన మీడియా స్వేచ్ఛకు చట్టపరమైన రక్షణలేదని భావించకూడదు. ప్రచురణలపై సెన్సార్‌షిప్ విధించడమనేది రాజ్యాంగంలోని అధికరణం 19(2)లో నిర్వచించిన హేతుబద్ధమైన నియంత్రణ పరిధిలో లేనపుడు న్యాయసమ్మతం కాదు.

వాక్ స్వాతంత్రం, భావ ప్రకటన.. స్వేచ్ఛగా సర్క్యులేట్ కావాలి. రమేశ్‌థాపర్ కేసులో కోర్టు ఇలా చెప్పింది.."సర్క్యులేషన్ స్వేచ్ఛ లేనపుడు ప్రచురణకుండే విలువ స్వల్పమే.. అంతేకాదు.. ప్రత్యక్ష, పరోక్ష నిషేధాలు కూడా భావప్రకటనా స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించడమే" అని కోర్టు గుర్తు చేసింది. ప్రభుత్వ విధానాల ద్వారా సర్క్యులేషన్‌ను నియంత్రించడాన్ని ఉదాహరణగా పేర్కొన్నది. సకల్‌న్యూస్ పేపర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వార్తా పత్రిక పేజీ సైజుపై ప్రభుత్వం నియంత్రణ విధించడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ప్రభుత్వ చర్య మీడియాకుండే స్వేచ్ఛా హక్కును పూర్తిగా ఉల్లంఘించిందని కోర్టు వ్యాఖ్యానించింది.


ఫైల్

బెన్నెట్ కోల్‌మెన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇదే విషయం పునారావృతమైంది. వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనకు సర్క్యులేషన్ విలువ మాత్రమే కాదు, వార్తలు, అభిప్రాయాల విలువ కూడా ఉంటుందని తెలిపింది. మీడియాపై నిషేధాజ్ఞలకు చట్టం అనుమతిస్తే సర్క్యులేషన్‌ను నియంత్రిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుంది. వార్తా పత్రిక ప్రారంభాన్ని కూడా అడ్డుకుంటుంది. ప్రభుత్వ సహకారానికై మీడియా ఆధారపడేలా ఒత్తిడి చేస్తుంది.

ప్రజాస్వామ్యానికి మీడియా వాచ్ డాగ్ వంటిది. అది ప్రభుత్వ గొంతుక కాకూడదు. అసమ్మతి గొంతుకగానే ఎల్లప్పుడూ ఉండాలి.

ఒకే యాజమాన్యం కింద ఎడిషన్స్ ప్రారంభించడంపై ఆంక్షలు విధించడం, పది పేజీల పరిమితి, అలవెన్స్‌లను 20 శాతంకన్నా పెంచొద్దని ఆంక్షలు విధించడం వంటివి... అధికరణం 19(1)(ఏ) ప్రకారం మీడియా స్వేచ్ఛను ఉల్లంఘిండమేనని బెన్నెట్ కోల్‌మెన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఇటీవలి పరిస్థితుల్లో ప్రభుత్వం, మంత్రులు, అధికారులు పాల్గొనే కార్యక్రమాలను ఎక్కువగా కవర్ చేస్తున్న వార్తాపత్రికలు, జర్నలిస్టులు వారిని పొగడ్తల్లో ముంచెత్తడం చూస్తున్నాం. దినసరి కూలీలు జరిపే పోరాటాలకుగానీ, కార్మికులు-యాజమాన్యాల మధ్య జరిగే సంప్రదింపులకుగానీ మీడియా ప్రాధాన్యతనీయడంలేదు. అయితే, విలేకరులు, జర్నలిస్టులు యూనియన్ల ద్వారా ఆందోళనలు చేయడాన్ని విస్మరించలేం.

నిజమైన విలేకరి ఎల్లప్పుడూ ప్రశ్నిస్తారు, పరిశోధిస్తారు. జర్నలిస్టుల ప్రాథమిక పరిశోధన ఆధారంగానే సుప్రీంకోర్టుకు చాలా కేసులు వస్తున్నాయి...2జీ కుంభకోణం, భూ కేటాయింపులు వంటివి ముఖ్యమైన కేసుల్లో కొన్ని ఉదాహరణలు మాత్రమే. నూతన దృక్పథంతో అడుగేస్తున్న ఈ వార్తాపత్రిక సంపూర్ణ విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నా..



కలుపు మొక్కల్ని ఏరేద్దాం..!

వివిధ పంటల్లో వాడదగిన కలుపు మందులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల కలుపు మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఏ పంటకు ఏ మందును, ఎంత మోతాదులో, ఏ సమయంలో, ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాత మాత్రమే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. ఒక వేళ వాడితే కలుపు నివారణ సరిగ్గా జరగకపోగా కొన్ని సందర్భాల్లో పంటలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదముంది.

ఏ పంటకు సిఫారసు చేసిన మందును ఆ పంటకు మాత్రమే వాడాలి. ఉదా: మాగాణి వరిలో వెడల్పాకు కలుపు మొక్కల నిర్మూలనకు వరినాటిన 25 నుంచి 30 రోజులకు పొలంలో నీటిని తీసివేసి 2,4-డి సోడియం సాల్ట్ పొడి మందును ఎకరానికి 400-500 గ్రా. చొప్పున 200లీ. నీటిలో కలిపి సాధ్యమైనంత వరకు కలుపు మీద మందు పడేటట్టు పిచికారి చేయాలి. మందు మోతాదు మించితే పైరు దెబ్బతింటుంది. ఈ మందును ఎట్టి పరిస్థితిల్లోనూ ద్విదళ బీజ పంటలైన మినుము, పెసర, పత్తి, పొగాకు, మిరప వంటి పంటలపై వాడరాదు.

కొన్ని రకాల కలుపు మందులు పంట విత్తిన వెంటనేగానీ మొలకెత్తక ముందుగానీ పిచికారీ చేయాలి. (ప్రి ఎమర్జెన్స్) ఉదా: పెండిమిథాలిన్, అలాక్లోర్ వంటి ఈ రకపు మందులు పిచికారీ చేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండే బాగా పనిచేస్తాయి. కొన్ని రకాల కలుపు మందులు పైరు, కలుపు మొలకెత్తిన తరువాతనే పిచికారీ చేయాలి. ఉదా: ఇమాజతాఫైర్, ఫినాక్సా ప్రాస్ పి ఇథైల్ వంటి మందులను మినుము, పెసర పైర్లు విత్తిన 15నుంచి 20 రోజుల తర్వాత పిచికారీ చేయాలి. ఇప్పటికీ కలుపు కూడా మొలిచి ఉంటుంది.

నారుమడి

బ్యూటాక్లోర్ (మాచెటి) 50 మి.లీ లేదా ప్రెటిలాక్లోర్, సెఫనల్ (సోఫిట్) 25 మి.లీ ఏదైనా ఒకదాన్ని ఎకరానికి సరిపడ నారు మడికి 5లీటర్ల నీటిలో కలిపి విత్తిన 8నుంచి 10 రోజులకు పిచికారీ చేసుకోవాలి.బిస్‌పైరిబాక్ సోడియం (నామినీగోల్డ్) అనే కలుపు మందును 0.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి విత్తిన 8నుంచి 10 రోజులకు పిచికారీ చేసుకోవాలి. నారు మడిలో ఊద,ఒడిపిల్లు వంటి గడ్డిజాతి కలుపు ఉన్నట్టయితే విత్తిన 15నుంచి 20 రోజులకు సైహలోఫాస్ బ్యుటైల్ అనే కలుపు మందును 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నాటిన వరి పొలంలో

నాటిన 5 నుండి 6 రోజులలోపు వాడదగిన కలుపు మందులు ఎకరానికి

-పెటిలాక్లోర్ (రిఫిట్) ఎకరానికి 500 మి.లీ లేదా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ (సాథి) 80 నుండి 100 గ్రా. లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ (0.6 శాతం), ప్రెటిలాక్లోర్ (6.0శాతం) (లోండాక్స్ పవర్‌టి) ఎకరానికి 4 కిలోల గుళికలను లేదా ప్రెటిలాక్లోర్, సేఫ్‌నర్ మందును ఎకరానికి 600 మి.లీ నుండి 800 మి.లీ వరకు లేదా బ్యూటాక్లోర్ (మాచెటి) 1.5 లీ. లేదా అనిలోఫాస్ (అనిలోగార్డ్, అరోజిన్, వీడోనిల్, అనిల్‌ధన్)500 మి.లీ నుండి 750 మి.లీ లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రాముల (టాప్‌స్టార్) పైన సూచించిన మందులలో ఏదైనా ఒక దానిని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

గడ్డిజాతి కలుపు నివారణకు నాటిన 15 నుండి 20 రోజులకు వాడవలసిన కలుపు మందులు

సైహలోపాప్ పి బ్యూటైల్ (క్లించర్, రాప్‌అప్) 300 నుండి 400 మి.లీ ఒక ఎకరానికి లేదా ఫినాక్సాప్రాప్ పి ఈథైల్ (విప్ సూపర్, ప్యూమా సూపర్) ఒక ఎకరానికి 200 నుండి 250 మి.లీ చొప్పున పిచికారి చేయాలి.

వెడల్పాకు కలుపు నివారణకు 25 నుంచి 30 రోజులకు వాడాల్సిన కలుపు మందులు

2,4-డి సోడియం సాల్ట్ (ఫెర్నాక్సాన్, సాలిక్స్) 500 నుంచి 600 గ్రా.

గమనిక: 2,4 - డి సోడియం సాల్ట్‌ని పిచికారి చేసినప్పుడు వెడల్పాకు పంటలైన పత్తి పొద్దుతిరుగుడు వంటి వాటి మీద పడకుండా చూడాలి.

గడ్డి జాతి, తుంగ జాతి వెడల్పాకు కలుపు నివారణ

బిస్‌పైరి బాక్‌సోడియం (నామినిగోల్డ్) ఎకరానికి 100 మి.లీ 15 నుండి 20 రోజుల మధ్య పిచికారి చేసుకోవాలి. సైహలోపాప్ పి బ్యూటైల్ (క్లించర్, రాప్‌ఆప్) ఎకరానికి 250 నుంచి 300 మి.లీ, మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్, క్లోరిమ్యూరాన్ ఈథైల్ (అల్‌మిక్స్) 8 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి 20నుంచి 25 రోజుల మధ్యన పిచికారి చేయాలి. లేదా అజిమ్‌సుల్ఫురాన్ (సెగ్‌మెంట్) 26 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి 15 నుంచి 20 రోజుల మధ్య పిచికారి చేసుకోవాలి. లేదా పినోక్స్యులమ్ (గ్రానైట్) ఒక ఎకరానికి 36 మి.లీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి 20 నుంచి 25 రోజుల మధ్య పిచికారి చేయాలి.

మొక్కజొన్న:

ప్రి ఎమర్జెన్స్: అట్రజిన్ (అట్రటాప్, సోలారో, మిల్‌జిన్,సూర్య) అనే మందును ఎకరానికి 800 గ్రా.నుండి 1.0 కి.గ్రా. విత్తిన 24 నుంచి 48 గంటల లోపు లీటరు నీటికి 4నుంచి 5గ్రా. చొప్పున తేమగల నేలపై పిచికారీ చేయాలి. లేదా పెండి మిథాలిన్ (స్టాంప్, పెండిస్టార్)లేదా అలాక్లోర్(లాసో, అలాటాప్) అనే మందును ఎకరానికి 1.0 నుంచి 1.5 లీటర్లు అంటే లీటరు నీటికి 1.0నుంచి 1.25 మి.లీ లేదా ఆక్సిఫ్లోర్‌ఫెన్ గోల్డ్, ఆక్సిగోల్డ్ 200 మి.లీ అంటే 1 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 24 నుండి 48 గంటల లోపు తేమగల నేలపై పిచికారి చేయాలి.

ఒకవేళ వెడల్పాకు కలుపు మొక్కలు మాత్రే ఉన్నట్టయితే 2,4-డి సోడియం లవణం (ఫెర్నాక్సాన్, సాలిక్స్) ఎకరానికి 400నుంచి 600గ్రా లేదా అట్రజిన్ ఒక ఎకరానికి 0.8నుంచి 1.0 కిగ్రా. విత్తిన 20నుంచి 30 రోజుల మధ్య పిచికారి చేసుకోవాలి. రైతులు కలుపు మందులు వాడకుండా నల్లని పాలిథాన మల్చ్‌ను '25.మి.మి మందం గల అతినీలతోహిత కిరాణాలను తట్టుకునే రకం, బోదెల



మీద పరిచికూడా కలుపును నివారించుకోవచ్చు.

చెరకు: చెరకు తొలి దశలో నిదానంగా పెరుగుతుంది. కనుక కలుపు పెరిగేందుకు ఎక్కువ అనుకూలత ఉంటుంది. అందు వల్ల దాదాపుగా పంట ఏపుగా పెరిగే దశ అంటే 120 రోజుల వరకు కూడా పొలంలో కలుపును నివారించాల్సి ఉంటుంది. పిలకలు వేసే దశ అనేది చెరకులో ముఖ్యమైనది. నాటిన 60 నుంచి 120 రోజల వరకు కనిపిస్తుంది. ఈ దశలో కలుపును అరికడితే దాదాపు 60 శాతం దాకా దిగుబడి పెరగ డమే కాకుండా 50శాతం వరకు నీటిని ఆదా చేసుకోవచ్చు. నాటిన వెంటనే వాడదగిన కలుపు మందులు (ప్రిఎమర్జెన్స్) అట్రజిన్ (అట్రటాప్, సోలారో, మిల్‌జిన్,సూర్య) అనే మందు 1.6 నుండి 2.0కి.గ్రా ఎకరానికి అంటే లీటరు నీటికి 8నుండి 10గ్రా. చొప్పున లేదా ఆక్సీఫ్లోర్‌ఫెన్ (గోల్ లేదా అక్సిగోల్డ్) ఎకరానికి 400 మి.లీ అంటే 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి చెరకు నాటిన రెండు రోజులలోపు పిచికారి చేయాలి.

చెరకులో జొన్నమల్లె నివారించడానికి

అట్రజిన్ (అట్రటాప్, సోలారో,మిల్‌జిన్,సూర్య) అనే మందు 1.6 నుండి 2.0 కి.గ్రా ఎకరానికి అంటే లీటరు నీటికి 8నుండి 10గ్రా. చొప్పున కలిపి చెరకు నాటిన రెండు రోజులలోపు పిచికారి చేసుకొని 45 రోజుల తర్వాత చేతితో కలుపు తీసుకొని, 60 రోజుల తర్వాత మట్టిని పైకి ఎగదోసి 90 రోజుల వయస్సులో 2,4-డి సోడియం 1 కిలో అంటే లీటరు నీటికి 5గ్రా. చొప్పున 20గ్రా. యూరియాలో కలిపి పిచికారి చేసుకోవాలి. 120 రోజుల తరువాత ఎండిన చెరకు ఆకులను ఇతర చెత్తచెదారం ఏరి సాళ్ల మధ్యలో నేల మీద పర్చాలి.

చెరకులో తుంగ సమస్యను అధిగమించడానికి సెమ్‌ప్రా అనే మందును ఒక ఎకరానికి 36గ్రాముల చొప్పున 150 లీటర్ల నీటిలో కలిపి పంటకు మొదటి నీటి తడి ఇచ్చిన తరువాత తుంగా 3నుంచి 6ఆకుల దశలో ఉన్నప్పుడు పిచికారి చేసుకోవాలి. ఇతర కలుపు సమస్యలు కూడా ఉన్నట్టయితే సెమ్‌ప్రా మందుతో పాటు 300 గ్రాముల బూస్టెన్ మందును కలిపి చల్లుకుంటే అన్ని రకాల కలుపు మొక్కలు చనిపోతాయి.

అపరాలు

పెసర, మినుము Flx, : పోస్ట్ ఎమర్జెన్స్- ఇమాజిథాఫైర్ (పర్స్యూట్, దీనామాజ్, లగాన్) అనే మందును ఎకరానికి 250నుంచి 300మి.లీ పిచికారి చేసుకోవాలి. అంటే లీటరు నీటికి 1.25-1.5 మి.లీ చొప్పున కలిపి 15నుంచి 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి.గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నట్టయితే క్విజాలోఫాప్ పి-ఇథైల్ (టర్గాసూపర్) మందును 400 మి.లీ అంటే లీటరు నీటికి 2 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్ (ఎజిల్) 250 మి.లీ అంటే 1.25 మి.లీ లీటరునీటికి చొప్పున పిచికారి చేసుకోవాలి.

నూనె గింజలు

వేరుశనగ: పెండిమిథాలిన్ (స్టాంప్, పెండిగార్డ్, పెండిస్టార్) లేదా అలాక్లోర్ (లాసో, అలాటాప్) అనే మందును 1.0 నుండి 1.25 లీటర్లు అంటే లీటరు నీటికి 5.0 నుండి 6.0 మి.లీ చొప్పున లేదా ఆక్సీఫ్లోర్‌పెన్ మందును ఒక ఎకరానికి 100 మి.లీ చొప్పున పంట విత్తిన రెండురోజుల్లోపు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పైరు, కలుపు మొలకెత్తిన తరువాత వాడదగిన కలుపు మందులు (పోస్ట్ ఎమర్జెన్స్) ఇమాజితపిల్ (పర్స్యూట్, దీనామాజ్,లగాన్) అనే మందును ఎకరానికి 250 నుంచి 300 మి.లీ అంటే లీటరు నీటికి 1.5-2.0 మి.లీ చొప్పున లేదా ఇమాజితపిర్, ఇమాజామాక్స్ మిశ్రమాన్ని (ఒడిస్సీ) ఎకరానికి 40 గ్రా. చొప్పున పంట విత్తిన 15నుంచి 20 రోజుల మధ్య పిచికారి చేసినట్టయితే అన్ని రకాల కలుపు మొక్కలు నివారించబడతాయి.

పొద్దుతిరుగుడు,ఆముదం: పెండిమిథాలిన్ (స్టాంప్,పెండిగార్డ్, పెండిస్టార్) లేదా అలాక్లోర్ (లాసో, అలాటాప్) అనే మందును 1.0నుంచి 1.25 లీటర్లు అంటే లీటరు నీటికి 5.0నుంచి 6.0 మి.లీ చొప్పున కలిపి విత్తిన రెండు రోజుల్లోపు పిచికారి చేసుకోవాలి.

కూరగాయలు

క్యారెట్, టమాట - పెండి మిథాలిన్ (స్టాంప్,పెండిగార్డ్, పెండి స్టార్) లేదా అలాక్లోర్ (లాసో, అలాటాప్) ఎకరానికి ఒక లీటరు మందును అంటే లీటరు నీటికి 5 మి.లీ చొప్పున కలిపి విత్తిన రెండు రోజుల్లోపు తేమ గల నేలపై పిచికారి చేసి, నెల రోజుల్లోపు ఒకసారి అంతరకృషి చేసుకోవాలి.



డాక్టర్. అమరపల్లి గీత
శాస్త్రవేత్త ప్లాంట్ ఫిజియాలజీ విభాగం
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం
పాలెం, మహబూబ్‌నగర్ జిల్లా

జొన్నలో మొగి పురుగు నివారణ ఎలా ?

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

ప్ర. ఉల్లిలో పచ్చపురుగు నివారణ చెప్పండి?

- సంపత్, తడికల్ గ్రా, శంకర్‌పట్నం మం, కరీంనగర్ జిల్లా

జ. ఉల్లిలో ఆకుతినే పచ్చపురుగు నివారణకు కార్బరిల్ 3గ్రా.లేదా ప్రొఫినోఫాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ప్ర. బొప్పాయి కాయలు మొత్తబడి బూజులా ఏర్పడి కుళ్లిపోతున్నాయి ఏం చేయాలి?

- సంతోష్ రెబెన్న గ్రా, మం, కొమురంభీమ్ జిల్లా

జ. బొప్పాయి కాయల మీద పండు ఈగ గుడ్లను సూదిలాంటి మొనతో జొప్పిస్తుంది. ఈ గుడ్ల నుంచి వచ్చే లార్వాలు కాండం గుజ్జును ఆశించి నష్టపరుస్తాయి. నివారణకు తోటను శుభ్రంగా ఉంచాలి. మిథైల్ యుజినాల్ 1 మి.లీ, కార్బోఫ్యూరాన్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి 5 సమ భాగాలుగా పొలంలో అక్కడక్కడ ఉంచి మగ పురుగులను నాశనం చేయాలి.

ప్ర. వరిలో బతుకమ్మ గురించి తెలపండి? -ధనుంజేయ, బోధన్, నిజామాబాద్ జిల్లా

జ. బతుకమ్మ ఖరీఫ్, రబీకి అనువైన రకం. కాలపరిమితి 120నుంచి 125 రోజులు. ఎకరానికి 3 టన్నుటల దిగుబడి వస్తుంది. సన్న గింజ, కాటన్ దొర సన్నాలు (ఎమ్‌టివి-1010) పోలి ఉంటుంది. గింజ రాలడం తక్కువ.

4.ప్ర. జొన్నలో మొగి పురుగు నివారణ చెప్పండి? -వెంకట్‌రావు, మన్నూర్ గ్రా, సంగారెడ్డి జిల్లా

జ.మొగి పురుగు, పైరును 30 రోజుల తర్వాత నుండి పంట కోసేవరకు ఆశించి గుండ్రని రంధ్రాలు ఆకులపై ఏర్పడతాయి. మొవ్వు చనిపోయి తెల్ల కంకి ఏర్పడుతుంది. కాండాన్ని చీల్చి చూస్తే ఎర్రని కణజాలం కనబడుతుంది. కంకి మొవ్వులో నుండి బయటకురాదు. నివారణకు విత్తిన 35 నుంచి 40 రోజలలోపు ఎకరానికి 4కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

ప్ర. వరిలో ఆకులు పసుపు రంగులోకి మారి ఎర్రబడుతున్నాయి. ఏం చేయాలో తెలపండి?

- హస్నరెడ్డి, కల్వకుర్తి గ్రా, మం, నాగర్ కర్నూల్ జిల్లా

జ. వరి పంటలో ఎండలు ముదిరే కొద్దీ తామర పురుగులు, నల్లి వృద్ధి పెరుగుతుంది. ఈ పురుగులు లేత ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల లేత ఆకులు పసుపు రంగులోకి మారి కొనలు ఏర్పడతాయి. నివారణకు డైఫెన్‌థోరియాన్(పెగాసిస్) 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



చామగడ్డ సాగు ఇలా...

చేమగడ్డ : ఆలుగడ్డ, మొరం గడ్డ మాదిరిగానే దీన్ని చేమగడ్డ అంటారు. దీన్ని పులుసు కూరగాను ఫ్రైగాను చేసుకుంటారు. ఇది ఉష్ణ మండల పంట. తేమ భూమిలో అధికంగా పండుతుంది.

నేలలు: నీటి వసతి కలిగి, నీరు బయటికి పోయే సదుపాయం గల నేలలు అనుకూలం. వేసవిలో భూమిని 30 న ఉంచి 40 సెం.మీ లోతుగా దున్నాలి. తొలకరి వర్షాలకు 2-3 సార్లు గొర్రుతో మెత్తగా దుక్కి దున్ని చదును చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 8-10 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు, 24 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువును సూపర్ ఫాస్ఫేట్ రూపంలో కలియ దున్నాలి.

నాటే సమయం: తెలంగాణలో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు నాలడానికి అనుకూలం.

రకాలు: శతముఖి 6నుంచి 7 నెలల, ఎకరానికి 8 టన్నులు, 45 ఇంటు 30 సెం.మీ దూరంలో నాటుకోవాలి.కెసిఎస్-2 8నెలలు, 14 టన్నుల దిగుబడి, 45 ఇంటు 45 సెం.మీ దూరం. కెసిఎస్-3 5 నెలలు, 9.6 టన్నులు, 45 ఇంటు 35 సెం.మీ, ఆర్ఎన్‌సిఏ-1 కాలపరిమితి 6నెలు ఎకరానికి 8టన్నుల దిగుబడి, 45ఇంటు 30 సెం.మీ దూరం నాటుకోవాలి.

విత్తే దూరం: ఎకరానికి 300 నుంచి 400 కిలోల విత్తనంగా తల్లిదుంపలు వాడితే దిగుబడి పెరుగుతుంది.

విత్తనశుద్ధి: విత్తన దుంపలను 10 లీటర్ల నీటికి 50 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 25 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపిన ద్రావణంలో 15 నిమిషాలు ముందు తీసి నీడలో ఆరబెట్టి వెంటను నాటుకోవాలి.

ఎరువులు: ఎకరానికి 10 టన్నులు మాగిన పశువుల ఎరువు 24 కిలోల భాస్వరం, 49 కిలోల నత్రజని, 32 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి. పశువుల ఎరువు, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో, మూడు సమభాగాలుగా చేసి దుంప మొలకెత్తిన తర్వాత 30.60.90 రోజులలో వేయాలి. ఎరువులను మొక్క రెండు వైపుల గుంటల్లో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి పెట్టాలి.

అంతరకృషి: మొదటిదఫా తడిపెట్టిన తర్వాత తేమ ఉన్నప్పుడు ఎకరానికి 2.0 లీ బ్యూటాక్లోర్ లేదా 1.3లీ పెండిమిథాలిన్ 30 శాతం లేదా 200 మి.లీ ఆక్సీఫ్లోరోఫిన్ 22 శాతంలలో ఏదో ఒక దానిని 200 లీ. నీటిలో కలిపి భూమిపై పిచికారీ చేయాలి. 40నుంచి 45 రోజుల తర్వాత పల్చగా మొలిచిన కలుపును కూలీలతో తీయించాలి.

పొగాకు లద్దెపురుగు: పంటపై ఆశించి ఆకులను పూర్తిగా తినేసి నష్టాన్ని కలుగ చేస్తుంది. పొగాకు లద్దె పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటించాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టాలి. 250 లార్వాలను సమానమైన ఎన్‌పివి వైరస్ ద్రావణం వారానికి ఒకసారి చొప్పున 4 వారాలు పిచికారి చేయాలి. సాలులో అక్కడక్కడ ఆముదపు మొక్కలు వేసి వాటిపై ఉన్న గుడ్ల సంచులను ఏరి నాశనం చేయాలి. పురుగు తొలి దశలో క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్2 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పురుగు చివరి దశలలో విషపు ఎరలను పెట్టాలి. దీని కొరకు 5 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, 500గ్రా. మిథోమిల్ లేదా కార్బరిల్ 50 శాతం తగినంత నీటికి కలిపి ఉండులుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో పెట్టాలి.

నల్లి: ఆకుల అడుగు భాగాన గుంపులుగా చేరి రసాన్ని పీల్చడం వల్ల పత్రహరితాన్ని కోల్పోయి ఆకులు రాలి పోతాయి. త్వరగా ఎండిపోతాయి. ఆకు తొడిమలపై వస్తే ఆకుపూర్తిగా మాడిపోతుంది. లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా డైమిథోమార్ఫ్, మాంకోజెబ్ కలిపిన మందును లీటరు నీటికి 2 గ్రా. చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసి ఈ తెగులును అరికట్టవచ్చు.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా
'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్,
ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500020.
ఫోన్: 8332995392,
kisan@navatelangana.com

వ్యవసాయ సూచనలు

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 30-38 డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 17-26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 39 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అయ్యే అవకాశం ఉంది.

వరి: వరిలో అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రా.ట్రైసైక్లోజోల్ లేదా 1.5 ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ కాసుగామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవదిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణం దోమపోటు ఉధృతితని బట్టి డైనోటేఫ్యూరాన్ 0.4 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వరిలో కంకినల్లి ఉనికి గమనించడమైంది. నివారణకు స్పైరోమేసిఫిన్ 1.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వరిలో కంకినల్లి ఉనికి గమనించడమైంది. నివారణకు స్పైరోమేసిఫిన్ 1.0 మి.లీ, ప్రొపికోనజోల్ 1.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణంలో వరి ఈగ ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న: మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పశుగ్రాస పంటలు: నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చు. వరిమాగాణుల్లో జొన్న, సజ్జ, మొక్కజొన్న, పిల్లిపెసర, జనుము, ఉలవలు వేసుకోవచ్చు.

పండ్లతోటలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు గమనించినట్టయితే నివారణకు 1.0 మి.లీ లాంబ్డా సహలోత్రిన్. 1గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉకుముడత పురుగు నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మి.లీ ప్రోఫినోఫాస్ మందును లీటరు నీటికి కలిపి లేత చిగుర్ల దశలోనే 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

నల్లి: 3 మి.లీ నీటిలో కరిగే గంధకం లేదా 5.0 మి.లీ డైకోఫాల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వల్ల తామర పురుగుల ఉధృతి పెరిగి టమాట స్పాటేడ్ విల్ట్ వైరస్ తెగులు వ్యాపించే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తామర పురుగుల నివారణకు 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. రసం పీల్చే పురుగులు గమనించినట్టయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలో డైమండ్ రెక్కల పురుగు గమనించడమైంది. నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ స్పినోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పంట కోతకు 15 రోజుల ముందు పిచికారి చేయాలి. మిరపలో ఎర్రనల్లి గమనించడమైంది. నివారణకు 1.25 మి.లీ స్పైరోమేసిఫెన్ లేదా 2 మి.లీ ఫెన్ పైరాక్సిమెట్ లేదా 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 5 మి.లీ డైకోఫాల్ మందను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మిరపలో తామర పురుగులు ఆశించడమైంది. నివారణకు 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వల్ల కూరగాయ పంటలో తామర పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ, ఉధృతి పెరిగి వైరస్ తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉంటుంది. రసం పీల్చే పురుగుల నివారణకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రా. థయోమిథాక్సాం మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పశుపోషణ: గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, అవులు, బర్రెల్లో గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకేందుకు అనుకూలం కనుక వీటి నివారణకు టీకాలు వేయించాలి.



2019 వరల్డ్ కప్‌కు అర్హత

విండీస్‌కు ఊరట

హరారే : నిలకడగా వైఫల్య యాత్ర కొనసాగిస్తూ తొలిసారి చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన వెస్టిండీస్.. చరిత్రలో తొలిసారి ఓ ప్రపంచకప్‌లో లేకుండా పోయే ప్రమాదం నుంచి తప్పించుకున్నది. ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్‌లో ముందంజ వేసిన వెస్టిండీస్ 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. స్కాట్లాండ్‌తో కీలక మ్యాచ్‌ను డక్‌వర్త్ పద్ధతిలో గెలుపొందిన విండీస్.. క్వాలిఫయర్ టోర్నీ ఫైనల్లోకి చేరుకున్నది. మిగతా మ్యాచుల ఫలితంతో సంబంధం లేకుండా విండీస్ నేరుగా ప్రపంచకప్‌లోకి ప్రవేశించింది. క్వాలిఫయర్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కరీబియన్లు 198 పరుగులకే కుప్పకూలారు. ఛేదనలో స్కాట్లాండ్ 35.2 ఓవర్లలో 125/5తో కొనసాగుతోంది. ఈ దశలో మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కల్గించాడు. వర్షం ఆగకపోవటంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఐదు పరుగుల తేడాతో విజయం విండీస్ సొంతమైంది. తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌ను నిరాశకు గురైన స్కాట్లాండ్ ప్రపంచకప్ ఆశలు ఆవిరయ్యాయి. మరో ప్రపంచకప్ బెర్త్ కోసం జింబాబ్వే, అఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్‌లూ పోటీ పడుతున్నాయి.



డకౌట్ అయినా బాగుండేది!

- కానీ అందుకు మనసు అంగీకరించదు
- బంగ్లాతో ఫైనల్లో ఇన్నింగ్స్‌పై విజయ్ శంకర్

నవతెలంగాణ-చెన్నై

బంగ్లాదేశ్‌తో నిదహాస్ ట్రోఫీ ముక్కోణపు టీ20 ఫైనల్లో దినేశ్ కార్తీక్ వీరోచిత ఇన్నింగ్స్‌కు అభిమానులు ఎంతగా ఫిదా అయ్యారో.. యువ క్రికెటర్ విజయ్ శంకర్ బ్యాటింగ్ వైఫల్యంపై అంతే చిరాకు పడ్డారు. కీలక తరుణంలో ఓ ఓవర్‌ను మెయిడిన్ చేసిన విజయ్ అసలు బంతిని తాకేందుకే నానా తంటాలు పడ్డాడు. దినేశ్ కార్తీక్ విధ్వంసం లేకుంటే.. ఆ ఓటమి శంకర్ ఖాతాలోనే పడిపోయేది!

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 49.14 సగటు, 2012-13 తర్వాత దేశవాళీ క్రికెట్‌లో 1500 పైచిలుకు పరుగులు చేసిన ఆరుగురు ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు, అత్యంత దూకుడుగా ఆడగలడనే ట్యాగ్ విజయ్ శంకర్ సొంతం. నిజానికి 2016లో ఆస్ట్రేలియాలో భారత్-ఏ పర్యటనలో విజయ్ శంకర్ గాయపడటంతోనే హార్దిక్ పాండ్యకు అవకాశం లభించింది. అంతటి ప్రతిభావంతుడైన విజయ్ శంకర్ ఉత్కంఠ ఫైనల్లో తడబడ్డాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో విజయ్ శంకర్‌కు బ్యాట్స్‌మన్‌గా అదే తొలి ఇన్నింగ్స్ కావటం గమనార్హం. దీనిపై విజయ్ శంకర్ తన మనోగతం వెల్లడించాడు.

సానుభూతితో మరింత వేదన!

'నా తల్లిదండ్రులు, స్నేహితులు నన్ను అర్థం చేసుకున్నారు. కానీ సానుభూతి సందేశాలు సోషల్ మీడియాలో వస్తున్నాయి. కానీ నేను విషయానికి దూరంగా జరిగే ప్రయత్నం చేస్తున్నాను. అటువంటి సమయంలో ఈ సానుభూతి సందేశాలు మరింత వేదన రగిలిస్తున్నాయి. సానుభూతి తెలిపే వారి ఉద్దేశం వేరు అయినా, అది నా విషయంలో పని చేయటం లేదు' అని విజయ్ శంకర్ పేర్కొన్నాడు. ఆ రోజు నాకు ప్రతికూలంగా సాగింది. మరిచిపోవటం ఎంతో కష్టంగా ఉంది. కానీ ఇక్కడి నుంచి ముందుకెళ్లటం అవసరం. ఆ ఒక్క ఇన్నింగ్స్ మినహాయిస్తే.. టోర్నీలో మంచి ప్రదర్శన చేశాను. టీమ్ ఇండియాకు ప్రాతినిథ్యం వహిస్తున్నప్పుడు ఇటువంటి సంఘటనలు జరుగుతాయని అంగీకరించాలి. ఒక వేళ మ్యాచ్‌ను నేను గెలిపిస్తే.. సోషల్ మీడియా స్పందన పూర్తిగా భిన్నంగా ఉండేదని శంకర్ అభిప్రాయపడ్డాడు. ఫైనల్లో రెండో, మూడో బంతికే డకౌట్ అయినా బాగుండేది. నా పేలవ ప్రదర్శనపై ఎవ్వరూ బాధపడేవారు కాదు. కానీ మనసు అందుకు అంగీకరిస్తుందా? కొన్ని సవాళ్లు స్వీకరించాలి, అవి కష్టమైనా ఇదీ అంతే. అందుకంటే ఈ పరిస్థితినే అంగీకరిస్తున్నాను. ఫైనల్లో విజయం తర్వాత అందరూ సంబరాల్లో మునిగిపోయారు. కానీ నేను బాధాతప్త హృదయంతో ఉన్నాను. నిజానికి నన్ను నేను హీరోను చేసుకోవడానికి నాకొచ్చిన అవకాశమది. మ్యాచ్‌ను నేనే ముగించి ఉండాల్సింది అని శంకర్ అన్నాడు.

ఆ బౌండరీని గుర్తించరా?

ఇక అందరూ ఫైనల్లో నేను వదిలేసిన బంతుల్నే గుర్తుపెట్టుకున్నారు. నిజానికి ముస్తాఫిజుర్ ఎంతో కఠినమైన బంతుల్ని విసిరాడు. నేను భారీ షాట్లు బాదాలని ఎదురుచూశాను. అందుకు బదులుగా స్ట్రయిక్ రొటేట్ చేయాల్సింది. దేశవాళీలో నా రికార్డు చూస్తే మీకూ తెలుస్తుంది. నేను స్ట్రయిక్ రొటేట్ చేయడానికే ఇష్టపడతాను. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రవిశాస్త్రిలు ఇలాంటి సహజమే, బాధపడకు అని చెప్పారు. ' ఆ సమయంలో దినేశ్ కార్తీక్ ఓ విషయం చెప్పాడు. క్రీజులో ఒకే స్టాన్స్‌తో ఉండి.. బౌండరీకి ప్రయత్నించు. సౌమ్య సర్కార్ వేసిన ఆ బంతికి బ్యాట్‌ను జోడించాలని అనుకున్నాను. ఆ బంతి బౌండరీ దాటింది. ఆ ఫోర్‌తోనే ఆఖరి బంతికి కార్తీక్ పని సులువైంది. లేదంటే ఛేదన మరో విధంగా ఉండేది. కానీ దీన్ని ఎవ్వరూ గుర్తించటం లేదు' అని విజయ్ అన్నాడు. తర్వాతి సిరీస్‌లకు జట్టులోకి ఎంపిక కావటం నా చేతుల్లో లేదు. కానీ ఈ తరుణంలో వెంటనే ఐపీఎల్ రావటం నాకు కలిసొచ్చే అంశం. ఇక్కడ ఢిల్లీ డెర్‌డెవిల్స్ తరఫున నేనేంటో నిరూపించుకుంటానని విజయ్ నమ్మకం వెలిబుచ్చాడు.

నేటి నుంచి మహిళల ముక్కోణం



ముంబయి : ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన టీమ్ ఇండియా అమ్మాయిల జట్టు.. నేటి నుంచి మరో సవాల్‌కు సిద్ధమైంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లతో హర్మన్‌ప్రీత్ కౌర్‌సేన టీ20 ట్రై సిరీస్‌లో తలపడబోతుంది. ముంబయిలో నేడు జరుగనున్న తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో టీమ్ ఇండియా ఢీకొట్టనున్నది. దక్షిణాఫ్రికాను పొట్టి ఫార్మాట్‌లో ఓడించిన మనోళ్లు.. అదే జోరు ఇక్కడా కొనసాగించాలని చూస్తున్నారు. సఫారీ పర్యటనలో గాయానికి గురైన సీనియర్ పేసర్ జులన్ గోస్వామి ముక్కోణపు టోర్నీకి ఫిట్‌నెస్ సాధించింది. నేటి మ్యాచ్‌లో గోస్వామి బంతి అందుకోనున్నది. ఇక స్పిన్నర్ ఏక్తా బిస్త్‌కు సైతం సెలక్టర్లు మళ్లీ పిలుపునందించారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ఓటమితో పాఠాలు నేర్చుకున్న అమ్మాయిలు.. ముక్కోణంలో మెరువాలనే తపనతో ఉన్నారు. నేడు ఆస్ట్రేలియా, భారత్ తొలి టీ20 పోరు ఉదయం 10 గంటలకు ఆరంభం కానున్నది.

మళ్లీ అదే కథ?

న్యూఢిల్లీ : రియోలో భారత క్రీడా మంత్రి విజయ్ గోయెల్ సహా ఇతర అధికారులు తమ ప్రవర్తనతో పరువు తీశారు. అథ్లెట్ల కంటే అధికార బృందమే రియోకు అధిక సంఖ్యలో వెళ్లారు. అథ్లెట్లు ఎకానమీ తరగతిలో ప్రయాణించగా, అధికారులు బిజినెస్ క్లాస్‌లో రియోకు చేరారు. ఏప్రిల్ 4 నుంచి కామన్‌వెల్త్ గేమ్స్ ఆరంభం కానున్న నేపథ్యంలో భారత బృందంపై మరోసారి చర్చ సాగుతోంది. 222 మంది అథ్లెట్లతో పాటు 106 మంది అధికారులు వెళ్తున్నారు. వీరిలో 57 మంది కోచ్‌లు, 19 మంది వైద్యులు, ఫిజియోలు, ఏడుగురు మేనేజర్లు కాగా 41 మంది అదనపు అధికారులున్నారు. రియోలో కనీస నిబంధనలు పాటించని కారణంగా భారత క్రీడా మంత్రి గోయెల్ గుర్తింపు కార్డు రద్దు చేస్తామని నిర్వాహకులు హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ సారి కూడా ఒలింపిక్ సంఘం జంబో అధికార బృందాన్ని ఆస్ట్రేలియాకు పంపుతోండగా.. అక్కడేం జరుగుతుందో చూడాలి!.



ఐపీఎల్‌లో డీఆర్ఎస్

- ఆరంభ వేడుకులకు కెప్టెన్లు దూరం
- ఐపీఎల్ చైర్మెన్ రాజీవ్ శుక్లా

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు మరో హంగు తోడైంది. ఈ సీజన్ నుంచి అంపైర్ నిర్ణయ సమీక్ష విధానం (డీఆర్ఎస్) అమల్లోకి రానున్నది. ఈ మేరకు ఐపీఎల్ చైర్మెన్ రాజీవ్ శుక్లా వెల్లడించారు. 'అవును, ఈ ఆలోచన కొన్ని ఏండ్లుగా అనుకుంటున్నాం. ఈ సీజన్‌లో అంపైర్ నిర్ణయాలపై ఆటగాళ్లు సమీక్ష కోరవచ్చు' అని శుక్లా పేర్కొన్నారు. టాటా నెక్సాన్‌తో భాగస్వామ్య ఒప్పందం తర్వాత మీడియాతో మాట్లాడిన రాజీవ్ శుక్లా... ప్రతి మ్యాచ్‌లో అత్యధిక స్ట్రయిక్ రేట్, టోర్నీలో మెరుగైన స్ట్రయిక్ రేట్ కల్గిన ఆటగాళ్లకు టాటా నెక్సాన్ బహుమతులు అందజేస్తుందని తెలిపారు. పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) డీఆర్ఎస్‌ను అమలు చేస్తున్న తొలి ప్రయివేట్ టీ20గా నిలువగా.. ఇప్పుడు ఐపీఎల్ ఆ జాబితాలో చేరబోతుంది. ఆది నుంచి డీఆర్ఎస్‌పై బీసీసీఐ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. కానీ అనిల్ కుంబ్లే ఒకే సమయంలో ఐసీసీ సాంకేతిక కమిటీ చైర్మెన్‌గా, భారత జట్టు చీఫ్ కోచ్‌గా పనిచేసిన వేళ బోర్డు అధికారులను ఒప్పించి ఇంగ్లాండ్‌తో 2016 సిరీస్ సందర్భంగా డీఆర్ఎస్‌ను అమలు చేయటంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు అన్ని అంతర్జాతీయ మ్యాచుల్లోనూ ఈ విధానం కొనసాగుతోంది.

ఆరంభ వేడుకలకు కెప్టెన్లు రారు : ఐపీఎల్ ఆరంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోన్న బీసీసీఐకి మరో ఆటంకం ఎదురైంది. వృథా ఖర్చు ఎందుకని ఆరంభ వేడుకలను ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 7న తొలి మ్యాచ్‌కు ముందు జరపాలని పాలకుల కమిటీ ఆదేశించగా.. తాజాగా ఏడో తారీఖు ఆరంభోత్సవానికి అన్ని జట్ల కెప్టెన్లు హాజరు కావటం లేదు. ఏప్రిల్ 7న ముంబయిలో ఎనిమిది జట్ల కెప్టెన్లు ఆరంభ వేడుకుల హాజరైతే.. తర్వాతి రోజు మ్యాచులున్న ఢిల్లీ, పంజాబ్ సహా బెంగళూర్, కోల్‌కత సారథులు వారి జట్లతో చేరేందుకు ఇబ్బంది పడే అవకాశం ఉంది. దీంతో ఏప్రిల్ 6న కెప్టెన్లందరితో షూట్ నిర్వహించి ఆ రోజు సాయంత్రమే వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరంభ వేడుకుల్లో కెప్టెన్ల ప్రతిజ్ఞ వీడియోను చూపించనున్నారు. ఈ మేరకు బీసీసీఐ అధ్యక్షుడు సికె ఖన్నా సూచనప్రాయంగా తెలిపాడు.

షమి వ్యక్తిగత విషయాలు పట్టించుకోం : మహ్మద్ షమి వ్యక్తిగత విషయాలను పట్టించుకోమని, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై మా దర్యాప్తు ఉంటుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. 'నీరజ్ కుమార్ నేతృత్వంలోని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం షమిపై అతడి భార్య చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోంది. నివేదిక త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాం. షమి ప్రయివేట్ అంశాలతో మాకు సంబంధం లేదు. నివేదిక రాగానే మా నిర్ణయం వెల్లడిస్తాం. దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. నీరజ్ కుమార్ ఆ పనిలోనే నిమగ్నమయ్యారు' అని శుక్లా పేర్కొన్నాడు. మహ్మద్ షమిని దుబాయ్‌లో కలిసిన మాట వాస్తవమేనని, కానీ ఎలాంటి నగదు లావాదేవీలకు ఆస్కారం లేదని పాకిస్తాన్ మోడల్ అలీస్బా పేర్కొనగా.. షమి రెండు రోజుల పాటు దుబాయ్ హోటల్‌లో బస చేసినట్టు కోల్‌కత పోలీసులకు బీసీసీఐ తెలిపిన సంగతి తెలిసిందే.



స్టీవ్ స్మిత్ అసంతృప్తి

కేప్‌టౌన్ : రెండో టెస్టు సందర్భంగా తనను ఢీకొట్టిన దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడపై రెండు టెస్టుల నిషేధం ఎత్తివేస్తూ ఐసీసీ అప్పీల్ కమిషనర్ తీసుకున్న నిర్ణయం పట్ల ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. లెవల్ 2 తప్పిదం ప్రకారం ప్రత్యర్థి ఆటగాడితో భౌతిక దాడికి పాల్పడిన రబాడకు మ్యాచ్ రిఫరీ మూడు డీ మెరిట్ పాయింట్లు అందజేశాడు. కానీ అప్పీల్ కమిషనర్ శిక్షను లెవల్ 2 నుంచి లెవల్ 1 కుదించాడు. దీంతో రబాడ నేటి నుంచి ఆరంభమయ్యే మూడో టెస్టులో ఆడేందుకు లైన్ క్లియర్ చేసుకున్నాడు. 'వీడియో ఫుటేజీల్లో కనిపించిన దానికంటే రబాడ కాస్త గట్టిగానే ఢీకొట్టాడు. ఆస్ట్రేలియా సరైన క్రీడాస్ఫూర్తితో ఆడిందనే అనుకుంటు న్నాను. ఆటలో మా దూకుడు, ఆధిపత్యం అలాగే కొనసాగుతుంది. ఈ నిర్ణయంతో ప్రత్యర్థి ఆటగాళ్లపై భౌతిక దాడికి దిగొచ్చనే తప్పుడు సంకేతం వెలుతుంది. మ్యాచ్ రిఫరీ నిర్ణయాల పట్ల ఆసీస్ గతంలో భిన్నాబిప్రాయాలు లేవు. కానీ ఇక నుంచి మా వైఖరిలో మార్పు చోటుచేసుకోవచ్చు' అని స్మిత్ పేర్కొన్నాడు.

కార్పొరేట్ చేతుల్లో మీడియా

ప్రజా కోణంలోనే వార్తలు : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పిలవబడుతున్న మీడియా రంగం నేడు కార్పొరేట్ కబంధ హస్తాల్లో నలిగిపోతున్నదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పలు మీడియా సంస్థలు పెయిడ్ న్యూస్‌కే అధిక ప్రాధాన్యతనివ్వటంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వార్తను వార్తగా ప్రచురించకుండా.. వార్తను తమకు అనుకూలంగా మార్చుకుని.. దానికి తమ సొంత వ్యాఖ్యానాన్ని జోడించటం ఆనవాయితీగా మారిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నిజాలను నిర్భయంగా రాస్తూ.. పాత్రికేయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ నవ తెలంగాణ దినపత్రిక ప్రజల పక్షాన నిలబడటం అభినందనీయమన్నారు. ఈ పత్రిక మరింత పురోభివృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

నవతెలంగాణ దినపత్రిక మూడో వార్షికోత్సవ సభ బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. పత్రిక సంపాదకులు ఎస్.వీరయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నవీన్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. గతంలోని పత్రికా వ్యవస్థను, ప్రస్తుత మీడియా రంగాన్ని పోల్చి అనేక విషయాలను వివరించారు. ఆ కాలంలో సురవరం ప్రతాపరెడ్డి, చలపతిరావులాంటి ప్రముఖ సంపాదకులు, పాత్రికేయులు.. నిజమైన నిబద్ధతతో ప్రజల పక్షాన నిలిచి వార్తలు రాసేవారని తెలిపారు. ప్రస్తుతం పాత్రికేయరంగంలో అలాంటి విలువలు, ప్రమాణాలు నానాటికీ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు శాస్త్రీయ, అభ్యుదయ భావాల స్థానంలో మూఢ నమ్మకాలను, మత భావాలను జొప్పించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో 'వాట్ ఈజ్ గుడ్.. వాట్ ఈజ్ బ్యాడ్...' అనే అంశాలను ప్రజలకు చేరవేయటంలో పత్రికలు క్రియాశీలక పాత్ర పోషించాలని అభిలషించారు. నవ తెలంగాణ అలాంటి పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నదని ప్రశంసించారు. ఈ సందర్భంగా నవీన్.. పలు రాజకీయాంశాలను ప్రస్తావించారు. దేశంలో వామపక్షాలు బలహీనపడటంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లెఫ్ట్ పార్టీల అనైక్యత దేశానికి నష్టదాయకమని అన్నారు. వీటిని కలపలేమా? అని ప్రశ్నించారు. వామపక్షాలు బలోపేతం కాకపోతే దేశ భవిష్యత్ అగమ్యగోచరమేనని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఎల్ఎఫ్ ఏర్పడటం ఒక శుభ పరిణామమని తెలిపారు. మన రాష్ట్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడటం ఒక గొప్ప పరిణామమని వ్యాఖ్యానించారు.

కార్పొరేట్ల గుత్తాధిపత్యం



వీరయ్య మాట్లాడుతూ.. మీడియాలో కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం పెరిగిన తర్వాత నవతెలంగాణ లాంటి పత్రికలు ఏటికి ఎదురీదుతున్నాయని చెప్పారు. అయినా శక్తి మేరకు ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పని చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ శక్తులు.. వాటి ప్రభావంతో నడుస్తున్న మీడియా మనుషులను పౌరులుగా చూడటం లేదని చెప్పారు. వారిని కేవలం వినిమయ దారులుగా మాత్రమే చూస్తున్నాయని తెలిపారు. అంతేతప్ప మనుషుల ఆకలి, హక్కులు, వారి మానసిక ఉల్లాసం, రాజకీయ హక్కుల గురించి ప్రస్తావించటం లేదని చెప్పారు. మరోవైపు అధికారంలో మోడీ ఉన్నా, మన్మోహన్ ఉన్నా లేక వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ ఎవరున్నా వారికి కుడి, ఎడమ భుజాలుగా కార్పొరేట్ మీడియా ఉంటోందని విమర్శించారు. ఈ క్రమంలో తాము ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సిబ్బంది, ఉద్యోగుల సహకారంతో, పాఠకుల ఆదరాభిమానాలతో నవ తెలంగాణ ముమ్ముందుకు సాగుతున్నదని చెప్పారు. ఇక్కడ పనిచేసే వారందరూ కడుపు కట్టుకుని పనిచేస్తున్నారని అన్నారు. మరే పత్రికలోనూ ఇది సాధ్యం కాదని తెలిపారు. నవ తెలంగాణ అనేది సిబ్బంది, పాఠకుల పత్రికని చెప్పారు. దీనికి ప్రజలే యజమానులని.. వారి ఆశీస్సులతో పత్రిక మరింత పురోగమిస్తుందని అన్నారు. నవతెలం గాణ హైదరాబాద్ ఎడిషన్ మేనేజర్ వాసు ఆహ్వానించగా ఈ కార్యక్రమంలో పత్రిక సీజీఎమ్ పివి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ నాందేవ్ వందన సమర్పణ చేశారు. ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన జస్టిస్ గోపాలగౌడ అనారోగ్య కారణాల వల్ల రాలేకపోయారు. ఆయన ప్రసంగ పాఠాన్ని అసిస్టెంట్ ఎడిటర్ గడ్డం రమేశ్ చదివి వినిపించారు.

శేఖర్ స్మారక కార్టూనిస్టు అవార్డు ప్రదానం



ప్రముఖ కార్టూనిస్టు శేఖర్ స్మారకార్థం ప్రతియేటా అందజే స్తున్న 'ఉత్తమ కార్టూనిస్టు' అవా ర్డును ఈ యేడాది డెక్కన్ క్రానికల్ కార్టూనిస్టు సుభానీకి అందజేశారు. అంపశయ్య నవీన్ చేతుల మీదుగా సుభానీ ఈ అవార్డును అందుకున్నారు. తాను 30 ఏండ్లుగా కార్టూన్లు వేస్తున్నానని ఈ సందర్భంగా సుభానీ తెలిపారు. కార్టూన్‌లనేవి వంగ్యంతో కూడిన భావ వ్యక్తీకరణకు గొప్ప సాధనాలని చెప్పారు. యానిమేషన్, వెబ్ రంగాల్లో కూడా ఇప్పుడు కార్టూనిస్టులకు ఉపాధి లభించటం గొప్ప పరిణామమని తెలిపారు.



సవాళ్లు ఉన్నా ముందుకే..

వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నవతెలంగాణ, టెన్ టీవీలాంటి మీడియా సంస్థలు అనేక ఒడిదుడుకులను, ఆర్థికంగా సవాళ్లను ఎదుర్కొంటు న్నాయని తెలిపారు. ప్రభుత్వం వైపు నుంచి సహకారం లేకపోవటంతోపాటు ప్రకటనల విషయంలో కొన్ని పరిధులు, పరిమితులు ఉండటమే దీనికి కారణ మన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ మీడియా.. రాజకీయ మంటే రెండు పార్టీలు, ఇద్దరు వ్యక్తులే అనే విధంగా చిత్రీకరిస్తున్నదని తెలిపారు. దేశంలో ఇతర పార్టీలేవీ లేవనే విధంగా ఆయా సంస్థలు వ్యవహరించటం, వార్తల్ని రాయటం శోచనీయమన్నారు. పార్టీల విధానాలపై చర్చ జరక్కుండా.. వ్యక్తుల చుట్టే వార్తల్ని తిప్పటం ద్వారా నిజాల్ని ప్రజలకు తెలియకుండా దాచేస్తున్నాయని విమర్శించారు.



అంపశయ్య నవీన్ చేతుల మీదుగా బహుమతులను అందుకుంటున్న ఎస్ఎస్ఆర్ శాస్త్రి, మేకల కృష్ణ, జగదీశ్వర్

వి.హన్మంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుల ప్రదానం

సీనియర్ పాత్రికేయులు వి.హన్మంతరావు పేరిట ఏర్పాటు చేసిన ఉత్తమ జర్నలిస్టు అవార్డులను కూడా ఈ సందర్భంగా ప్రదానం చేశారు. నవతెలంగాణ సీనియర్ పాత్రికేయుడు ఎస్ఎస్ఆర్ శాస్త్రి.. మఫసిల్ నుండి మేకల కృష్ణ 2017 సంవత్స రానికి ఉత్తమ జర్నలిస్టు లుగా ఎంపికయ్యారు. వారికి అంపశయ్య నవీన్ చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. అత్యధిక ఉత్తమ కథనాలు రాసిన బ్యూరో రిపోర్టర్ బొల్లె జగదీశ్వర్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించారు. అలాగే ఉత్తమవార్తలు రాసిన మరో 20 మంది పాత్రికేయులకు, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు, మీడియా అకాడమీ అవార్డు, లాడ్లీ అవార్డులు పొందిన మరో ముగ్గురు సీనియర్ పాత్రికేయులకు కూడా బహుమతులు అందజేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.